ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక
సంపుటి 4 | సంచిక 2 ఏప్రిల్-జూన్ 2024

గురజాడ ఫౌండేషన్ (అమెరికా)
1862-1915
Gurajada Foundation (U.S.A.)
మమత-సమత-మానవత
www.gurajada.org

## విద్యా దదాతి వినయం



# ప్రకాశిక


సమగ్ర సాహిత్య సామాజిక పత్రిక





## ప్రకాశిక - పరిచయం

ఆధునిక కవితకు అడుగుజాడ అయిన మహాకవి **శ్రీ గురజాడ వేంకట అప్పారావు గారు** తలపెట్టిన పత్రిక 'ప్రకాశిక'. ఆ పత్రికని పునరుద్ధరించి ఆయన స్మృతికి ఘన నివాళి ఇవ్వాలనే ఉద్దేశంతో **గురజాడ ఫౌండేషన్ (అమెరికా)** '**ప్రకాశిక**'ను అంతర్జాల, డిజిటల్ పత్రికగా గత మూడు సంవత్సరాలుగా ప్రచురిస్తోంది. యావత్ తెలుగు జాతికీ అలనాటి భాష సంస్కృతి, సంప్రదాయం, వ్యావహారికాలను, సమకాలీన సాహితీ ప్రక్రియలను పరిచయం చేస్తూ, నేటి సమాజపు స్థితిగతులకు అద్దం పట్టే ఒక వేదికగా ప్రకాశికను రూపుదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. **ప్రకాశిక త్రైమాస పత్రిక**గా వెలువడుతోంది.


గురజాడ కలంనుండి జాలువారిన అక్షర మాలికలు ఎన్నో గురజాడ వేంకట అప్పారావు గారికి 'మహాకవి శ్రీ గురజాడ అప్పారావు'గా గుర్తింపు తెచ్చాయి. ఆయన రచనలు ఆణి ముత్యాలు, సరస సరాగాలు, ముత్యాల సరాలు. పరిసరాలని పరిశీలిస్తూ, ప్రభావితమవుతూ, మంచి అన్నది పెంచమంటూ, భాష భావ వ్యక్తీకరణకు సాధనమే కానీ పదడాంబిక ప్రదర్శనకు సూచిక కాదని నమ్మి తెలుగు భాషని తేటగా, తీయగా, సరళంగా, సరసంగా పండిత పామరులకు చేరువ చేయడంలో ఆయన సలిపిన కృషి అజరామరం, చిర స్మరణీయం.





సాంఘిక దురాచారాలని వ్యావహారిక భాషలో ఎత్తిచూపి, వ్యంగ్యాయుధంతో వాటిని కూకటివేళ్లతో సహా పెకిలించిన అరుదైన భాషావేత్త, సంఘ సంస్కర్త, మహాకవి గురజాడ వేంకట అప్పారావుగారు. అక్షరాయుధంతో మరెన్నో సాధించాలనుకున్నారో ఏమో, '**ప్రకాశిక**' పత్రికను ఆయన స్థాపించారు. అయితే, ఆ పత్రిక ఎంతోకాలం సాగిన దాఖలాలు లేవు. తొలి రాత ప్రతి దొంగిలించబడిందని ఆయన వంశీకుల ఆవేదన. ప్రకాశిక పత్రిక పర హస్తగతమైనా, అందులోని భావ తరంగాలు శతాబ్దానికి పైగా ఎన్నో తరాలను ఉత్తేజ పరుస్తునే ఉన్నాయి.













ఆ మహాకవి కాలంలో ఉన్న దురాచారాలు, మూఢవిశ్వాసాలు ఈ కాలంలో కూడా ఆధునిక

















పరిజ్ఞానంతోపాటు, ఏదో ఒక రూపంలో విరివిగా, విస్తృతంగా కొనసాగుతున్నాయి. మనుషుల లోని భయాలనీ, ఆందోళనలనీ ఆసరాగా తీసుకుని, అరకొర జ్ఞానంతో, శాస్త్రాలకి వక్రభాష్యాలతో అమాయకులని మోసంచేసే నవయుగ గిరీశాలు కోకొల్లలుగా, ఖండాంతరాలుగా వ్యాపించి ఉన్నారు. సమాజంలో, ముఖ్యంగా యువతలో హేతుబద్ధ ఆలోచనలు పెంచే ప్రయత్నం ప్రకాశిక ద్వారా చేద్దాం. గురజాడ వ్యక్తిత్వ స్ఫూర్తితో, ఆయన ఆలోచనలకు అనుగుణంగా, భాషోద్దీపన, సమాజ శ్రేయస్సులను కాంక్షిస్తూ '**ప్రకాశిక**'ని నడపాలని గురజాడ ఫౌండేషన్ (అమెరికా) సంకల్పం.


సమాజాన్ని తట్టి, కుదిపి, ఆలోచింపచేసే రచనలూ, వెన్నుతట్టి దారిచూపే దార్శనికుల వ్యాసాలు, మస్తిష్కానికి పదును పెట్టే శీర్షికలతో '**ప్రకాశిక**'ను అందంగా ముస్తాబు చేసి పాఠకులకు గత మూడు సంవత్సరాలుగా అందిస్తున్నాం. ప్రకాశికలో ప్రచురణ కోసం తెలుగు మాండలిక శోభతో వ్రాసిన రచనలని ప్రోత్సహిస్తాం. హాస్యం, వ్యంగ్యం తెలియనివాడు, నచ్చనివాడు తెలుగువాడు కాదేమో అనిపిస్తుంది! కన్యాశుల్కం ఒక ప్రభావవంత నాటకంగా నిలిచిందంటే, హాస్యం, వ్యంగ్యం, వెటకారాలని అనుపానంగా పెట్టి నిష్ఠూరాన్ని నిబ్బరంగా చెప్పడం వలనే కదా! హాస్య, వ్యంగ్యభరిత, రచనలు పంపిస్తే కళ్ళకద్దుకొని తీసుకుంటాం.

కథ, కవిత, వ్యాసం, అనువాద రచన మొదలైన సాహిత్య ప్రక్రియలకీ, సాహిత్య, సామాజిక అంశాల మీద రాసిన పరిశోధనా పత్రాల ప్రచురణకీ '**ప్రకాశిక**' ఒక విలక్షణమైన వేదికగా కొనసాగుతుంది. ముఖ్యంగా ఏ ప్రక్రియలనైనా యువతరం చేసే రచనలను ప్రకాశిక ప్రోత్సహిస్తుంది.

'**ప్రకాశిక**'ను ప్రకాశవంతంగా శోభాయమానంగా తీర్చిదిద్దడంలో సాహితీ మిత్రులు, రచయితల అండదండలు, సహకారం మాకు సదా అవసరం. '**ప్రకాశిక**'లో ప్రచురణకు రచనలు పంపమని ప్రసిద్ధ రచయితలకు, కొత్త రచయితలకు ఆహ్వానం పలుకుతున్నాం.

**ఈ పత్రిక మనందరిదీ. కలిసి పెంచుదాం.**

మీ రచనలను సులువుగా ప్రకాశిక వెబ్‌సైట్‌లో సమర్పించవచ్చు. www.prakasika.org



**ప్రధాన సంపాదకులు**

editor@prakasika.org

## సంపాదక వర్గం

**కీ.శే. శ్రీ గురజాడ అప్పారావు**
వ్యవస్థాపక సంపాదకులు

**ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ**
ప్రధాన సంపాదకులు

**ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు**
వరిష్ఠ సంపాదకులు

**ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి**
సంపాదకులు

**డా. సుంకర గోపాలయ్య**
సంపాదకులు

**శ్రీ మండలి బుద్ధప్రసాద్**
ప్రధాన సలహాదారు

సలహాదారులు
**డా.వి.ఆర్.రాసాని**
**శ్రీ విహారి**
**శ్రీ గురజాడ రవీంద్రుడు**
**శ్రీమతి అరుణ గురజాడ**





**ISSN 2766-0168**
**అంతర్జాల త్రైమాస పత్రిక**
**www.prakasika.org**
**editor@prakasika.org**


– సంపాదకీయం –

# విద్యా దదాతి వినయం

వేసవికాలం వచ్చింది అంటే పిల్లలకి, తల్లిదండ్రులకి కూడా పరీక్షా సమయం. ఎంతో కష్టపడి చదివి ఎలా రాస్తామో అన్న ఆందోళన పిల్లలకి, వాళ్ళకి ఎన్ని మార్కులు వస్తాయి, ఏ ర్యాంక్ వస్తుందో అన్నది తల్లిదండ్రుల ఆందోళన. వేసవి వల్ల వచ్చే ఉక్కబోత, వేడి కంటే పరీక్షలు, వాటి ఫలితాలు తెచ్చే తాపం ఎక్కువగా ఉంటుంది. సంవత్సరం అంతా కష్టపడి ఎన్నో ప్రశ్నలకి జవాబులు బట్టీ పట్టినా పరీక్షలో వచ్చే కొన్ని ప్రశ్నలకి జవాబులు తెలియక పోతే ఆశించిన ఫలితాలు రావు. భారతీయ విద్యావిధానంలో, ముఖ్యంగా, తెలుగు రాష్ట్రాలలో ఉన్న విద్యావిధానంలో, పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలతో పాటు డిగ్రీ పరీక్షలు కూడా విద్యార్థి యొక్క మనన శక్తి, మననం చేసిన విషయాన్ని పరీక్షలలో రాసే శక్తిని మాత్రమే పరీక్షిస్తున్నాయి. విద్యార్థులలో ఉండే సృజనాత్మకతని, సాంకేతిక అభిరుచిని ప్రోత్సహించే అవకాశాన్ని మన విద్యా విధానం కలిగించడం లేదు. కొన్ని సంస్థలు చేసిన పరిశోధన ప్రకారం భారత దేశంలోని కళాశాలలు, విశ్వవిద్యాలయాలనుండి ఉత్తీర్ణులైన వారిలో సగంమందికి పైగా ఉద్యోగార్హత లేని వారు. అంటే, వేర్వేరు సంస్థలలో పనికి అవసరమయిన నైపుణ్యం వారికి లేదన్నమాట. గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థుల మధ్య ఉన్న అంతరం తో పాటు, సాధారణ చదువులు చదువుకున్నవారికి

అవకాశాలు తక్కువ అన్న విషయం పరిశోధన చేయకుండానే చెప్పవచ్చు.

గత కొన్ని దశాబ్దాలుగా, విద్యార్థులు వారి మీద వారు పెట్టుకుంటున్న అంచనాలతో పాటు తల్లిదండ్రులు పెట్టుకుంటున్న అంచనాలు కూడా ఎక్కువగా ఉంటున్నాయి. ముఖ్యంగా, వారు సాధించలేనివి వారి పిల్లలు సాధించాలనే ఆశ, వారి బంధుమిత్రుల పిల్లలతో పోలుస్తూ వారికంటే గొప్ప చదువులు చదివి, ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందాలన్న ఆకాంక్ష మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి తల్లిదండ్రులలో ఎక్కువగా చూస్తున్నాము. ఏ డిగ్రీలు సాధిస్తే తొందరగా పెద్ద పాకేజ్ తో ఉద్యోగం వస్తుంది, లేక విదేశాలలో ఉద్యోగం పొందాలంటే ఏ చదువులు చదవాలి అన్న అంశాలమీద పిల్లల కంటే పెద్దలకే ఎక్కువ ఆసక్తి ఉండడం గమనిస్తాము. ఒకరి పిల్లలు ఇంజనీరింగ్ చదివితే, ఆ కాలనీలో ఉండే వారి పిల్లలలో ఎక్కువ మంది ఇంజనీరింగ్ చదువుకోసం ఆరాట పడే అవకాశాలు ఎక్కువ ఉండడం సాధారణంగా చూస్తాము. పిల్లల అభిరుచి గమనించి, అడిగి తగిన విద్యావకాశాలు కలిగించే తల్లిదండ్రులు కొంతమంది ఉండే ఉంటారు.

చదువు ఉద్యోగావకాశాలను కలిగించేదిగా ఉండాలన్నది సాధారణ ఆలోచన. అది తప్పుకాదు. కానీ ఇష్టం లేని చదువు చదివి, ఇష్టం లేని వృత్తి చేపట్టి జీవించడం అందరికీ సాధ్యం కాదు. భారతీయ యువకులు పరిస్థితులను బట్టి తమను తాము మలచుకునే తత్త్వం గలవారు. అయినప్పటికీ అభిరుచికి భిన్నమైన పనిని జీవితాంతం చేయడం కష్టం కదా! పాశ్చాత్య దేశాలలో ఉన్నత పాఠశాల ముగిసే సమయంలో విద్యార్థులలో “వృత్తి అభిరుచి” (career aptitude) ఏమిటి అన్న విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. ఆ ప్రక్రియలో చాలామంది విద్యార్థులు తాము ఏ వృత్తిలో రాణించే అవకాశం ఉందో, ఏ వృత్తి తమ నైజానికి నప్పుదో తెలుసుకునే అవకాశం లభిస్తుంది. అలాంటి ప్రక్రియ భారతదేశంలో కూడా అక్కడక్కడ ఉందేమో గానీ ప్రతీ కళాశాల విద్యార్థికీ అందుబాటులో ఉంటే బాగుంటుంది. ఆశ్చర్యకరంగా, అమెరికాలో, భారత ఉపఖండానికి చెందిన వారి పిల్లల మీద ఉండే వత్తిడి భారత దేశంలో ఉండే విద్యార్థుల మీద ఉండే వత్తిడి కంటే తక్కువ కాదు! పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్ లు, కనీసం శాస్త్రవేత్తలు కావాలని అమెరికాలో ఉంటున్న వారి తపన కనాలే గానీ చెప్పలేము!

"కాలేజీ చదువు అయ్యాక ఏమి చేద్దామనుకుంటున్నావు" అన్న ప్రశ్న దాదాపు విద్యార్థులు అందరూ ఎదుర్కొనేదే. "నువ్వు ఎలాంటి మనిషిగా అవ్వాలనుకుంటున్నావు" అని మాత్రం ఎవరూ ఆడగరు. తాను చేపట్టిన ఉద్యోగం, వృత్తి మీద ఒక వ్యక్తి విలువ ఆధారపడి ఉండడం సమాజంలో సాధారణంగా చూస్తాము, ముఖ్యంగా భారతదేశంలో ఉన్నత పదవులలో, ప్రభావశీలమైన పదవులలో ఉన్నవారితో స్నేహం, వియ్యం పొందాలని ఉవ్విళ్లూరతాము కానీ ఉన్నతంగా ఆలోచించే ఉత్తమ వ్యక్తుల సాంగత్యం కోసం తపించడం అరుదు కదా. అంతేకాదు, ఉన్నత విద్య, ఉద్యోగం ఉన్నా సామాజిక వర్గ ప్రాతిపదికన స్నేహం చేసేవారు ఇంకా ఎంతో మంది భారత సమాజంలో ఉన్నారన్నది నిర్వివాదాంశం.


"విద్యా దదాతి వినయం, వినయాద్యాతి పాత్రతాం | పాత్రత్వాత్ ధనమాప్నోతి ధనాద్ధర్మం, తతః సుఖం" అని మిత్రలాభం లో చెప్పినట్టు, విద్య వలన వినయం అలవడాలి; వినయం వలన అర్హత కలుగుతుంది; విద్యా వినయాల వలన ధనం ప్రాప్తిస్తుంది; ఆ ధనము ద్వారా ధర్మ నిరతితో కూడిన సుఖము పొందాలి. స్వయం పురోగతితో పాటు సమాజ అభివృద్ధికి పాటుబడే తత్వం ధర్మ నిరతిలో భాగం.

కలిసి పనిచేసే తత్వం గలవారిని  అంతర్జాతీయ, జాతీయ సంస్థలు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ తత్వం చిన్నప్పటినుండే అలవడేలా తల్లిదండ్రులు, విద్యాలయాలు కృషిచేయాలి. పాఠ్య ప్రణాళికలో భాగంగా ఈ అంశం చేర్చాలి. సమస్యలు పరిష్కరించగలగడం, ఆలోచనలను ఆకర్షణీయంగా పంచుకోవడం, సంభాషణా చాతుర్యం లాంటి నైపుణ్యాలు చాలా అవసరం.  స్వంత లాభంతో పాటు, పరాయివారికి చేయూతనిచ్చే కార్యక్రమం చేపట్టాలన్నది ప్రాచీన సాహిత్యంలో నుంచి గురజాడ పాట వరకూ చదువుకుంటున్న విషయమే. ఉన్నత ఆలోచనలు, ఆశయాలు సమాజంలో విస్తరింపచేయడానికి  విద్య ఉపయోగపడాలి. ఈ సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ తమ అభిరుచికి అనుగుణంగా, తమ కలల సాకారం దిశగా అడుగులు వేస్తూ ఆనందమయ జీవితం సాగించాలని ఆకాంక్షిద్దాము.

**డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ**
ప్రధాన సంపాదకులు, ప్రకాశిక

# ముఖచిత్రం

విద్యా దదాతి వినయం




## లోపల

కూలిన బురుజు........................................................8
రాయలసీమ గ్రామీణ జీవిత ప్రతిబింబం– కూలిన బురుజు...19
మహా విద్వాంసుడు ..................................................25
కులవివక్షపై గురిపెట్టిన అస్త్రం – మహా విద్వాంసుడు ..........36
భూమాతలు..............................................................44
మా నాన్న నాకేమిచ్చారు? .......................................46
గెలుపు–నాన్న మిరాశి హక్కు ....................................59
భారతదేశం పతనానికి
"గిరీశం" చెప్పిన పదకొండు కారణాలు ..!!?...................61
రసాయన పితామహా నీకు జేజేలు!...............................69
ఎస్. ఎమ్. ప్రాణ్‌రావు కథలు – సామాజిక అంశాలు..........71
తెలుగు పద్యసౌరభం ................................................78
నిమిత్తమాత్రులు ....................................................82
2023 సంవత్సరం వైద్యవిభాగపు నోబెల్ పొందిన
పరిశోధనాంశం: mRNA వాక్సినేషన్ సాంకేతికతను
అభివృద్ధి పరచిన పరిశోధన.......................................89

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు, ఆయా రచయితల స్వంతం. పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధమూ లేదు.

మేటి కథలు-లోతు వ్యాఖ్యలు


# కూలిన బురుజు



కీ. శే. కేతు విశ్వనాథ రెడ్డి

ఊరు దగ్గరికొచ్చింది. అంతకుముందు లేని పిరికితనమూ, భయమూ నాలో. రెండు వారాల కిందట ఖూనీ జరిగిన ఊళ్ళోకి అడుగుపెట్టబోతున్నాను. పుట్ట చెండ్లాట మాదిరి నాటుబాంబుల్తో ఆడుకున్న గ్రామ పార్టీల ప్రపంచంలోనికి ప్రవేశిస్తున్నాను. కక్షలూ, కార్పణ్యాల అడవిలోకి వెళుతున్నాను.

కొత్త అనుభవం. పదేళ్ళ కిందట జ్ఞాపకాల్లో నిలిచిన ఊరు ఇది కాదనిపిస్తోంది. పక్క కళ్ళాల్లో మేపు కోసం వాముల దగ్గరకొచ్చే రైతుల సందడి లేదు. బండ్ల బాటలో నిత్యం ఎదురవుతుండే ఎద్దుల బండ్ల రాపిడి లేదు. ఎద్దుల మెళ్ళో గంటల సవ్వడీ లేదు. ఎనుములూ లేవు. గొడ్లూ లేవు. ఒక్క మగ పురుగు లేదు.



ఇది ఊరా? వల్లకాడా? ఈ ఆలోచన రావడంతో ఒళ్ళు జలదరించింది. ఊళ్ళో ఇళ్ళ తలుపులేమో తెరిచి ఉన్నాయి. ఎగువ వీధిలో, ఇండ్ల అరుగుల మీద కూర్చున్న ఒకరిద్దరు ఆడవాళ్ళు నన్ను ఎగాదిగా చూసి ఇంట్లోకి వెళ్ళారు.

ఊరి మధ్య మురారి దండు రోజుల్లో కట్టించిన బురుజు దగ్గరకు వచ్చాను. బురుజు చుట్టూ కట్టిన అరుగు మీద

ఎప్పుడూ ఉండే జనం లేరు. బురుజు పైకి చూశాను. సగం పడిపోయింది. పైన పిచ్చిమొక్కలూ... ఒకప్పుడు ఆ బురుజు ఊరి రక్షణకూ, ఐక్యతకూ సంకేతం. ఇప్పుడో? కూలిపోయి... బురుజు చుట్టూ కట్టిన అరుగు మీద పడుకొన్న ముసలాయన నన్ను చూసి లేచి కూర్చున్నాడు – ఖణేల్ ఖణేల్మని దగ్గుతూ. దగ్గు ఆపి ఆయాసంతో – ''ఎవరింటికి?'' అన్నాడు.

వెన్నుముకలో వణుకు పుట్టింది. మా అక్క పేరుగానీ, మా బావ పేరుగానీ చెప్పలేకపోయాను. ''సీతమ్మ గారింటికి'' అన్నాను.

అంతలోనే అప్పుడే ఇంట్లోంచి వచ్చిన మా పెదనాన్న నన్ను చూసి తబ్బిబ్బు పడిపోయాడు.

''సీతమ్మ నీకేంగావాల?'' అన్నాడు ముసలాయన.

నిగ్రహించుకొని ''మా అత్త'' అన్నాను.

''ఏ ఊరు మనది?'' అంటూ మళ్ళీ ఒక ప్రశ్న వేశాడు.

''తిరుపతి'' అన్నాను.

బ్రీఫ్ కేస్ కుడిచేతిలోకి మార్చుకొని, ఎడమచేత్తో ఫాంటుజేబులోని కర్చీఫ్ తీసుకొని చమట తుడుచుకోక తప్పలేదు. నిజానికి తిరుపతి నేను ఉద్యోగం చేసే చోటు మాత్రమే. మరేం ప్రశ్నలు వేస్తాడోనని గబగబా బురుజుదాటి, దిగువ వీధిలో ఉండే మా లక్ష్మమ్మ ఇల్లు చేరుకొన్నా.

ఇంటి వసారాలో అరుగుల మీద ఇద్దరు ఇరవై పైబడిన వాళ్ళెవరో కూర్చొని మెల్లగా మాట్లాడుకుంటున్నారు రహస్యాలు మాట్లాడుకొంటున్నట్లు. వాళ్ళు నన్ను చూసి మాట్లాడటం మానుకొన్నారు. అంతలోనే అప్పుడే ఇంట్లోంచి వచ్చిన మా పెదనాన్న నన్ను చూసి తబ్బిబ్బు పడిపోయాడు. దగ్గరకు వచ్చి చెయ్యి పట్టుకున్నాడు. వచ్చే కన్నీళ్ళను ఆపుకోలేక, భుజం మీది పంచెను ముఖానికి వత్తుకున్నాడు. వసారా అరుగు మీద కూర్చున్నాను. ఆయనా నా పక్కనే కూర్చున్నాడు. అయిదారు నిముషాలు ముఖం మీది పంచెను తియ్యలేకపోయాడు.

నా మనస్సు బరువెక్కుతోంది. పెదనాన్నే నిగ్రహించుకొని, ''ఒరే కిష్టుడూ! ఇంట్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కోను నీళ్ళు తేపో'' అన్నాడు.

ఆ కిష్టుడు చెంబుతో నీళ్ళు తెచ్చాడు. కిష్టుడూ, కిష్టుడి స్నేహితుడూ పొరుగూరులోని మా బావ వైపు బంధువులని పెదనాన్న పరిచయం చేసి, ''ఇంట్లోకి పోదాం రా'' అన్నాడు.

**మీ బావను చంపినోడు కుక్క చావు చచ్చేదాకా ఆ గాజులు పగలగొట్టుకోను. ఈ బొట్టు చెరుపుకోను అన్నానురా!**

ఇంట్లోకి వెళ్లి నడవలో మంచం మీద కూర్చొన్నా. పెదనాన్న లోపలికి వెళ్ళాడు. లక్ష్మక్క ఎదురుపడితే ఏం మాట్లాడాలో, ఎట్లా ఓదార్చాలో తోచడం లేదు. అనుభవంలో లేని వాటిని ఎదుర్కోవడం కష్టం. వంటింట్లోంచి పెదనాన్న సీతమ్మత్తను పిల్చుకొని వచ్చాడు. ఆమె జగిలి మీద కూలబడింది... వెక్కి వెక్కి ఏడుస్తూ.

''ఈ ముదనష్టపోళ్ళు నా కొడుకునే పొట్టన పెట్టుకోవాలా నాయనా? ఒకరి సుద్దికీ, సొంటికీ పోయినోళ్ళం, ఒకరిది తిన్నది కాదు. నా ఉసురు తగలకపోదు. వాళ్ళిండ్లలో పీనుగులు వెళ్ళకపోతే చూడు...'' అంటూ సీతమ్మత్త నెత్తిన రెండు చేతులూ పెట్టుకొని ఏడవడం మొదలుపెట్టింది.

''ఊరుకో అత్తా!'' అన్నా ఎట్లా సముదాయించాలో తెలియక, కళ్ళ నీళ్ళు ఆపుకొంటూ.

''ఏమూరుకునేది నాయనా? ఎట్లా ఊరుకొనేది? మీ అక్కను చూడు'' వెక్కిళ్ళు ఆపి గుడ్డ నీరు కుక్కుకొంటూ అంది సీతమ్మత్త.

''లక్ష్మక్క ఎక్కడుంది?'' అన్నా. సీతమ్మత్త తల వెనక్కి తిప్పి లోపలికి చూసింది.

''ఆ కొట్టిడింట్లో'' అన్నాడు పెదనాన్న.

లేచి జగిలి దాటి గాదెల అరుగు కంత గుండ లోపలికి వెళ్ళి, కుడి పక్క

కొట్టిడింట్లోకి వెళ్ళాను. లక్ష్మక్క చాపమీద ముడుచుకొని పడుకొని ఉంది.

"మీ బావే ఉండి ఉంటే.."లక్ష్మక్క మాట్లాడలేక చీర చెంగుతో కళ్ళు వత్తుకొంది.

"లక్ష్మక్కా!" అని దుఃఖం ఆపుకోలేకపోయాను.

అక్క ముఖం మీద చెరుగు తీసి, ఏడ్పు తమాయించుకొంటూ అంది – "మీ బావను చంపినోడు కుక్క చావు చచ్చేదాకా ఆ గాజులు పగలగొట్టుకోను. ఈ బొట్టు చెరుపుకోను అన్నానురా! నువ్వు చదువుకున్నోడివి. చెప్పు. ఇది తప్పంటావా?"

లక్ష్మక్క ప్రశ్న విని నాకు నోట మాట రాలేదు. ఆమెలోని పట్టుదలా, దాని పర్యవసానాలూ ఊహించగలను. కానీ ఆమెను హెచ్చరించాలో, సమర్థించాలో, అభినందించాలో తెలియడం లేదు.

మాట మార్చి అన్నాను, "పిల్లలిద్దరూ ఎక్కడికి వెళ్ళారు?" అని.

"పెద్దోడు శంకరు మనూరికి పోయినాడు. చిన్నోడు వాసు ఊళ్ళోనే మన వాళ్ళిండ్లలోనే ఎక్కడో ఉంటాడు. దినదిన గండమాయె!" అంది దిగులుగా.

"ఇంత కష్టమొచ్చిన సంగతి పేపర్లో చదివిన దాకా నాకు తెలియదు" అన్నా.

"నువ్వెక్కడో ఉద్యోగం చేసుకునేవాడివి, ఇబ్బంది పెట్టడమెందుకని జాబు రాయించలేదు. మా తిప్పలు తప్పేవి కావు. రెండు రోజులుండి పో" అంది లక్ష్మక్క.

"లేదు. రేపు పొద్దున్నే పోవాలి" అన్నా.

"మీ బావే ఉండి ఉంటే..." లక్ష్మక్క మాట్లాడలేక చీర చెంగుతో కళ్ళు వత్తుకొంది. అవును మా బావే ఉండి ఉంటే నాలుగైదు రోజులు కదలనిచ్చేవాడు కాదు. ఉద్యోగం రాక, దిక్కుతోచక, నాన్న చూసే పెళ్ళి సంబంధాలు తప్పించుకోలేక మానసికంగా కుంగిపోతున్న రోజుల్లో, ఆర్నెల్లపాటు ఆశ్రయమిచ్చి ధైర్యాన్నిచ్చిన దంపతులు లక్ష్మక్క, బావా. లక్ష్మక్క ఎదురుగా ఉండలేక మళ్ళీ నడవలోకి వచ్చి మంచం మీద కూలబడ్డాను.

"తాతా!" అంటూ పది పన్నెండేళ్ళ కుర్రాడు లోపలికి వచ్చాడు. నన్ను చూసి ఆగాడు.

"తిరుపతిలో ఉండడే. ఆ మామ రా!" అన్నాడు పెదనాన్న.

వాడు అదే వాసు నవ్వాడు. "ఏమన్నా తెలిసిందిరా?" అన్నాడు పెదనాన్న.

"ఎం.ఎల్.ఏ. వాళ్ళు మన ఎదురుపార్టీవాళ్ళకి రెండు రైఫిల్స్ తెచ్చిచ్చినారంట తాతా! చానా దూరం నుంచి వాటిని కాల్చొచ్చునంట!" అన్నాడు ఉత్సాహంతో.

> చీకటి పడింది. లైట్లు లేవు. ట్రాన్స్ఫార్మర్ కాలిపోయి వారం రోజులైందట. ఇంట్లో మసిపట్టిన రెండు లాంతర్ల వెలుతురు.

వాడి భాషా, చదువూ, గూఢచారి నేర్పూ చూసి నాకు తల తిరిగిపోయింది. ఏ గూటి చిలక ఆ పాటే పాడుతుంది. ఏం చదివిస్తే ఆ చదువే అబ్బుతుంది. వాసుకు ఆ ఇంట్లో, ఆ ఊళ్ళో అబ్బిన చదువు అది.

"మనకేం భయం లేదులేరా వాసూ! మన మండలం ప్రెసిడెంటు మామ నుంచి మీ అన్న శంకరు తెస్తాడు కదా రేపటికల్లా అంతకంటె పెద్దవి" అన్నాడు పెదనాన్న. వయసులో, బాధలతో పీక్కుపోయిన బుగ్గల మీద మీసాలు సవరించుకొంటూ...

"అది సరే తాతా! రాత్రికి పోలీసుల్ని మన ఇంటి మీదికి ఎగతోల్తారంట, అవతలి పార్టీవాళ్ళు. మన యూరముట్లు జాగ్రత్తగా పెట్టుకోవాలంట" అన్నాడు వాసు.

"యూరముట్లు ఏమిటి?" అని అడిగా పెదనాన్నను. పనిముట్ల అర్థంలో వాడలేదని తెలిసి.

"అవే మన దగ్గర పెట్టుకునేవి అవసరానికి... బాంబులు, పిస్టల్లాంటివి" అన్నాడు పెదనాన్న, రహస్యం మాట్లాతున్న ధోరణిలో. నాకు మతిపోయింది. ఈ ఊరు, ఈ వాతావరణం నాకేదో బీభత్సంగా కనిపిస్తున్నాయి.

చీకటి పడింది. లైట్లు లేవు. ట్రాన్స్ఫార్మర్ కాలిపోయి వారం రోజులైందట.

ఇంట్లో మసిపట్టిన రెండు లాంతర్ల వెలుతురు. ఒకటి రెండు కిరసనాయిలు బుడ్ల వెలుతురు. లక్ష్మక్క ఒక స్తంభానికి జారగిలబడింది. సీతమ్మత్త జాలాట్లో బోకులు కడుగుతోంది. వాసు కొట్టిడింట్లోకి వెళ్ళాడు. పెదనాన్న మంచంలో వెల్లికిలా పడుకొని మిద్దె దంతెల వైపు చూస్తున్నాడు. కిష్టుడూ, కిష్టుడి స్నేహితుడు మరి రెండు మంచాల్లో పడుకొని తపస్సు చేస్తున్నారు. ఎవ్వరూ మాట్లాడట్లేదు. ఏకాంతంలో నిశ్శబ్దం బావుంటుంది. మనుష్యుల మధ్య నిశ్శబ్దం ఎక్కువసేపు భరించడం కష్టం. ఇంట్లో గుడ్డి వెలుతురు నిశ్శబ్ద వాతావరణం కన్నా వసారాలో చీకటే మేలనిపిస్తుంది. చీకట్లో ఏం జరుగుతుందో అని భయం.

> ఒకదానికొక మెలిక యాభై ఏళ్ళ నుంచి మన పల్లెలో లేని కులతగాదాలు పదేళ్ళలో వచ్చె.

పెదనాన్న "వసారాలో కూకుందాం" అంటే, కలిసి ఇద్దరం వసారా అరుగు మీద కూర్చున్నాం. నాకేం మాట్లాలో పాలుపోవడం లేదు. 'అసలు ఈ గొడవ ఎందుకొచ్చింది? ఎప్పుడు మొదలైంది?' అని అడుగుదామనుకొన్నాను మా పెదనాన్నను, ఆయనే మొదలుపెట్టాడు.

"కాని రోజులు వచ్చినాయి. నలుగురు కలిసి మెలిసి బతికే కాలం కాదు. ఎవడి మానాన వాడు పొయ్యే దినాలు కాదు. నేనక్కడికీ ఏడాది కిందట చెప్పినా మీ బావకు. 'రైతు పాగీకి సారాయి యాపారం వద్దు' అని. 'కరువుల్తో సంసారం తగ్గిపోతుంటే దొరికిన పై ఆదాయం పోగొట్టుకోమంటావా, అందులోనూ లక్షలు పెట్టి మా పార్టీ వాళ్ళు గవర్నమెంటు పాట పాడి తెచ్చుకొంటే!' అన్నాడు మీ బావ. పోనీలే అనుకున్నా. ఇబ్బంది పడినోళ్ళను సమయానికి మీ బావ ఆదుకునేవాడు. కాబట్టే ఊర్లో చిల్లర మల్లర జనం మీ బావంటే పడిచచ్చేవాళ్ళు. అవతలా రైతులే. కన్నుకుట్టింది. కాపుసారా కాసినారు. పుల్లలు పెట్టేవాళ్ళు ఊర్లోనే తయారైనారు. పనీపాట లేక దొరికితే ఏరక తిందామని ఆ పక్కా ఈ పక్కా కోపు దొక్కేవాళ్ళు రాజకీయాలోళ్ళు అయిపోయిరి. ఒకదానికొక మెలిక యాభై ఏళ్ళ నుంచి మన పల్లెలో లేని కులతగాదాలు పదేళ్ళలో వచ్చె. బాంబులొచ్చె, బరకట్లొచ్చె, మోసాల్తో సంపుకోవడమొచ్చె. కడకు ఇది మీ అక్క నెత్తి మీదకొచ్చె. పదివేలిచ్చి కూలీ నా కొడుకుల్తో చంపించినారు మీ బావను." పెదనాన్న దుఃఖంలో మాట్లాలేకపోయాడు.

అంతలో ఎవరో నలుగురైదుగురు వచ్చారు. సాయంత్రం ఊళ్ళోకి పై మనుషులు ఎవరో వస్తుంటే చూశామని చెప్పారు మా పెదనాన్నతో. అందరూ ఇంట్లోకి వెళ్ళి అరగంటసేపు మంతనాల్లో ఉన్నారు. ఆ తర్వాత ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయినారు. నేనూ పై మనిషినే అని గుర్తొచ్చేసరికి నా ధైర్యమేదో తెలిసి వచ్చింది. ఏదో భోజనం అయిందనిపించాం అందరమూ. భర్తను పోగొట్టుకున్న సోదరిని విచారించనికి వచ్చిన పై వాణ్ణి నేను. అవతలి పార్టీ వైపు మనుషులు ఏదైనా చిచ్చు పెట్టడానికి వచ్చినవాళ్ళేమో !

జీపు చప్పుడుకు ఉలిక్కిపడ్డాను. లేచి కూర్చుందామనుకొని పక్క మంచాలవైపు చూశాను. ఎవ్వరూ మంచాల్లో కదలడం లేదు.

పెదనాన్నా మా బావ బంధువులిద్దరూ, అదే ఆ కిష్టుడూ, కిష్టుడి స్నేహితుడు నలుగురం వసారాలో పడుకున్నాం. మా సీతమ్మత్త వసారా బయట ఇంటి ముందరి ఖాళీ జాగాలో మంచం వేసుకొని పడుకొంది. మా లక్ష్మక్క, వాసుగాడు ఇంట్లో పడుకున్నారు.

బయట కటిక చీకటి. ఏ అలికిడి వినిపించడం లేదు. వసారాలో తగ్గించి పెట్టిన మసిపట్టిన లాంతరు మసి కాంతి. నాకు నిద్రరాలేదు. ఈ పల్లెటూళ్ళు నాకు తెలిసినవే. ఈ గాలి ఒకప్పుడు నేను పీల్చిందే. ఈ నీళ్ళు నేను తాగినవే. ఈ భూమిలో పండిన జొన్నలూ, రాగులూ నేను తిన్నవే. ఈ మనుషులు నాకు సరిగ్గా అర్థం అయిన వాళ్ళేనా? ఒకవైపు పిలిస్తే పలికే కరవులు, మరొక దిక్కు కూలిపోతున్న సంసారాలు, గూనికి తోడు దొబ్బుడ వాయువన్నట్లు ఈ గ్రామకక్షలు... ఇక్కడి భవిష్యత్తేమిటి? ఈ రోజు కొంపదీసి మరేమీ జరగదు కదా? ఆ పై మనుషులెవరో ఇంటి మీదకు దండెత్తరు కదా? వట్టి అనుమానాలేమో? మనసును కమ్ముకొన్న సవాలక్ష సంకోచాలు. వింత భయాలు, నిర్వేదం.

ఆలోచనలు తెగడం లేదు. ఏ అర్ధరాత్రో అయివుంటుంది. జీపు చప్పుడుకు ఉలిక్కిపడ్డాను. లేచి కూర్చుందామనుకొని పక్క మంచాలవైపు చూశాను. ఎవ్వరూ మంచాల్లో కదలడం లేదు.

ఇంటిముందు జీపు ఆగిన శబ్దం. బూట్లు టకటక, పోలీసులు. ఒక పోలీసు వేసిన బాటరీ లైటు వెలుతురు. నా గుండె వేగంగా కొట్టుకొంది.

మా సీతమ్మత్తని లేపి ఒక కానిస్టేబుల్ ''శంకరరెడ్డి ఇండ్లు ఇదేనా?'' అన్నాడు.

''అవున్నాయనా!'' అంది సీతమ్మత్త.

''ఇంట్లో ఉన్నాడ?'' అన్నాడు ఎస్.ఐ.

సెర్చివారంటూ, అరెస్టు వారంటూ ఏవీ? అని అడుగుదామనిపించింది. అడిగితే వాళ్ళు అడ్డం తిరిగి సోదా చేయవచ్చు.

''లేదు నాయనా!'' అంది సీతమ్మత్త. టార్చిలైటు వేసి ''ఆ వసారాలో పడుకొన్నదెవరు?'' అన్నాడు ఎస్.ఐ.

''మావాళ్లే'' అంది సీతమ్మత్త. ఈలోగా అందరం లేచాము. మా పెదనాన్న కలగజేసుకుంటూ ''దివసానికి వచ్చినవాళ్ళం'' అన్నాడు.

''మాకు దివసమొచ్చింది. ఇంటినిండా పై మనుషులున్నారు అని వైర్లెస్ ఇన్ఫర్మేషన్. ఇల్లు సోదా చెయ్యాలి'' అన్నాడు ఎస్.ఐ.

అనుకోని సంఘటనతో, నా పిరికితనమో ఏమోగానీ నాకు నోట మాట రాలేదు. పోలీసులు తలుపు తెరిపించమన్నారు. మా సీతమ్మత్త తలుపు తట్టి వాసును పిలిచింది. గడిమాను తీసిన చప్పుడు, చిలుకు తీసిన శబ్దం. వాసు తలుపులు తెరిచాడు. బాటరీలైటు వేసుకొంటూ ఎస్.ఐ. ఇంట్లోకి వెళ్ళి అయిదు నిమిషాల్లో బయటికి వచ్చాడు.

పెదనాన్నతో ఎస్.ఐ అన్నాడు ''ఇదిగో పెద్దాయనా, పార్టీ కొంపల్లోకి పై మనుషులు రాకూడదని తెలుసుకదా?''

''కన్న కూతురిండ్లు సార్!'' అన్నాడు పెదనాయన. ''సర్లే'' అంటూ ఎస్.ఐ. మా వైపు తిరిగి ''మీ ముగ్గురూ జీపెక్కండి'' అన్నాడు.

'సెర్చివారంటూ, అరెస్టు వారంటూ ఏవీ?' అని అడుగుదామనిపించింది. అడిగితే వాళ్ళు అడ్డం తిరిగి సోదా చేయవచ్చు. ఆ యూరముట్లనే మారణాయుధాలు ఏవైనా ఇంట్లో ఉంటే పెద్ద ముప్పే రావచ్చు. ఇప్పుడు

ఘర్షణ పడి లాభం లేదు. బట్టలు కూడ మార్చుకోకుండ జీపు ఎక్కాను – మా బావ తాలూకు బంధువులిద్దరితో. ఈ చప్పుళ్ళకు ఊరు మేలుకోదు. లేదా మేలుకొన్నా ఎవరి జాగ్రత్తలో వాళ్ళున్నారేమో! ఖూనీ అయిన మనిషి ఇంట్లో సోదా, ఖూనీ చేసినవాళ్ళ ఇళ్ళల్లో సోదా జరిగినట్లు లేదు. ఈ మాయ అర్థం కాలేదు. ఏ దారుల్లో, ఏ డొంకల్లో వెళ్ళిందో గుర్తు తెలీటం లేదు ఆ చీకట్లో. ఒక అరగంటకల్లా పోలీసుస్టేషన్ చేరింది జీపు. స్టేషన్లో మమ్మల్ని ముగ్గుర్ని వదిలి, అక్కడ కానిస్టేబుల్తో ఏవో మాట్లాడి ఎస్.ఐ. బృందం మళ్ళీ ఎక్కడికో వెళ్లింది.

**ఆ అపరాత్రి టీ, సిగరెట్టు వచ్చాయి. కాశీం మమ్మల్ని లాకప్ లో తోస్తానని బెదిరించలేదు.**

“లాకప్ లోకి పదండి” అన్నాడు ముసలి కానిస్టేబుల్.

నాకు మండిపోయింది. “ఎందుకు?” అన్నాను.

కానిస్టేబుల్ కాసేపు గొణిగాడు. నేనెవరో తెలిసి తరువాత వచ్చే పరిణామాలు ఏమిటో గుర్తు చేద్దామనుకొంటున్నా. సరిగ్గా ఆ సమయంలో మరొక గదిలోంచి వచ్చిన మనిషిని చూసి ఆశ్చర్యపోయాను. అతనూ నన్ను చూసి అంతే ఆశ్చర్యపోయాడు.

అతను జయరాం, కడప కాలేజిలో నేను ఇంటర్లో వున్నప్పుడు బిఏలో ఉండేవాడు. సాహిత్య మిత్రుడు. “జీపు శబ్దమైతే మెలకువ వచ్చింది. మా ఊరి గొడవేమో అనుకొన్నా. నువ్వెక్కణ్ణించి? ఏమిటిది?” అని జయరాం ఆశ్చర్యపడ్డాడు.

ఒక్క క్షణం సిగ్గుపడ్డాను. జరిగింది రెండు ముక్కల్లో చెప్పాను. కానిస్టేబుల్ వైపు తిరిగి “కాశీం! కాస్త సిగరెట్లు ఏర్పాటు చేయించు” అని పదిరూపాయల నోట్లు ఇచ్చాడు.

ఆ అపరాత్రి టీ, సిగరెట్టు వచ్చాయి. కాశీం మమ్మల్ని లాకప్ లో తోస్తానని బెదిరించలేదు. నా వెంట వచ్చిన వాళ్ళిద్దరికీ చాప ఏర్పాటు చేయించి, పడుకోమన్నాడు జయరాం. మేం ఇద్దరమూ మాట్లాడుకొంటూ తెల్లవార్లూ గడిపాము. గ్రామ రాజకీయాల గురించి, మూడు రోజుల కిందట తమ ఊర్లో

జరిగిన ఖూనీ గురించి, తన మీద మోపిన ఆ ఖూనీ కేసు గురించి, కరవు గురించీ సొంత కథ కాదన్నట్లు చెప్పాడు. అదేదో సర్వసాక్షి కథనం లాగుంది – ఉత్తమ పురుషల్లో ఎక్కువ భాగం చెప్పినా. జయరాం కథలు రాసేవాడే అయి ఉంటే రాయలసీమ పల్లెలు అర్థమయ్యే పద్ధతి వేరుగా ఉండేది.

ఇద్దరం స్టేషన్ వరండాలోకి వచ్చాం. సరిగ్గా ఆ సమయానికి నా బ్రీఫ్ కేసు తీసుకొని వచ్చాడు పెదనాన్న.

పొద్దున్న ఏడింటికల్లా ఎస్.ఐ. వచ్చాడు. జయరాం ఎస్.ఐ.కి నన్ను పరిచయం చేశాడు. ఎస్.ఐ. నన్ను ఎగాదిగా చూసి "మీరు, మీ వెంట వచ్చిన ఆ ఇద్దరూ వెళ్ళిపోవచ్చు సార్! ఒక్కమాట మీరీ ప్రాంతాల్లో ఉండటం మంచిదిగాదు" అని సలహా ఇచ్చి తన గదిలోకి వెళ్ళాడు.

"అదే మంచిది" అన్నాడు జయరాం. ఇద్దరం స్టేషన్ వరండాలోకి వచ్చాం. సరిగ్గా ఆ సమయానికి నా బ్రీఫ్ కేసు తీసుకొని వచ్చాడు పెదనాన్న. విషయం తెలుసుకొని సంతోషపడ్డాడు. "గండం తప్పింది. ఇంత పెద్ద ఉద్యోగస్థుడివై ఉండి, రాత్రి ఎంత బాధ పడినావో? లక్ష్మక్క నన్ను పంపింది, దబ్బిచ్చి. తెల్లవారుజామున శంకరు కూడ వచ్చినాడులే. కూడా వస్తానన్నాడు. నేనే వద్దన్నా. మేం బతికి బాగుంటే మళ్ళా ఊరికి వద్దువు" అంటూ చాలా దగ్గరకు వచ్చి చెవిలో చెప్పాడు "ఈ స్టేషన్ మన పార్టీ దగ్గరా గతికిందిలే! అందుకే ధైర్యం. అవతలివాళ్ళు ఏదన్నా తంటా తెస్తారని శంకరు అప్పుడే మన మండలం ప్రెసిడెంటు దగ్గరకు వెళ్ళినాడులే. ఏం కాలేదుల్యా ఇక్కడ?"

ఆ మాటల వెనుక మాయ లోంచి తేరుకునే లోగా పెదనాన్న, మా బావ తాలూకా బంధువులు ఆ ఇద్దర్నీ వెంటబెట్టుకుని వెళ్ళిపోయాడు.

జయరాం ఒక పక్కగా నిలబడి నవ్వుతున్నాడు.

"వస్తా జయరాం!" అన్నా.

జయరాం వరండా మెట్లు రెండు దిగి నిలబడి "ఒకమాట గుర్తుంచుకుంటావా?" అన్నాడు.

"చెప్పు" అన్నాను.

జయరాం చెప్పాడు. ‘‘నువ్వు డాక్టరువి. కలరా ఎందుకొస్తుందో నీకు తెలుసు. కలరా ఉన్న చోటుకి వెళ్ళాలంటే నీకు భయం లేదు. దాన్ని నయం చేసే మందులూ, పద్ధతులూ నీకు తెలుసు. ఈ గ్రామ పార్టీల కలరా ఉందే, ఇది వచ్చిన చోట మీ డాక్టర్లేమీ చెయ్యలేరు. కేవలం ఫిజీషియన్లకు లొంగే వ్యాధి కాదు ఇది’’.

‘‘మరెవరికి లొంగుతుంది?’’ అన్నాను అప్రయత్నంగా.

పేలవంగా నవ్వుతూ జయరాం అన్నాడు, ‘‘అదే స్పష్టంగా తెలిస్తే నేనిక్కడెందుకుంటాను, ఈ రోగాన్ని తగిలించుకొని?... బయటపడితే... తిరుపతిలో కలుస్తాను.’’

జయరాం స్టేషన్లోకి వెళ్లిపోయాడు. మనసు పరిపరి విధాలా పోయింది. అక్కా వాళ్ళ సంసారం ఏమయేటట్లు? జయరాం ఏమయ్యేటట్లు? ఈ పల్లెలూ, ఈ జనం... ఏ సూక్ష్మక్రిములు ఈ రోగానికి కారణం? ఏ మందులకు ఇది లొంగుతుందో? ఆలోచనలో పడ్డాను, రోడ్డు మీద బస్సు కోసం చూస్తూ.

ఒక రోగం ఎందుకొస్తుందో అని వైద్యశాస్త్రంలో కారణాలు కనుక్కొంటే సరిపోదు. మందు కనిపెట్టాలి. నా వైద్య సంస్కారానికి ఇదేదో అందడం లేదు.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 28 మార్చి, 1988)



‘‘నిన్న స్వప్నం, నేటి సత్యం/
నేటి ఖేదం, రేపు రాగం
ఒకే కాంతి ఒకే శాంతి/
ఓ మహర్షీ, ఓ మహాత్మా’’

- శ్రీ శ్రీ





# రాయలసీమ గ్రామీణ జీవిత ప్రతిబింబం - కూలిన బురుజు

డా. కె.నాగేశ్వరాచారి
94411 39652

జీవితంలో ఒడిదుడుకులు జాస్తిగా ఉన్నప్పుడే మంచి కథా సాహిత్యం వస్తుందన్న సిద్ధాంతం ఒకటి వున్నది. నిజం కూడా కావచ్చు – కొ.కు.

ఈ మాటను నిజం చేసినవారు 'కూలిన బురుజు' కథతో కేతు విశ్వనాథరెడ్డి. ఈ ఒక్క కథతోనే అన్ని కథల్ని అంచనా వేయాలి.

ఈ కథ 1988 మార్చి 28న ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో మొదటిసారిగా వెలువడింది. కథా రచనాకాలం నాటికి ముఖ్యంగా రాయలసీమ జిల్లా ముఠా కక్షలతో రావణకాష్టంగా రగులుతున్న కాలం. దీనికి తోడు నిరంతరం కరువు కాటకాలు. అదనంగా పాలెగాళ్ళ సంస్కృతి దీనికి తోడై రాయలసీమ సమాజంపై ముప్పేట దాడిగా కొనసాగుతూ వుంది. ఈ నేపథ్యంలో వచ్చిన కథ కూలిన బురుజు.

కథకుడిగా చేయి తిరిగిన రచయిత కేతు విశ్వనాథరెడ్డి. రాయలసీమ సమాజాన్ని పాఠకలోకానికి పరిచయం చేసినవారు. పైగా అరసం కార్యకర్త, సాహిత్యోద్యమకారుడు. తనకంటూ ఒక సామాజిక దృక్పథాన్ని



ఏర్పరచుకున్నవారు. కేవలం రచయితేగాక విమర్శకులు కూడా. కథా మర్యాదను పాటిస్తూ, రచయితగా సామాజిక బాధ్యతను గుర్తించుకొని రచనలు కొనసాగిస్తున్నవారు కేతు విశ్వనాథరెడ్డి.

**ప్రతి పక్షం మరో పక్షానికి అండగా వుంటుంది. వీరిద్దరి మధ్య సామాన్య జనం నలిగిపోతూ వుంది.**

ముఠా కక్షల నేపథ్యంలో కూలిన బురుజు కథ కొనసాగింది. కథ ఉత్తమ పురుషలో నడిచింది. తన బావ ముఠా కక్షల్లో భాగంగా హతుడు. తాను – కథకుడు – తిరుపతిలో ఉద్యోగస్తుడు, వైద్యుడు. తన అక్క లక్ష్మక్కను పరామర్శించడానికి వాళ్ళ గ్రామానికి వెళతాడు. ఒక్కరోజు జరిగిన కథ ఇది. గ్రామ పొలిమేరల నుంచే కథకుడికి శ్మశాన శాంతి కనిపిస్తుంది. గ్రామంలో కూడా అదే స్థితి. కథకుడికి ఉద్యోగం రాకముందు తండ్రి తెచ్చే పెళ్ళి సంబంధాలు ఇష్టం లేక తప్పించుకోవడానికి అక్క బావ ఊర్లోనే ఆరు సంవత్సరాలు గడిపాడు. గ్రామస్తులంతా పరిచయస్తులే. గ్రామంలో పాత కూలిన బురుజు చుట్టూ వుండే మనుషులెవరూ కనిపించరు. ఒక ముసలాయన వాకబు చేస్తే సీతమ్మ ఇంటికి వచ్చానని చెప్పి ఇంటికి చేరుకుంటాడు. ఇంటి ముందు వాళ్ళ పెదనాన్న, ఇద్దరు యువకులు కనిపిస్తారు. ఇంట్లోకి వెళ్ళిన తరువాత సీతమ్మను ఓదారుస్తూ లక్ష్మక్క దగ్గరకు వెళ్ళి పరామర్శిస్తాడు. రాత్రికి భోంచేసి ఇంట్లో కాకుండా బయట మంచంపై పడుకుంటాడు. రాత్రి పోలీసులు వచ్చి ఇల్లు సోదా చేసి కథకుణ్ణి, అతని బావ బంధువుల్ని పోలీసు స్టేషనుకు ఎస్.ఐ. తరలిస్తాడు. అక్కడ కథకుడి మిత్రుడు జయరాం ఇటువంటి కేసులోనే పోలీసు స్టేషనులో వుంటాడు. జయరాం విషయం తెలిసిన తరువాత ఉదయం ఆ ముగ్గుర్ని ఎస్.ఐ. మీ ఊర్లకు వెళ్ళిపొమ్మని పంపిస్తాడు. కథకుడిని పెదనాన్న కథకుడి సూట్ కేసు స్టేషన్ వరకూ వచ్చి ఇచ్చి సాగనంపుతాడు. కక్షలకు కారణాలు వెదదకాలని జయరాం సంభాషణల్లో వ్యక్తమవుతుంది. ఇదీ సంక్షిప్తంగా కథ.

ఈ కథ వల్ల అర్థమయ్యే అంశాల్ని ఇలా వివరించుకోవచ్చును. కక్షల వల్ల గ్రామంలో శ్మశాన శాంతి నెలకొనడం, ప్రతి వ్యక్తిని అనుమానించడం, కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, మొత్తంగా విధ్వంసమౌతున్న సమాజం.

ఈ అన్నిటికి కారణం ప్రభుత్వ వైఫల్యాలు, అలసత్వం వంటి అంశాలు కనిపిస్తాయి.

> ఇక్కడి రాజకీయ నాయకులు పార్లమెంటరీ విధానానికి ఒక మెట్టు కింద, పాలెగాళ్ళ విధానానికి ఒక మెట్టు పైన వున్నారు

కథా రచనాకాలం నాటికి రాయలసీమ ముఠా కక్షలతో అట్టుడుకుతున్న సమాజం కనిపిస్తుంది. తుపాకులతో ప్రయివేటు సైన్యాలు కవాతు సీమలో కనిపిస్తుంది. చేతి బాంబుల తయారీ కుటీర పరిశ్రమగా మారిపోయింది. అధికార పార్టీ ఏదో ఒక పక్షానికి అండగా వుంటుంది. ప్రతి పక్షం మరో పక్షానికి అండగా వుంటుంది. వీరిద్దరి మధ్య సామాన్య జనం నలిగిపోతూ వుంది. ఈ స్థితి పర్యావసానాలు కథలో చూడగలం. ఈ స్థితికి కారణాలు రెండు. ఒకటి వర్షాభావం వల్ల కరువు, ప్రత్యామ్నాయ నీటి వనరుల లేమి; రెండు ప్రభుత్వ విధానాల వల్ల సారా వ్యాపారం విస్తరించడం; సమాంతరంగా ప్రయివేటు కాపుసారా అమ్మకాలు; ఈ పోటీ హత్యల వరకు దారి తీసింది.

పందొమ్మిది వందల డెబ్భైయవ దశకంలో ప్రారంభమైన ఈ పరస్పర హననోద్యోగం దాదాపు దశాబ్దం కాలం స్వైరవిహారం చేసింది. రాయలసీమలోని కమ్యూనిస్టు యం, ఎల్ పార్టీలు ముఠా కక్షలకు వ్యతిరేకంగా ఉద్యమం లేవదీసింది. లైసెన్స్ ఉన్న తుపాకీ ఒకటి వుంటే లైసెన్స్ లేని తుపాకాలు పది వుంటాయి. నాటు బాంబుల తయారీ సరేసరి ! బాంబులు చుట్టే సమయంలో పేలి చనిపోయినవారు, అంగవైకల్యం చెందినవారు, ముఠా కక్షల్లో హతులైన సామాన్య వ్యక్తులు, అనాథలైన పిల్లలతో సీమ సమాజం అట్టుడికిపోయింది. ఈ నేపథ్యంలో చాలా కథా, నవలా, కవిత్వం వెలువడింది. పౌరహక్కుల సంఘం వారు ఆయా జిల్లాలలోని ఫ్యాక్షనిస్టులుగా పేరుపడినవారిని ఇంటర్వ్యూలు చేసి 'కరువు జిల్లాల్లో పాలెగాళ్ళు' అన్న డాక్యుమెంట్ లాంటి పుస్తకం వెలువరించారు. రాయలసీమలోని ముఠా కక్షల మూలాల్ని ఈ పుస్తకం వెలికితీసింది. ఇక్కడి రాజకీయ నాయకుల గురించి బాలగోపాల్ ఒక కామెంట్ చేశాడు, 'ఇక్కడి రాజకీయ నాయకులు పార్లమెంటరీ విధానానికి ఒక మెట్టు కింద, పాలెగాళ్ళ విధానానికి ఒక మెట్టు పైన వున్నారు' అని నాయకుల స్వభావాన్ని వివరించారు.

ఈ ముఠా కక్షలకు ఆజ్యం పోస్తున్నది రాజకీయ పార్టీలేనని 'పెదనాయిన' మాటల వల్ల తెలుస్తుంది.

రాయలసీమలో కక్షలకు దారితీసిన పై వివరించిన పరిణామ క్రమాన్ని కథలో కథకుడి పెదనాన్న వివరించి వున్నాడు. కథాధర్మాన్ని పాటిస్తూ రచయిత అతి సంక్షిప్తంగా కక్షలకు దారితీసిన పరిస్థితిని కథకుడి పెదనాన్నతో చెప్పించాడు. అదే శిల్ప విధానం కూడా !

కక్షల విషవలయం కథలో చిత్రితమైంది. ఈ విషవలయాన్ని చెప్పకపోతే పాఠకుడికి కక్షల తీవ్రత అర్థం కాదు. రచయిత ఆశించిన ప్రయోజనం నెరవేరదు. కథలో పదమూడు సంవత్సరాల వాసు అనే పిల్లవాడున్నాడు. గ్రామంలో ఎదుటి పక్షం వాళ్ళ ఎత్తుగడలు తెలుసుకొని ఇంట్లో వివరిస్తాడు. పొరుగూరు నుంచి పై మనుషులు వచ్చినారని, రాత్రికి తమ ఇంటిపై పోలీసులు సోదాలు చేస్తారని వాసు వివరిస్తాడు. ఈ సందర్భంలో కథకుడు వాసును గురించి 'ఏ గూటి చిలక ఆ పాటే పాడుతుంది' అని అంటాడు. ఈ మాట వెనుక ముఠా కక్షల కొనసాగింపు సంస్కృతి వ్యక్తమవుతుంది. లేకపోతే పదమూడేళ్ళ పిల్లవాడు ఎదుటి పక్షం ఎత్తుగడల్ని ఎలా తెలుసుకోగలిగాడు ? వైద్యుడైన కథకునికి వున్న భయం వాసుకు ఎందుకు లేకపోయింది ? కథకుడు ఆ గూటి పక్షి కాదు గనక, వాసు ఆ గూటి చిలకే గనక.

ఈ ముఠా కక్షలకు ఆజ్యం పోస్తున్నది రాజకీయ పార్టీలేనని 'పెదనాయిన' మాటల వల్ల తెలుస్తుంది. సామాజిక సంక్షేమానికి పూచీ పడి రాజ్యాంగబద్ధంగా నమోదైన రాజకీయ పార్టీ ఏ విలువలతో ఎన్నికై ఎటువంటి పాలన కొనసాగిస్తుందో పాఠకుడు ఈ కథ ద్వారా గమనించాలి. మొత్తం సామాజిక సంక్షేమాన్ని గాలికొదిలేసి తమ గుంపు క్షేమమే సమాజిక క్షేమమని, అదే అధికారమని, ప్రజాస్వామ్యమని ముఠా కక్షలు చెబుతాయి. ఈ అనైతికతను పాఠకుడు గమనించాలి.

స్త్రీలు సంసారపక్షంగా ఆలోచిస్తారని, మృదుస్వభావులని అనుకుంటాం. కానీ కథలోని లక్ష్మక్క పాత్ర అలా కాదు. లక్ష్మక్క 'మీ బావను చంపినోడు కుక్క చావు చచ్చేదాకా ఈ గాజులు పగులగొట్టుకోను; ఈ బొట్టు చెరుపుకోను అన్నానురా ! చదువుకున్నోడివి చెప్పు ఇది తప్పంటావా ?' అని అంటుంది.

> సామాజిక సంక్షేమాన్ని భుజానికెత్తుకున్న రాజకీయ పార్టీలు, ప్రభుత్వ వైఫల్యాలే కారణమని కథా సారాంశం.

నిజానికి తన భర్తను హత్యచేసినవాళ్ళు పదివేల రూపాయలు తీసుకుని హత్య చేశారు. తన భర్తపై వ్యక్తిగత కక్షలు, సారా వ్యాపారంలోగాని, రాజకీయ తగాదాలు గాని లేవు. కేవలం డబ్బునాశించి హత్య చేశారు. ఈ సందర్భంలో కథకుని అంతరంగాన్ని చూడాలి. లక్ష్మక్క పట్టుదలా, దాని పర్యావసానాలు ఊహించగలడు. కాని ఆమెను హెచ్చరించాలా, సమర్థించాలా, అభినందించాలా అన్న సంశయం పాఠకుణ్ణి సంబోధించి అనే మాట. ఆమె పట్టుదలను సమర్థిస్తే కక్షల పరంపర కొనసాగించాలన్నమాట ! 'అభినందన' అన్నమాట గాజులు, బొట్టు తీయకుండా వుంటే సంస్కృతికి సంబంధించిన అంశం. ఇక్కడ రచయిత పాఠకుణ్ణి ఆలోచించుకోమంటాడు. రచన పాఠకుడిలో సంస్కార స్థాయిని పెంచే దిశగా కొనసాగాలి. అందుకు రచయిత పాఠకుడికి అవకాశం కల్పించాడు. పోలీసు స్టేషనులో జయరాంతో మాట్లాడే సందర్భంలోనూ పాఠకుణ్ణి ఉద్దేశించే సంభాషణ కొనసాగింది. ఈ ముఠా కక్షలకు కారణమేమిటి ? దీనికి పరిష్కారమెలా ? అన్న చర్చల సారాంశం వుంది. అంటే రచయిత పాఠకుణ్ణి ఆలోచించమంటారు. కక్షలకు కారణాలు తెలుసుకోవడమే కాదు, నిర్మూలనకు పద్ధతులు కూడా అన్వేషించాలనే సందేశంతో కథ ముగుస్తుంది.

సాహిత్యంలో సమస్యల చిత్రీకరణే కాదు, పరిష్కారం కూడా చెప్పాలనే చర్చ కొనసాగింది. అన్ని సామాజిక సమస్యలకు పరిష్కారాలున్నట్లే సాహిత్యంలో కూడా పరిష్కారాలు చెప్పాలనే చర్చ కొనసాగింది. ఈ కథలో 'పెదనాయిన' పాత్ర ద్వారా కక్షలు ఎందుకొచ్చినాయో రచయిత చెప్పించారు. కక్షలు ఏ కారణాల వల్ల పెంపొందాయో వివరించారు. సామాజిక సంక్షేమాన్ని భుజానికెత్తుకున్న రాజకీయ పార్టీలు, ప్రభుత్వ వైఫల్యాలే కారణమని కథా సారాంశం. ఈ సారాంశం మానవ సంబంధాల ఆధారంగా చెప్పించడం రచయిత నైపుణ్యం.

ఈ కథలో కొన్ని సందేహాలున్నాయి. ఊరి మధ్యలో వుండే బురుజు మరాఠీ

దండు రోజుల్లో కట్టించింది. అది రక్షణకు, ఐక్యతకూ సంకేతమంటారు రచయిత. ఇప్పుడది సగం కూలిపోయి, పైన పిచ్చిమొక్కలు మొలిచాయి అని అంటారు. గ్రామంలో ఐక్యత, రక్షణ కూలిపోయినట్లే బురుజు కూలిపోయిందని చెప్పదలచుకున్నారు. మరాఠా దండుకు, ప్రయివేటు సైన్యాలకు పెద్ద తేడా గమనించలేము. బురుజు భూస్వామ్య సంకేతం. అటువంటి బురుజు కూలిపోవడం మంచిదే కదా ! బురుజు ఎవరి రక్షణకై నిర్మించింది ? ఎవరి ఐక్యతపై నిర్మించింది ? గత సమాజమే మెరుగైందా ? కథలో ఏ పాత్ర కూడా ప్రధాన కథా సూత్రానికి దూరంగా లేదు. కథా సన్నివేశాలు కథా సూత్రాన్ని బలపరిచేవిగానే వున్నాయి. ఈ బురుజు ప్రస్తావనే కథలో విలక్షణంగా కనిపిస్తుంది. బురుజు భూస్వాముల ఐక్యతకు, రక్షణకు పనికొచ్చిందే కాని గ్రామంలోని మిగతా జనానికి ఎలా ఉపయోగపడుతుంది ? సమాజంలో అది నిర్వహించిన పాత్ర ఎట్టిది ? భౌతికంగా బురుజు కూలిపోయిందే కాని బురుజు సంస్కృతి కూలిపోలేదు. ఈ పరిస్థితిలో బురుజు చుట్టూ వున్న కట్టపై జనం కూర్చోవడానికి జంకుతారు. కట్టపై జనం కూర్చోవడమే ఐక్యత, రక్షణకు చిహ్నం కాదు. కట్ట మీద కూర్చోవడానికి అనుమతి లేని వర్గం ఏ గ్రామంలోనూ వుండదు. బురుజుకు బదులు దళితవాడలోని రావిచెట్టు కట్ట వుండి వుంటే కథ మరోలా వుండేది.

ఏదేమైనా తెలుగు కథ ప్రజల దగ్గరకు వెళ్ళింది. ప్రజల సమస్యల్ని ప్రతిబింబించింది. కేవలం 'కూలిన బురుజు' కథ బింబ ప్రతిబింబ ధర్మాన్నే కాకుండా సృజనాత్మకంగా ప్రతిబింబించింది. సమస్యను అర్థం చేసుకోవడానికి పాఠకుణ్ణి పురమాయించింది.

ఇవ్వాళ కథా రచయిత ఏమి ఎలా ఆలోచిస్తున్నాడో ఈ కథ చెబుతుంది. రచయిత సామాజిక బాధ్యత నుంచి తప్పుకోలేడన్నది వాస్తవం. ఐతే సమస్య చిత్రణ, సమస్య పరిష్కారంలో భిన్న అవగాహనలందవచ్చు.

కేతు విశ్వనాథరెడ్డి గారు మిగతా విశ్వవిద్యాలయ ఆచార్యుల లాగా పండిత చర్చలకు పరిమితం కాకుండా తన రచనల్లో ప్రజా సమస్యల్నే చిత్రిస్తూ వారి వెంటే ఆలోచించిన వ్యక్తిత్వం ఆయనది.

మేటి కథలు-లోతు వ్యాఖ్యలు


# మహా విద్వాంసుడు



ఆచార్య తుమ్మల రామకృష్ణ

కన్నదాసు మూలింటి కొట్టిడీలో అడుగుపెట్టాడు. మౌనంగా నాలుగు మూలలూ పరికించి చూశాడు. పాత రాతి గోడలు. సున్నం గచ్చుతో కట్టిన గోడలు. పెచ్చులూడిపోయిన గోడలు. పేడ మన్ను కలిపి మెత్తిన తేపలు. సున్నం ఎలిసిపోయిన తేపలు. పాతబడి రేపోమాపో పడిపోవడానికి సిద్ధంగా ఉన్న గోడలు.

కన్నదాసు ముభావంగా ఉత్తరం వేపు తిరిగి చూశాడు. ఒళ్లు జలదరించింది. ఎగిరట్ల పడ్డాడు. క్షణం భయమనిపించింది. మసక చీకట్లో తలకిందులుగా వేలాడుతూ ఉంది. తాతముత్తాతల నాటి జ్ఞాపకం. వారసత్వంగా మిగిలున్న నాదస్వరం. అవమానాలకు ఆనవాలుగా మిగిలున్న నాదస్వరం. వెక్కిరింతలా గూటాన వేలాడుతున్న నాదస్వరం. సప్తస్వరాలను సరళీవరసలుగా, జంట స్వరాలుగా, దాటు స్వరాలుగా, గీతాలుగా, వర్ణాలుగా, కీర్తనలుగా, సంకీర్తనలుగా.... రాగాలుగా... పల్లవులుగా... ఇంకా ఎన్నో రకాలుగా పలికే.... ఒలికే.... పలవరించే నాదస్వరం. హోరుగాలి సవ్వడులు వినిపించే నాదస్వరం. సముద్ర తరంగాల మ్రోతల్ని మరిపించే నాదస్వరం. వేల సంగతుల సమ్మోహన రాగాల మోహన గాంధర్వగానాల సమ్మిశ్రిత రూపం నాదస్వరం. శుభాలకీ అశుభాలకి గడపల్లో గడీల్లో ముందు



నిల్చి నడిచే నాదస్వరం.

నాదస్వరం అటూ ఇటూ తిప్పి చూసినాడు. కర్రకు కట్టిన ఎర్రటి జోల్నా తుక్కు తుక్కయిపోయింది. ఆకులు పగిలి పనికి రాకుండా పోయినాయి.

కన్నదాసు జీవితంలో నాదస్వరం ముట్టుకోకూడదనుకున్నాడు. చిన్నతనంలో తండ్రి సాంబయ్యతో కల్సి పెళ్లిళ్లకీ, పేరంటాలకీ, నలుగులకీ, దేవర్లకీ, సమర్తలకీ, చావులకీ, మెరవన్లకి అన్నిటికీ పోయినాడు. కళ్ళారా చూసినాడు. చెవులారా విన్నాడు. అవమానాలు.... చీత్కారాలు... చీదరింపులు... తిట్లు... కులం అందించిన చేదు జ్ఞాపకాలు... మాయని మచ్చలు... గుండె గాయాలు.....

ముప్పై ఏళ్ళు... ఆలోచించి ఆలోచించి లోపల్లోపల కుమిలిపోయాడు.. కురూపిగా మారిపోయాడు. క్రూర ఘోర కుల కర్కోటకులతో వాదించి, విభేదించి అలిసిపోయాడు.

తడబడుతూ వెళ్లి గూటాన వేలాడుతున్న నాదస్వరం ముట్టుకున్నాడు. తిత్తి వూడి చేతిలోకొచ్చింది. గుప్పుమని కంపు కొట్టింది. తిత్తి మూతి విప్పాడు. బల్లిగుడ్లు.. పొలుకులు, చచ్చిన రిల్లల రెక్కల పొలుకులు. తిత్తిలోంచి జలజల రాలినాయి. ఇంటి ముందరకు వచ్చి తిత్తి విదిల్చినాడు. కడుపులో దేవినట్లయింది. కంపు భరించలేక తిత్తి గోడకవతల పారేసినాడు. నాదస్వరం అటూ ఇటూ తిప్పి చూసినాడు. కర్రకు కట్టిన ఎర్రటి జోల్నా తుక్కు తుక్కయిపోయింది. ఆకులు పగిలి పనికి రాకుండా పోయినాయి. కండెలు చిట్లిపోయినాయి. నాలుగైదు చోట్ల అనుసు చిట్లి చీలిపోయింది. సన్నని రాగి కమ్మితో చీలికల్ని కలిపి చుట్టి, మైనం పూసినట్లుండారు. నాదస్వరం తిరగేసి చూసినాడు. ఏండ్ల తరబడి తాత ముత్తాతలు... ఊపిరిపోసిన ఎంగిలి చారలు – అనుసంతా అవమానాల మచ్చలు. కర్రను గమనించాడు. రంధ్రాలు పూడిపోయినాయి.

కన్నదాసు పెరట్లోకి పోయి, ఎడమచేత్తో నాదస్వరాన్ని తలకిందులుగా పట్టుకొని కుడిచేత్తో నాలుగు చెంబులు నీళ్లు ఎత్తి అనుసులో పోసినాడు. కర్ర రంధ్రాల్లోంచి నీళ్లు బొట్లు బొట్లుగా కారినాయి. గుడిసిల్లు సూర్లో దోపిన

శలాకు తెచ్చి రంధ్రాల్లో పెట్టి తిప్పినాడు. కర్ర పైభాగంలోంచి, అనుసులోంచి శలాకు దూర్చి అటూ ఇటూ తిప్పినాడు. మళ్లీ నాలుగు చెంబులు నీళ్లు ముంచి అనుసులోంచి పోసినాడు. రంధ్రాల్లోంచి నీళ్లు ఫౌంటెన్లా చిమ్మినాయి. పొడిగుడ్డతో నాదస్వరాన్ని పరిశుభ్రంగా తుడిసినాడు. కర్ర బాగుంది. ఎక్కడా గాలి నెర్లులేవు. కర్ర పనికొస్తుందనుకున్నాడు.

సాంబయ్య కొడుకు ముఖం చూడలేకపోతున్నాడు. తప్పుకొని తిరుగుతున్నాడు. ఒక్కోసారి ముఖం చాటేస్తున్నాడు.

సాంబయ్య కొడుకు పనుల్ని మతిపోయిన వాడులా చూస్తున్నాడు. మాట పడిపోయినవాడులా మూగగా నిలబడుక్కున్నాడు. సాంబయ్యకు కన్నదాసు వాలకం అర్థం కావడంలేదు. సాంబయ్య ముప్పై ఏళ్లుగా కొడుకును దేనికి దూరంగా పెట్టాలనుకున్నాడో ఇప్పుడు కొడుకు దాన్నే అతి ప్రియంగా శుభ్రం చేస్తున్నాడు. దానికి మళ్లీ ఊపిరి పోయాలనుకుంటున్నాడు కన్నదాసు. సాంబయ్యకు కన్నదాసు నాదస్వరం ముట్టుకోవడం ఇష్టంలేదు. నాదస్వరం అట్లే కొట్టిడీలో గూటన వుండిపోవాలనుకున్నాడు. తనతోపాటు అదికూడా మట్టిలో కలిసి పోవాలనుకున్నాడు.

తనలాగే తన కొడుకు ఎదుగూ బొదుగూ లేకుండా చావుమేళాలు, సమర్త మేళాలు వాయించుకుంటూ వూళ్ళో రైతుల చేత అవమానాలు పొందుతూ బతక్కూడదనుకున్నాడు.

సాంబయ్య కొడుకు ముఖం చూడలేకపోతున్నాడు. తప్పుకొని తిరుగుతున్నాడు. ఒక్కోసారి ముఖం చాటేస్తున్నాడు. ఒకే ఇంట్లో ఉంటూ ఒకే కుండలోని కూడు తింటూ, ఒకే కప్పుకింద నిద్రపోతూ తండ్రి కొడుకులు ఒకరితో ఒకరు మాట్లాడకుండా అంటీ ముట్టనట్లుండటం సాంబయ్యకి కష్టంగా ఉంది.

ఒకరితో చెప్పుకునే విషయం కాదు. చెప్పుకున్నా ప్రయోజనం ఉంటుందన్న నమ్మకం లేదు. ఇప్పటి సమస్య కాదు. తరతరాల నుంచి తనలాగే, తన వాళ్లు ఎందరో ఎదుర్కొన్న, ఎదుర్కొంటూ వున్న సమస్య. ఈ నేలలో ఎక్కడ

తప్పినా మట్టి గొంతులు సాక్ష్యమిస్తాయి. గుండెలు అవిసేటట్లు ఆ గొంతుల ఘోషలు వినబడతాయి.

ఊరి ముందర సలవ బండ. బండమీద కాలిమీద కాలేసుకు కూర్చున్న శేషశాస్త్రి. సలవ బండకు గొడుగులా చింతచెట్టు. అక్కడికి వచ్చేసరికి ఎవరికైనా ఓ క్షణం ఆ నీడలో ఆగాలనిపిస్తుంది.

నిజానికి కన్నదాసు తప్పేమీలేదు. తను చదువుకుంటానన్నాడు. క్లాసు తప్పనన్నాడు. కుల వృత్తిలోకి రానన్నాడు. కాళ్లావేళ్లా పడ్డాడు. కంటికి కడవెడుగా ఏడ్చాడు. ఊరు వదలిపోనన్నాడు. అమ్మని, చెల్లెని వదిలిపెట్టడం చేతకాదన్నాడు. స్నేహితుల్ని వదులుకోలే నన్నాడు. ఇల్లంతా కలదిరిగాడు. ఆవలింటికాడికి వెళ్లి ఎద్దుల్ని, ఆవుల్ని సూసొచ్చాడు. చేను కాటికి మడికాటికి వెళ్లి సూసొచ్చాడు. చివరకు తల్లి కొంగు పట్టుకొని బోరుబోరున విలపించాడు. లాభం లేకపోయింది. తల్లి కూడా తండ్రి మాటకే వంత పాడింది. చెల్లి మాత్రం కౌగలించుకొని బోరున ఏడ్చింది.

సాంబయ్య ఆ రోజున కొడుకును దగ్గరికి పిల్చి కౌగలించుకొని కంట తడి పెట్టాడు. మెల్లగా తల నిమిరి నిన్ను గొప్ప విద్వాంసుడిగా తయారు చెయ్యడానికే పంపుతున్నానన్నాడు. నువ్వు బాగా విద్య నేర్చుకొని వృద్ధిలోకి వస్తే ముందుగా సంతోషించేది మేమేనన్నాడు. బుజ్జగించాడు. బుద్ధి చెప్పాడు. అప్పుడప్పుడూ వచ్చి చూసిపోతూ వుండొచ్చునన్నాడు. నేనూ మీ అమ్మ అప్పుడప్పుడూ నీ కోసం వస్తా వుంటామన్నాడు. చివరకు ఎట్లాగో గట్ల ఒప్పించాడు. కళ్లనీళ్లు తుడిచి బస్సెక్కించాడు. కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. బస్సు చెరువు కట్ట దాటుకొనేంతవరకూ నడీదిలో నిలబడి చూశాడు. తలగుడ్డతో కళ్లు తుడుచుకుంటూ ఇంటిముఖం పట్టాడు. అవన్నీ గుర్తుకువచ్చి సాంబయ్య గుండె తరుక్కుపోతూ వుంది. సాంబయ్యకు శేషశాస్త్రిని బూతులు తిట్టాలనిపిస్తూ వుంది. ఎప్పటెప్పటివో పాత జ్ఞాపకాలు దొంతర్లు... దొంతర్లుగా కదులుతున్నాయి...

ఊరి ముందర సలవ బండ. బండమీద కాలిమీద కాలేసుకు కూర్చున్న శేషశాస్త్రి. సలవ బండకు గొడుగులా చింతచెట్టు. అక్కడికి వచ్చేసరికి ఎవరికైనా ఓ క్షణం ఆ నీడలో ఆగాలనిపిస్తుంది. ఆ రోజు శేషశాస్త్రి "ఒరే సాంబా.....

ఇట్లా వచ్చిపోరా....'' అంటూ పిల్చాడు. పల్లె నుంచి ఆకలితో తిరిగొస్తున్న సాంబయ్య సంకనున్న అడపం సంచి పక్కనబెట్టి, తలగుడ్డతో ముఖంమీద చెమట తుడుచుకుంటూ నాలుగడుగుల దూరంలో నిలబడుకున్నాడు.

**కన్నదాసు పాటను, గొంతును శేషశాస్త్రి మెచ్చుకొనేసరికి సాంబయ్య ఉబ్బితబ్బిబ్బై పోయాడు**

"ఈ మధ్య వూర్లో వుండావా లేవారా?'' శేషశాస్త్రి ప్రశ్నించాడు.

"ఏదో కడుపాత్రం స్వామి. కర్నాటక దిక్కు పోయింటి''

శేషశాస్త్రి చెప్పడం మొదలు పెట్టాడు.

"ఏమీ లేదురా సాంబా.... మొన్న శనివారాలొక్కపొద్దులనాడు. మీవాళ్లంతా గుడికొచ్చిండ్రి. అబ్బుడో పిల్లోడు పాటపాడినాడు. ఏం! పాడినాడురా. మన దేవుడు నిద్రపోయినాడంటే నమ్ము. గుడికొచ్చినోళ్లంతా బొమ్మలై పోయినారంటే నమ్ము. వాని గొంతులో గంధర్వులు కొలువుండార్రా. గొంతులో మాధుర్యం ఉంది. మంచి శ్రావ్యత ఉంది. లయ బాగుంది. శ్రుతి పొల్లు పోవడం లేదు. అంతా అయినాక 'ఎవురి కొడుకువిరా' నువ్వు అంటే 'సాంబయ్య కొడుకు' అన్నాడు. నమ్మలేక పోయాను. వానికి మంచి భవిష్యత్తు ఉంది. మా ఇళ్లల్లో అలాంటి పిల్లోడు పుట్టింటే దాని కతే అలాదు. నా మాటిని వాణ్ణి మనూర్లో పెట్టద్దు. మీ వోళ్ల మధ్యలో వుంటే చెడిపోతాడు. వాణ్ణి మంచి విధ్వాంసుని దగ్గర వొదిలిపెట్టు. నాలుగేళ్లు సాధన పొందినాడంటే వాని గొంతులో పలకని సంగతంటూ వుండదు. వానికి నీ మాదిరిగా నాదస్వరం గీదస్వరం నేర్పించవద్దు. నేర్పిస్తే వాడూ నీ మాదిరి చావు మేళాలు, సమర్త మేళాలు వాయించి బతకాల్సిందే. పిల్లోడు ఎర్రగా బొద్దుగా ఉన్నాడు. చెక్కిన బొమ్మలా ఉన్నాడు. అచ్చం బాపనోళ్ల పిల్లోడులా ఉండాడు. వానికి 'గాత్రం' (పాట) నేర్పించు. నేను సచ్చి ఏ లోకానున్నా మా వూరి సాములోరు మేలు చేశాడని తల్చుకుంటావు.'' శేషశాస్త్రి పరవశిస్తూ చెప్పాడు.

కన్నదాసు పాటను, గొంతును శేషశాస్త్రి మెచ్చుకొనేసరికి సాంబయ్య ఉబ్బితబ్బిబ్బై పోయాడు. నాలుగేళ్లుగా అదో ఇస్తా... ఇదో ఇస్తా.. అని కూతురి పెళ్లికి వాయించిన డబ్బులు ఇవ్వకపోయిన సంగతి మరిచేపోయాడు.

మనసులోనే సాంబయ్య శేషశాస్త్రికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

అవన్నీ ఇప్పుడు ఒకటి తర్వాత ఒకటి సాంబయ్యకి మతి కొస్తున్నాయి.

సాంబయ్య కన్నదాసును తమిళనాడుకు పంపించాడేగాని కొడుకుని తల్చుకోని కంట నీరు పెట్టని రోజు లేదు. తండ్రి పరిస్థితి అర్థం చేసుకున్న కన్నదాసు తండ్రికి ధైర్యం చెబుతూ ఉత్తరాలు రాసేవాడు.

**తన గురించి, గురువుగారి గురించి, అక్కడి సంగీత సాధన గురించి, పరిసరాలు గురించి తండ్రికి కన్నదాసు జాబుల్లో రాసేవాడు.**

పిచ్చప్ప తర్ఫీదు కన్నదాసుకు బాగా నచ్చింది. గురువు శిష్యులు లాగా కాకుండా పిచ్చప్ప, కన్నదాసు తండ్రి బిడ్డల్లా మెలగసాగారు. తన సంగీత వారసుడు కన్నదాసే నన్నాడు పిచ్చప్ప. కన్నదాసు తన భక్తి శ్రద్ధలు, నిరంతర కఠోర సాధన ఫలించాయనుకున్నాడు.

తన గురించి, గురువుగారి గురించి, అక్కడి సంగీత సాధన గురించి, పరిసరాలు గురించి తండ్రికి కన్నదాసు జాబుల్లో రాసేవాడు. తల్లిని చెల్లిని బెంగపెట్టుకోవద్దని తెలిపేవాడు. సాంబయ్య ఆ జాబుల్ని ఒకటికి రెండుసార్లు చదివించుకొనేవాడు. ఆ జాబుల్ని అట్లే జోబుల్లో పెట్టుకొని తిరిగేవాడు. ఊర్లో తెలిసినోళ్లందరికీ ఆ జాబులు చూపించేవాడు. కన్నదాసును చూసినప్పుడల్లా ఆ జ్ఞాపకాలన్నీ సాంబయ్య కళ్ల ముందు తిరుగాడుతున్నాయి.

మల్లెపువ్వు లాంటి లాల్చీ తొడుక్కోని పాల నురగలాంటి సరిగంచు పంచె కట్టుకొని, భుజాన కండువా వేసుకొని ముఖాన చందనం బొట్టు పెట్టుకొని కన్నదాసు కచ్చేరీ చేయడానికి బస్సెక్కి వెళుతూ వుంటే బస్టాండులో నిలబడ్డ మగవాళ్లు కూడా కన్నార్పకుండా చూసేవాళ్లు.

మంగలోళ్లలో కూడా ఇంత అందంగా పుడతారాని వెనకాల చెవులు కొరుక్కునేవాళ్లు. అలాంటి మాటలు సాంబయ్య చెవిన పడినప్పుడల్లా, లోపల్లోపల సంతోషపడేవాడు. మొదట్లో కొడుకు కన్నదాసు వెంట కచ్చేరీలకు సాంబయ్య కూడా వెళ్ళేవాడు. ఆతర్వాత సాంబయ్యకు పచ్చకామెర్లు వచ్చి మంచం పట్టడం వల్ల కొడుకుతోపాటు కచ్చేరీలకు వెళ్లడం మానుకున్నాడు.

కన్నదాసు వెళ్లని ప్రాంతం లేదు. కచ్చేరీ చెయ్యని స్టేజి లేదు. దేశం నలుమూలలా కన్నదాసు కీర్తి పాకింది. ఒక వూరు కాదు.... ఒక పట్నం కాదు.... ఒక నగరం కాదు అన్ని ప్రాంతాలూ తిరిగి కచ్చేరీలు చేశాడు. ఎక్కడ పాడినా, కచ్చేరీ చేసినా విన్నవాళ్లు భేష్ అన్నారు. సెభాష్ అన్నారు. పాడుతున్నంతసేపూ మైమరచి తలలూపారు. ఒళ్లు మరిచి చప్పట్లు కొట్టారు. ఏమి రాగాలాపన... ఏమి కల్పన... ఏమి ప్రస్తానం.... పొగిడారు. అంతవరకూ బాగానే ఉంది. ఆ తర్వాతనే మొదలయింది... కన్నదాసు ఏ వూరి వాడు? ఏ కులం వాడు? అపచారం జరిగిపోయినట్లు బాధపడ్డారు. మాటల్లో తేడా చూపించారు. చేతల్లో చూపించారు. చెవులు కొరుక్కున్నారు. మూతులు ముడుచుకున్నారు. బాహాటంగానే ఆ మాత్రం ఎవరు పాడలేరు. వంటావార్పు పనులు పాడతారన్నారు.

> **కచ్చేరి ఇంకో పదిరోజుల్లో ఉంటుందని తెలియగానే సాధన ప్రారంభించాడు. ఏయే రాగాలు ఆలపిస్తే బాగుంటుందో ముందే నిర్ణయించుకున్నాడు.**

కన్నదాసు పొగత్తలకి పొంగిపోలేదు. తెగడ్తలకి కుంగిపోలేదు. ఇవన్నీ మామూలేననుకున్నాడు. తన గొంతే తన బలమనుకున్నాడు. తన విద్యే తన ధనమనుకున్నాడు.

సంగీత ఆరాధనోత్సవాల్లో పాల్గొనాలని కన్నదాసు ఎన్నో ఏళ్ళుగా కలలు కన్నాడు. ఆ అవకాశం ఇప్పుడు వచ్చింది. తాను ఆరాధనోత్సవాల్లో పాడబోతున్నానని బంధువులకీ, స్నేహితులకీ, అందరికీ తెలియజేశాడు.

కచ్చేరి ఇంకో పదిరోజుల్లో ఉంటుందని తెలియగానే సాధన ప్రారంభించాడు. ఏయే రాగాలు ఆలపిస్తే బాగుంటుందో ముందే నిర్ణయించుకున్నాడు. ఆయా రాగాల్లో ఇంతవరకూ అపురూప కీర్తనల్ని ఒకటికి పదిసార్లు పాడి ఎక్కడా ఎందులోనూ పిసరంత పొల్లుపోకుండా చూసుకున్నాడు. మంచి మంచి తిల్లానాలు... పల్లవులు పెట్టుకున్నాడు.

ఆ రోజు సభ సంగీత ప్రియులతో నిండిపోయింది. దేశం నలుమూలల నుండి వచ్చిన విధ్వాంసులు ఒకటి, రెండు, వరుసల్లో కూర్చున్నారు.

అంతమంచి విధ్వాంసులు ముందు పాడడం తన అదృష్టంగా భావించాడు.

కన్నదాసు శ్రుతికూడి "మహాగణపతిం మనసా స్మరామి" అంటూ కచ్చేరి ప్రారంభాన్ని గణపతి స్తుతితో మొదలు పెట్టాడు. పక్కవాద్యాలు కన్నదాసు గాత్రంలో లీనమైపోతున్నాయి. ప్రార్థనే సంగీత హృదయుల్ని ఆనంద పారవశ్యంలో ముంచేసింది.

**హాలు హాలంతా కరతాళ ధ్వనులతో మారు మ్రోగిపోయింది. పొగడ్తల వర్షం కురిసింది.**

కల్యాణి .... పూర్వీ కళ్యాణి... కాంభోజి... కరహరప్రియ... రంజని... శివరంజని... బేగడ... భైరవి... శహాన... కానడ... తోడి... అభేరి.... ఎన్నో రాగాలు.... రావమ్మ... నీరజాక్షి కమలాక్ష్మి... ఎందుకు దయరాదు... శోభిల్లు సప్తస్వర... మోక్షము భువిలో రామా నన్ను బ్రోవరా... బ్రోచేవారెవరురా... నగుమోము... పంచరత్నాలు.... ఇలా ఎన్నో కన్నదాసు గొంతులోనుంచి జలపాతా జాలువారాయి. కన్నదాసు అంతగా పరవసించి పాడలేదు. తిల్లానాలు... పల్లవులు... ఏనాడూ ఆలపించలేదు.

అందరూ ఆగాన ప్రవాహంలో ఓలలాడారు. పరవసించి పులకించారు.

సభలోనివారు...

కన్నదాసు గొంతులో కళ్యాణి పంచకళ్యాణి అయ్యింది. మోహన సమ్మోహనాస్త్రమైంది. మధ్యమావతి మతులు పోగుట్టింది. శివరంజని సిరిమల్లెలా విరిసింది. భైరవి ఉప్పొంగిన సముద్రమైంది. అభేరి భూమ్యాకాశాలను కుదిపేసింది... అన్నారు.

## సంగీత ప్రస్థానంలో...

ఆదినాట అంత్య సురభి అంటారు. ఆ సాంప్రదాయాల్ని అనుసరించే కన్నదాసు మంగళం పాడి కచ్చేరి ముగించారు.

హాలు హాలంతా కరతాళ ధ్వనులతో మారు మ్రోగిపోయింది. పొగడ్తల వర్షం కురిసింది.

"ఇంత అద్భుతమైన గాత్రం ఎక్కడా వినలేద"న్నారు.

"ఆ రాగాలాపన నభూతో నభవిష్యతి" అన్నారు.

సభలోని వారంతా ఆనంద పారవశ్యంతో మునిగున్న సమయంలో ఎక్కడినుంచో సుడిగాలిలా పరబ్రహ్మశాస్త్రి మైకు ముందుకొచ్చాడు. అందరూ వూపిరి బిగబట్టి కూర్చున్నారు.

దెబ్బ తగలాల్సిన చోటే తగిలింది. గుండె బద్దలైపోయింది. కన్నదాసు విలవిలలాడి పోయాడు.

పరబ్రహ్మశాస్త్రి....

"ప్రియమైన విధ్వాంసులారా... కన్నదాసు సామాన్యుడుకాదు. అతని బాణి గాత్ర సంగీత బాణి కాదు. ఆ జ్ఞానం గురువు వల్ల అబ్బిందంటే నేను నమ్మలేక పోతున్నాను. అతని తాత ముత్తాతలెవరో నాదస్వర విద్వాంసులైవుండాలి. ఆ జన్మ సంస్కారం కన్నదాసుకు అబ్బి ఉండాలి. మేము భైరవి పాడితే ఒక్క గోలిగుండు తార్రోడ్డుమీద దొర్లించినట్లుంటాది. కన్నదాసు ఈరోజు పాడిన భైరవి ఒకలారీ గోలిగుండ్లు సిమెంటు రోడ్డుమీద దొర్లించినట్లున్నాయి. ఏది ఎటుపోతూవుందో, దేనివెంట ఏది పరుగెడుతూవుందో చెప్పడం కష్టం. అది అనుభవైక వేద్యం... అమోఘం... అనిర్వచనీయం..." అంటూ ముగించాడు. పరబ్రహ్మశాస్త్రి కన్నదాసును పొగిడాడో, తెగిడాడో ఎవరికీ అర్థంకాలేదు.

దెబ్బ తగలాల్సిన చోటే తగిలింది. గుండె బద్దలైపోయింది. కన్నదాసు విలవిలలాడిపోయాడు. పరబ్రహ్మశాస్త్రి మాటల్లోని వ్యంగ్యం కన్నదాసుకు బోధ పడింది.

ఒక్కక్షణం అక్కడ ఉండాలనిపించలేదు కన్నదాసుకు. ఎందరు ఎన్ని రకాలుగా ప్రాధేయపడినా కన్నదాసు వినిపించుకోకుండా వచ్చేశాడు.

కన్నదాసుకు లోకం స్వరూపం తెలిసొచ్చింది. సంగీతానికి కులం, మతం ఉన్నాయని తెలిసి తల్లడిల్లిపోయాడు. తట్టుకోలేకపోయాడు. విలవిల్లాడిపోయాడు. అర్థాంతరంగా తన గొంతు మూగబోతే బావుండు ననుకున్నాడు. ఎవరైనా తన గొంతును బలంగా పట్టి నులిమేస్తే బావుండు ననుకున్నాడు. నిట్టనిలువునా ప్రాణం పోతే బావుండు ననుకున్నాడు. బతికుంటే పాట పాడకుండా ఉండలేడు. పాట పాడితే అది ఎంగిలి పాట మంగలి పాట అంటారు. తనకు

లేని కులం తను ఎక్కడి నుంచి తేగలడు. జ్ఞానంలో ఎవరితోనైనా పోటీ పడగలడే గాని లేనిది ఎలా సంపాయించగలడు. కులాలు పెట్టినోన్ని చెప్పుచ్చుక కొట్టాలన్నాడు. కులం చూసి గౌరవించేవాడు మనిషే కాదన్నాడు. ఆ మాటకొస్తే ఎవడికులం వాడికి గొప్ప అనుకున్నాడు.

నలుగురికీ ఆనందం పంచే సంగీతానికీ, నలుగురినీ అలరించే సంగీతానికి, నలుగుర్నీ సమ్మోహితుల్ని చేసే సంగీతానికి... ఈ దేశంలో కులముందన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోయాడు.

కన్నదాను ఇప్పుడు మునుపటిలా లేడు. మాసిన గడ్డం, రేగిన జుట్టు, చెమటలో మగ్గి వాసన కొడుతున్న బట్టలు, పిచ్చిపట్టినవాడిలా గున్నాడు.

బొందిలో ప్రాణమున్నంతవరకూ పాట పాడకూడదనుకున్నాడు. కన్నదాసు. ఎవరొచ్చి అడిగినా కచ్చేరీలు మానేశానన్నాడు. సంగీతం మర్చిపోయానన్నాడు. సంగీతం నాలో చచ్చిపోయిందన్నాడు. ఎంత ప్రాధేయపడినా, ఎంతడబ్బిస్తామన్నా ససేమిరా ఒప్పుకోవడం లేదు.

కన్నదాను ఆర్నెల్లుగా ఎక్కడికి పోవడంలేదు. మాట్లోనే ఉంటున్నాడు. పొలాలంటే, చెరువు గట్లంటి, వంకలంటి, వాడాలంటి తిరుగుతున్నాను. గుండె గొంతుకలోన పోట్లాడి, కాట్లాడి కూనిరాగమై ప్రకృతిలో మాయమైపోతూ ఉంది. ఆ కూని రాగాల్లో మహా ప్రళయ సంఘర్షణాఘర్షణలు ప్రాణం పోసుకుంటున్నాయి.

కన్నదాను ఇప్పుడు మునుపటిలా లేడు. మాసిన గడ్డం, రేగిన జుట్టు, చెమటలో మగ్గి వాసన కొడుతున్న బట్టలు, పిచ్చిపట్టినవాడిలా గున్నాడు. ఎవరితోనూ మాట్లాడటంలేదు. ఎక్కడికి పోతాదో ఎప్పుడు వస్తాడో ఎవరికీ తెలియడంలేదు.

తన బిడ్డకి ఎవరో ఏమో చేసేశారని సాంబయ్య వూర్లో కనిపించిన మనిషి దగ్గరల్లా గొణుగుతున్నాడు. సాంబయ్య పెళ్లాం ఇంట్లో మూగగా రోధించడమే తప్పా వీధి ముఖానికి రావడంలేదు. కన్నదాను వాలకం చూసి అంతా

ఆశ్చర్యపోతున్నారు. బయపడిపోతున్నారు. రోజులు... నెలలు... సంవత్సరాలు దొర్లుకుపోయాయి.

★ ★ ★

ఎగవీధిలో నుంచి పరుగెత్తుకుంటూ వచ్చాడు ఆదెప్ప. రావడం. రావడం గసపోసుకుంటూ వీధిలోంచే సాంబన్నా... సాంబన్నా.... అంటూ గట్టిగా పిల్చాడు. వెంటనే సమాధానం లేకపోయేసరికి మొగసాల్లోకొచ్చి "ఏమ్మే వెంకటలక్ష్మి మీ నాయన ఇంట్లో లేడా!" అన్నాడు.

"లేదు మామా పల్లికి పోయినాడు" అని సమాధానమిచ్చింది వెంకటలక్ష్మి,

"ఎట్లమ్మే ఎవురైనా పోయి తొందరగా పిల్చుకోని రావాల" అని చెప్పి ఆదెప్ప కిందికి దిగబడిపోయినాడు.

గుడి పూజారి శేషశాస్త్రి మరణించాడన్న వార్త వూరు వూరంతా అల్లుకు పోయింది. కడసారి కంటిచూపుకు చుట్టుప్రక్కల గ్రామాలనుంచి గుంపులు గుంపులు గా వచ్చిపోతున్నారు. ఆదెప్ప, సాంబన్న కోసం ఆదుర్దగా ఎదురు చూస్తూ ఉన్నాడు.

శేషశాస్త్రి ఇంటి ముందు కోలాహలంగా ఉంది.

ఏడుపులు... ముక్కు చీదడాలు... పడి పడి ఏడ్వడాలు. అందరి ముఖాల్లోనూ విషాదమే. మరణ విషాదం...

"ఏం... వెంకటలక్ష్మీ మీ నాయన రాలేదా!" ఆదెప్ప ఆత్రంగా అడిగాడు.

"లేదు మామా..." వెంకటలక్ష్మి నిస్సహాయత.

"ఇప్పుడు ఏం చేసేదమ్మీ... అందరూ వచ్చేసినారు. మంగలోళ్లని రమ్మనండి అంటూ చెప్పి పంపుతున్నారు. దిక్కు తోచడం లేదు" అన్నాడు ఆదెప్ప.

పల్లె నుంచి పరుగు పరుగున వచ్చిన సాంబయ్య మాత్రం శేషశాస్త్రిని తల్చుకొని కంట తడిపెట్టాడు. కులం కంపులో కుళ్లి కంపుకొడుతున్న శవాలను నిద్రలేపే ఆలోచనలో పడ్డాడు మహావిద్వాంసుడు.

ఆంధ్రభూమి జూన్ 6, 2022 సంచికలో ప్రచురితమైనది.


మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# కులవివక్షపై గురిపెట్టిన అస్త్రం - మహా విద్వాంసుడు




కవితశ్రీ
✆ 94946 96990


ఆచార్య తుమ్మల రామకృష్ణ గారి "మహా విద్వాంసుడు" కథ చదివితే కులం కారణంగా గురుముఖం ద్వారా విద్యకు నోచుకోలేకపోయిన ఏకలవ్యుడు గుర్తొస్తాడు. ఆ కులం కారణంగానే తన విద్య పనికిరాకుండా అతని బొటనవేలిని బలిగొన్న పాలకమన్యుల కుటిలనీతి, ప్రాణానికి ప్రాణం లాంటి బొటనవేలిని కోల్పోయిన ఏకలవ్యుని దైన్యం గుర్తొస్తాయి. అదే కులం కారణంగా తన అస్త్రవిద్యా ప్రదర్శనకు నోచుకోక అవమానం పాలైన కర్ణుడు గుర్తొస్తాడు. అదే కులం కారణంగా మహర్షిత్వం పొందిన నేరానికి స్వయానా అవతారపురుషులుంగారి చేతే అసువులు కోల్పోయిన శంబూకుడు గుర్తొస్తాడు. "నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి, రూపు రేఖా కమనీయ వైఖరులు గాంచి, భళీభళి అన్నవాడె మీదే కులమన్న ప్రశ్న వెలయించి, చివాలున లేచిపోవుచో బాకున గ్రుమ్మినట్లగును పార్థివచంద్ర! వచింప సిగ్గగున్" అని వాపోయిన కవికోకిల జాషువా గారి మాటలు గుర్తొస్తాయి.



విద్యలకు,కళలకు,క్రీడలకు,కులంతోటి, వర్ణంతోటి, మతంతోటి, జాతితోటి ఎలాంటి అవినాభావ సంబంధం లేదు. అవి ఫలానా వారికి అబ్బుతాయి అని గానీ, ఫలానా వారికి అబ్బవు

అని గానీ చెప్పడానికి వీలుపడదు. కాకపోతే అనువంశికంగా ఒక కళను ఆశ్రయించిన వారిలో ఆ కళ రక్తంలో ఇంకిపోవడం వలన వారి వారసులకు కొంతవరకూ వారసత్వంగా సులువుగా అబ్బవచ్చు. కొందరికి కళ సాధన ద్వారా పట్టుబడుతుంది. మరికొందరికి సహజంగా జన్యువుల్లో, శరీరావయవ నిర్మాణంలో అలాంటి సానుకూల లక్షణాలు ఉండటం వలన, దానికి సాధన తోడు కావడం వలన వారు ఆయా కళల్లో సమున్నత స్థానాలను చేరుకోవచ్చు. ఎంత మొద్దు మనిషి అయినా సాధన ద్వారా విద్యలు, కళలు, క్రీడలపై పట్టు సాధించవచ్చు. అంతేగాని వాటితోటి ఏ సామాజిక వర్గానికి కూడా అవినాభావ సంబంధం లేదు. శరీర నిర్మాణంలో ఉన్న సానుకూలత తోటి సాధన చేస్తే అవి పట్టుబడతాయి. సాధన లేని కళాకారుడికి ఎంత ప్రతిభ ఉన్నా అతని కళ రాణించదు. అయితే దురదృష్టం కొద్దీ మన దేశంలో విద్యలకు, కళలకు, క్రీడలకు కులకళంకం అంటుకున్నది. ఈ దేశంలో మొదట అక్షరజ్ఞానం వంటబట్టిన బ్రాహ్మణ సామాజిక వర్గం దాన్ని ఇతరుల పరం కాకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకుంది. విద్యలు, కళలు, క్రీడలు అన్నీ తమ వద్దే అట్టి పెట్టుకోవడానికి పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నది. (మనుస్మృతి నిస్సిగ్గుగా బ్రాహ్మణుడికి సర్వాధికారాలను కట్టబెట్టింది) అందుకుగాను ఎంతో కఠినమైన నియమావళులను స్మృతులను సృష్టించుకున్నది. ఆ స్మృతులను సెంటిమెంట్లుగా, భయాలుగా మార్చి యథాతథస్థితిని నిరాఘాటంగా కొనసాగిస్తున్నది. ప్రస్తుతం తెలుగు ప్రాంతాల్లో రెడ్లు, కమ్మలు, కాపులు విద్యలు కలళలను కొంతవరకు తమ వశం చేసుకున్నా ఇప్పటికీ క్రీడల్లో క్రికెట్, కళల్లో సంగీతం బ్రాహ్మణ సామాజిక వర్గం చేతుల్లోనే బందీలుగా ఉన్నాయి. బ్రాహ్మణ సామాజిక వర్గం నుండి రాజకీయాలను రెడ్డి, కమ్మ సామాజిక వర్గాలు; సినిమా రంగాన్ని కమ్మ, కాపు సామాజిక వర్గాలు లాగేసుకోవడం ఒక రకంగా ఆరోగ్యకరమైన పరిణామమే కానీ వాటికీ వారసత్వపు కంపు బలంగా అంటుకోవడం, రాజకీయ పార్టీలు అచ్చమైన కులసంఘాలుగా రూపాంతరం చెందిపోవడం విషాదం. ఈ నేపథ్యంలో సంగీతకళలో కుల

ఈ దేశంలో మొదట అక్షరజ్ఞానం వంటబట్టిన బ్రాహ్మణ సామాజిక వర్గం దాన్ని ఇతరుల పరం కాకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకుంది.

వివక్షని నిరసిస్తూ వచ్చిన మహా విద్వాంసుడు కథని లోతుగా సమీక్షించుకోవాల్సిన అవసరం వుంది.

> రామాయణం రాసిన వాల్మీకి బహుజనుడే కానీ ఆయనకు తన సామాజిక వర్గానికి కింద ఉన్న పంచమవర్ణ పేదల కష్టాలు పట్టలేదు.

మహా విద్వాంసుడు కథ బహుజన అస్తిత్వవాద ఉద్యమ నేపథ్యంలో వెలువడ్డ రచ్చన. దేశ జనాభాలో పేరులోనే ఉన్నట్టు బహుజనులు సుమారు 52 శాతం మంది ఉన్నారు. కానీ వాళ్ళు ఇప్పటికీ రాజ్యాధికారానికి ఆమళ్ళదూరంలోనే ఉన్నారు. ఇప్పుడు దేశ ప్రభుత్వ యంత్రాంగంలో అత్యున్నత స్థానంలో ఒక బహుజనుడున్నాడని, అది అతిగొప్ప విషయమని సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. కానీ యంత్రాంగంలో ఎవరున్నా వాళ్ళలో ఉన్నది మాత్రం పక్కా క్యాపిటలిస్ట్ బ్రాహ్మణవాద భావజాలం మాత్రమేననేది ఎవరూ కాదనలేని చేదునిజం. ఈ దేశంలో వలస ఆర్యులు అడుగుపెట్టిన నాటినుండి, వాళ్ళు వ్యూహాత్మకంగా స్థానికమైన ద్రవిడ సంస్కృతిని కూకటివేళ్ళతో సహా తొలగించి ఆర్య సంస్కృతిని నెలకొల్పడం మొదలు పెట్టిన నాటినుండి, నాటి బహుజనుడైన వాల్మీకి నుండి నేటి బడుగవర్గాలకు చెందిన సివిల్ సర్వీసు అధికారుల వరకూ కులవర్ణాలకు అతీతంగా అందరూ సదరు బ్రాహ్మణవాద భావజాలంలోనే ఆలోచిస్తున్నారు. రామాయణం రాసిన వాల్మీకి బహుజనుడే కానీ ఆయనకు తన సామాజిక వర్గానికి కింద ఉన్న పంచమవర్ణ పేదల కష్టాలు పట్టలేదు. తన సామాజికవర్గం ఉన్న శూద్రుల బాగోగులు పట్టలేదు. వ్యవసాయం చేయించి పదిమందికీ అంత కడిపెట్టే వైశ్యుల అగచాట్లు పట్టలేదు. చివరకు దేశ సంరక్షణ చూసే క్షత్రియుల పడుబాట్లు పట్టలేదు. ప్రజలపై ప్రభువులపై ఆర్య బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని, పెత్తనాన్ని సుస్థాపితం చెయ్యడం, వాళ్ళ ఆదర్శమైన ద్రవిడ సంస్కృతిని సర్వనాశనం చేసి దేశంలో ఆర్య సంస్కృతిని అందలం ఎక్కించడం మాత్రమే పట్టింది. కన్నులుండి చదివితే రామాయణం నిండా ఇదొక్కటే కనబడుతుంది. మరో బహుజనుడు వ్యాసుడు రాసిన భారతంలో కూడా ఇదే కనబడుతుంది. అంటే ఈ దేశంలో ఎవరైనా సరే తమ సొంత అస్తిత్వంలోంచి కాకుండా బ్రాహ్మణవాద అజెండాలోంచి మాత్రమే ఆలోచిస్తారు. నేటి తరం

మేధావులు, రచయితలు అందులో కూడా స్వల్పసంఖ్యాకులు మాత్రమే దాన్ని గుర్తించి బద్దలు కొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. వారిలోకి తుమ్మల రామకృష్ణ లాంటి రాజ్యవ్యవస్థలోని వ్యక్తి వచ్చిచేరడం ముదావహం.

> లోకుల ఆ కులపిచ్చితో విసుగుచెంది కన్నదాసు ఇక సంగీతం జోలికేపోనని ప్రతిజ్ఞ చేసుకోవడం

కన్నదాసు అనే మంగలి కులస్థుడు తనలో ఉన్న సహజ ప్రతిభతో గ్రామంలోని పదిమందిని చిన్నతనంలోనే ఆకట్టుకోవడం, శేషశాస్త్రి ప్రోత్సాహంతో అతని తండ్రి సాంబయ్య తనని తమిళనాడులోని ఒక సంగీతవిద్య నేర్పే గురువు (గురువు పిచ్చప్ప. ఇంకెవరు? బ్రాహ్మణుడే అయ్యుంటాడు. కానీ అతడు కులపట్టింపులు లేకుండా కన్నదాసుని చేరదీయడం, తనని కొడుకులా చూసుకోవడం, తన సంగీత వారసుడు కన్నదాసేనని ప్రకటించడం ముదావహం) వద్దకి పంపడం, తను భక్తిశ్రద్ధలతో సంగీతాన్ని అభ్యసించి గొప్ప సంగీత విద్వాంసుడు కావడం, కచేరీలు చేసి పేరుప్రఖ్యాతులు గడించడం, అవి చేకూరగానే సంగీతప్రపంచంలో అతని కులంపై ఆరాలు తీయడం ప్రారంభం కావడం, జనాలు అతని కులం తెలుసుకుని దాని కారణంగా అతన్ని, అతని సంగీత విద్యని తక్కువచేసి మాట్లాడ్డం, లోకుల ఆ కులపిచ్చితో విసుగుచెంది కన్నదాసు ఇక సంగీతం జోలికేపోనని ప్రతిజ్ఞ చేసుకోవడం, తను కులవ్యవస్థకి వ్యతిరేకంగా పోరాడ్డానికి కృతనిశ్చయుడు కావడం – ఇది మహా విద్వాంసుడు కథలోని ఇతివృత్తం. కులవ్యవస్థని, కళల్లో ఉన్న కులపిచ్చిని ఖండించడం, కులవ్యవస్థని రూపుమాపడానికి పాఠకుణ్ణి సన్నద్ధం చెయ్యడమే ఇందులోని కథావస్తువు. మహా విద్వాంసుడు కథ రాయడానికి తుమ్మలవారికి సాధికారత ఉంది. ఆ సాధికారత తన గ్రామీణ కుల నేపథ్యం నుండి వచ్చి అబ్బింది. విద్యావ్యవస్థలో తనకు ఎదురైన చేదు అనుభవాల నుండి వచ్చింది. సంగీతంపై పాటపై తనకున్న పట్టువల్ల అబ్బింది. ఆ మాటకు వస్తే కథలోని నాయకుడైన కన్నదాసు రచయిత రామకృష్ణే కావచ్చు. కాకపోతే కులవ్యవస్థ నుండి కన్నదాసు పొందిన జ్ఞానం సంగీత ప్రపంచానిది కాగా, రామకృష్ణ గారు పొందిన జ్ఞానం విద్యా వ్యవస్థది. మరుగు కొంచెమే. కన్నదాసు తన పూర్వీకుల నాదస్వరాన్ని

కొట్టిడీలో చూసినప్పుడు దాని గురించి చెప్పిన గతస్మృతుల్లో రచయిత రామకృష్ణ గారి సంగీత పరిజ్ఞానం, గ్రామీణ సంస్కృతి పట్ల ఆయనకున్న అవగాహన, తెలుగు గ్రామాల్లోని కులవివక్షల పట్ల తనకున్న అనుభవం, కులం కారణంగా తన పూర్వీకులు అనుభవించిన అవమానాలు, నాదస్వరం దాని విడిభాగాలపై వారికున్న పట్టు కొట్టొచ్చినట్టు కనబడతాయి.

ఈ నేలలో ప్రతిభావంతుడు రాణించాలంటే బ్రాహ్మణ కులంలోనే పుట్టాలి. ఇతర కులాల్లో పుట్టితే వాణ్ని పైకి ఎదగనీయరు.

రామకృష్ణ గారికి కులవ్యవస్థ యొక్క అనుపానులు తెలుసు. ఆ తెలిసింది ఏ కంఠస్వరంలో నుంచైనా తెలుసు. శేషశాస్త్రి ఏదో గ్రామానికి పోయి అడపం చేతబట్టుకుని వస్తున్న సాంబయ్యని పిలిచి తాను కన్నదాసు పాట విన్నానని, అతనిలో గొప్ప ప్రతిభ ఉన్నదని, అందువల్ల తనని ఎవరైనా గురువు వద్దకి పంపి సంగీతం నేర్పించమని చెబుతాడు. ఆ చెప్పడంలో కొన్ని మాటలు చూడండి. “మా ఇళ్ళల్లో అలాంటి పిల్లోడు పుట్టింటే దాని కతే అలాదు. నా మాటిని వాణ్ని మనూర్లో పెట్టద్దు. మీ వోళ్ళ మధ్యలో వుంటే చెడిపోతాడు. వాణ్ని మంచి విద్వాంసుని దగ్గర వొదిలిపెట్టు... వానికి నీ మాదిరి నాదస్వరం గీదస్వరం నేర్పించవద్దు. నేర్పిస్తే వాడూ నీ మాదిరి చావు మేళాలు, సమర్త మేళాలు వాయించి బతకాల్సిందే. పిల్లోడు ఎర్రగా బొద్దుగా ఉన్నాడు. చెక్కిన బొమ్మలా ఉన్నాడు. అచ్చం బాపనోళ్ళ పిల్లోడులా ఉండాడు. వానికి గాత్రం నేర్పించు. నేను సచ్చి ఏలోకానున్నా మా వూరి సాములోరు మేలు చేశాదని తలచుకుంటావు” అంటాడు. ఈ మాటల్లో కులవ్యవస్థ స్వరూపం బయటపడుతున్నది. ఈ నేలలో ప్రతిభావంతుడు రాణించాలంటే బ్రాహ్మణ కులంలోనే పుట్టాలి. ఇతర కులాల్లో పుట్టితే వాణ్ని పైకి ఎదగనీయరు. బ్రాహ్మణేతరుల్లో పుట్టడమే శాపం. బ్రాహ్మణవాదంలో శ్రామిక కులాల్లో పుట్టడం, ఒళ్ళొంచి శ్రమించడం, పదిమందికీ కడిపెట్టే ఉత్పత్తి కార్యకలాపాల్లో పాలుపంచుకోవడం చెడిపోవడమే(?). ఏ పనీపాటా చెయ్యకుండా పదిమంది నెత్తిమీదా చెయ్యిపెట్టి ఉద్దరకూడు తింటూ పరాన్నభుక్కులుగా మిగిలిపోవడమే చెడిపోకుండా బాగుపడిపోవడం. మన పూర్వ బ్రాహ్మణ కవులు రాసిన కావ్యాల్లో “కడుపులో చల్ల కదలకుండా బతకడం” అనే మాట విరివిగా

బ్రాహ్మణులు ఒక్క దళితుల్నే కాకుండా అంటంటూ, ముట్టంటూ, అసింకమంటూ బహుజనుల్ని కూడా దూరంపెట్టడం ఇప్పటికీ కొనసాగుతున్నది.

కనబడుతుంది. బ్రాహ్మణవాదమే అలాంటిది. తెలివిగలవాడు ఎవడు కంటబడినా వాడినీ శ్రమకి దూరంచేసి చెడగొట్టాలని చూస్తుంది బ్రాహ్మణవాదం. అందుకే కన్నదాసుకు నాదస్వరం గీదస్వరం వద్దన్నాడు శేషశాస్త్రి. చావు మేళాలు, సమర్త మేళాలు వాయించడం నామోషీ ఐతే అలాంటి సంప్రదాయాలను సృష్టించింది ఎవరు? ఎందుకు? ద్రావిడార్య జాతులు ఒకచోట చేరినప్పుడు వాటి కలయిక (ఆ కలయికల్లో ఆర్యజాతి పురుషులు ద్రవిడజాతి స్త్రీలని బలవంతంగా లోబరుచుకున్నవే అధికభాగం అని వేరే చెప్పనక్కర్లేదు. అలా పుట్టిన సంతానాన్ని తమలో చేర్చుకోకుండా చప్పన్నారు కులాలను సృష్టించారు) వల్ల పుట్టిన మనుష్యుల్ని మనుషులుగా వదిలెయ్యకుండా వర్ణాలుగా, కులాలుగా విభజించిందెవరు? కొన్ని కులాలకు సాధికారతని, కొన్ని కులాలకు నీచమైన సేవల్ని అంటగట్టిందెవరు? అందంగా పుట్టితే బ్రాహ్మణుల్లోనే పుట్టాలా? ఇతర కులాల్లో అందంగా పుట్టకూడదా? అందానికీ బ్రాహ్మణత్వానికీ ఉన్న ఆ అవినాభావ సంబంధం ఏమిటి? అసలు అందమంటే ఏది? ఇలా ఈ సందర్భం సవాలక్ష ప్రశ్నలను లేవనెత్తుతోంది వీటన్నిటికీ బ్రాహ్మణవాదం వద్ద సమాధానాలు లేవు. శేషశాస్త్రి సాంబయ్యకి ఉచిత సలహా ఒకటి పడేయడంలో కన్నదాసు ప్రతిభ మీద అక్కరకంటే కూడా అతడు బాగుపడితే చచ్చినా తనని తలచుకుంటారనే యావ ఎక్కువగా ఉంది. శేషశాస్త్రి పిలిచినప్పుడు సాంబయ్య అతనికి నాలుగడుగుల దూరంలోనే నిలబడ్డాడు. బ్రాహ్మణులు ఒక్క దళితుల్నే కాకుండా అంటంటూ, ముట్టంటూ, అసింకమంటూ బహుజనుల్ని కూడా దూరం పెట్టడం ఇప్పటికీ కొనసాగుతున్నది. శేషశాస్త్రి "ఈ మధ్య ఊర్లో ఉండావా? లేవారా?" అని సాంబయ్యని ప్రశ్నించడంలో అతని కులదర్పం స్పష్టంగా తెలుస్తుంది. "ఏదో కడుపాత్రం స్వామి. కర్నాటక దిక్కు పోయింటి" అని సాంబయ్య బదులియ్యడంలో కులవ్యవస్థకీ పేదరికానికీ ఉన్న అవినాభావ సంబంధం కూడా కనబడుతుంది. ఇలా ఉంటుంది కులవ్యవస్థ స్వభావం. దాన్ని ఈ కథలోని కథనం బట్టబయలు చేసింది.

దేశంలో కులవ్యవస్థ ఎంతగా జనాల రక్తంలో ఇంకిపోయిందంటే...దాని వల్ల తమకు జరుగుతున్న అవమానాలు గానీ, అన్యాయాలు గానీ, కష్టనష్టాలు గానీ తక్కువ కులస్థులు గుర్తించను కూడా గుర్తించలేరు. ఇక ఉన్నత కులస్థులు ఇతర కులస్థుల అభిజాత్యాన్ని, అభిమానాన్ని తాము కించపరుస్తున్నామన్న ఎరుకలోకి రావడం, దిద్దుబాటు గురించి స్పృహలోకి రావడం సరేసరి. అందుకే శేషశాస్త్రి తనతో మాట్లాడినప్పుడు అతడు తన బిడ్డ కన్నదాసుని పొగిడినాడన్న ఒక్క కోణాన్నే పట్టుకుని ఉబ్బితబ్బిబ్బైపోతాడు సాంబయ్య. ఆ మాటల్లో దాగున్న కులదర్పం, తమ కులాన్ని, వృత్తినీ తక్కువచేసి మాట్లాడ్డం అతని బుద్ధికి స్ఫురించనే లేదు. పైగా శేషశాస్త్రి నాలుగేళ్ళుగా అదో ఇస్తా... ఇదో ఇస్తా...నని కూతురి పెళ్ళికి మేళం వాయించిన డబ్బులు ఇవ్వకపోయిన సంగతి మరిచేపోయాడు సాంబయ్య. ఇలా మార్క్సిస్టు విమర్శకులు మాత్రమే గుర్తించగలిగిన కథనం చెయ్యడం అసలైన సాహితీవేత్త లక్షణం. అలా చెయ్యడం వల్ల అతడు వట్టి సాహితీకారుని స్థాయి నుండి కళాకారుని స్థాయికి చేరుకుంటాడు. సాంబయ్యకు కొడుకుపై ఉన్న ప్రేమని వర్ణించడంలో, అతని ఎదుగుదలని చూసి తండ్రి మురిసిపోవడంలో, పాఠకుని కళ్ళు చెమ్మగిల్లేలా చెయ్యడంలో రచయిత నేర్పరితనం తన స్థాయికి తగ్గట్టుగా ఉంది.

మహా విద్వాంసుడు కథలో కాలాన్ని ముందు వెనుకలకు పరుగులెత్తించడంలో, కథనంలో, కథనశిల్పంలో తుమ్మలవారి స్థాయి గడుసుదనం స్పష్టంగా కనబడుతుంది. కన్నదాసు దేశం నలుమూలలా పోయి కచేరీలు చేశాడు. అతని కళా విలాసాన్ని కళ్ళారా చూసి, చెవులారా విని పరవశించినవాళ్ళు అతన్ని పొగిడినవాళ్ళే అతని గురించి ఆరా తీయడం ప్రారంభించారు. అపచారం జరిగిపోయినట్లు బాధపడ్డారు. ఆ మాత్రం వంటావార్పు చేసుకునేవాళ్ళు కూడా పాడగలరని తీసిపారేశారు. కన్నదాసు సంగీత ఆరాధనోత్సవాల్లో (వివాదాలకు భయపడి కాబోలు అవి

అతని కళా విలాసాన్ని కళ్ళారా చూసి, చెవులారా విని పరవశించినవాళ్ళు అతన్ని పొగిడినవాళ్ళే అతని గురించి ఆరా తీయడం ప్రారంభించారు. అపచారం జరిగిపోయినట్లు బాధపడ్డారు.

ఏ ఆరాధనోత్సవాలో రచయిత చెప్పలేదు) పాడాలని నిష్ఠగా సిద్ధమయ్యాడు. అతను అక్కడ చేసిన కచేరీని వర్ణించడంలో రచయిత సంగీత జ్ఞానం తెలిసొస్తుంది. కచేరీ సంగీత ప్రియుల్ని ఆనందసాగరంలో ఓలలాడించింది. విన్నవాళ్ళు "ఇంత అద్భుతమైన గాత్రం ఎక్కడా వినలేదు. ఆ రాగాలాపన నభూతో నభవిష్యతి" అన్నారు. అంతలో ఎక్కడి నుండి వచ్చాడో సుడిగాలిలా వచ్చి పరబ్రహ్మశాస్త్రి మైకు అందుకున్నాడు. "కన్నదాసు బాణి గాత్ర సంగీత బాణి కాదు, అతని తాతముత్తాతలెవరో నాదస్వర విద్వాంసులై ఉండాలి. ఆ జన్మ సంస్కారం కన్నదాసుకు అబ్బి ఉండాలి. మేము భైరవి పాడితే ఒక్క గోలిగుండు తార్రోడ్డు మీద దొర్లించినట్లుంటాది. కన్నదాసు ఈ రోజు పాడిన భైరవి ఒక లారీ గోలిగుండ్లు సిమెంటు రోడ్డు మీద దొర్లించినట్లున్నాయి" అని తనని అతడు పొగిడినాడో తెగిడినాడో ఎవరికీ అర్థం కాకుండా అన్యాపదేశంగా అతని కులాన్ని, సంగీత ప్రతిభని ఎగతాళిచేసి ముగించాడు. కన్నదాసు గుండె బద్దలైపోయింది. ఎందరు ఎన్ని రకాలుగా ప్రాధేయపడినా వినిపించుకోకుండా అక్కడి నుండి వచ్చేశాడు. ఈ దేశంలో సంగీతానికి కూడా కులం, మతం ఉన్నాయని తెలిసి తల్లడిల్లిపోయాడు. పలురకాలుగా పలవరించిపోయాడు. బతికుంటే పాట పాడకుండా ఉండలేడు. పాడితే అది ఎంగిలిపాట మంగలిపాట అంటారు. అందుకే అతడు ఇకపై పాడకూడదని దృఢంగా నిశ్చయించుకున్నాడు. అందరూ శేషశాస్త్రి చనిపోయిన హడావిడిలో ఉంటే తాను మాత్రం కులం కంపులో కుళ్ళి కంపుకొడుతున్న శవాలను నిద్రలేపే ఆలోచనలో పడ్డాడంట. అది కన్నదాసు ఆలోచన. రచయిత ఆకాంక్ష. అది కార్యరూపం దాల్చాలని కోరుకుందాం.



"A good father is one of the most unsung, unpraised, unnoticed, and yet one of the most valuable assets in our society"

**- Billy Graham**

# భూమాతలు



శ్రీ సిరికి స్వామి నాయుడు
94940 10330

వాళ్ల త్యాగాల ముందు మనమెంత?
వాళ్ల సహనంముందు మనమెంత?

వాళ్ళు.. భూమాతలు
కాసింత బరువును మోసేందుకే
మనం ఆపసోపాలు పడతాంగానీ..
అంతటి యింటిని - వాళ్లు భుజాలమీద ఇట్టే
మోస్తారు
చీకట్లను మింగి వేకువల్ని ప్రసవిస్తారు
ఆశల్నీ కోర్కెల్నీ తమలోనే సంలీనం జేసుకొని
నిర్మల నదీప్రవాహాల్లై సాగిపోతారు!

వాళ్లు.. దుర్గమ అరణ్యాలు
ఛేదించాలనుకుంటే.. మొలకై ప్రణమిల్లాల్సిందే
వాళ్లు.. దయా కల్పవృక్షాలు
కరుణపొందాలనుకుంటే.. దోసిలి పట్టాల్సిందే

వాళ్లు .. జీవనదులు
అమేయ జలగీతాల్ని వినాలనుకుంటే ..
అంతరాంతరగాధాల్లోకి దూకాల్సిందే ..
వాళ్ళు .. అమూల్యగ్రంధాలు
అర్ధంకావాలనుకుంటే ..
మనసుపుటల్ని మననం చేయాల్సిందే!

వాళ్లు ..
అగ్నిపర్వతాలు .. అంతు తెలియని అగాధాలు
కరుణరసార్ద్ర హిమశిఖరాలు
సతత హరితారణ్యాలు వెన్నెల ఆకాశాలు ..
వేకువ పూదోటలు .. నడచే గాయాలు .. నెత్తుటిగేయాలు !
వాళ్లు ..అడవిని యిల్లుజేసి హరివిల్లును ముగ్గేస్తారు
పొద్దల్లా - యిళ్ల మీదా .. పొలాలమీదా ..
చెమటపిట్టలై ఎగురుతారు
తమ పొత్తిళ్ల లో ప్రపంచాన్ని పసిపాపను జేసీ
జో కొడతారు !!

# మా నాన్న నాకేమిచ్చారు?

కీ. శే. అవసరాల రామకృష్ణారావు

ఫిఫ్తు ఫారం మొదలు బియ్యస్సీ దాకా ఒకేచోట కలిసి చదువుకొని బ్రతుకు తెరువు కోసం ఎవరి మటుకు వాళ్లు విడిపోయినా రవణమూర్తి, రామ్మూర్తుల మనస్సులు మాత్రం ఎప్పుడూ కలుసుకుని కబుర్లు చెప్పుకుంటూనే ఉంటాయి. అందుకనే ఒక మూర్తి ఈ లోకం నుంచి తప్పుకున్నా రెండవ మూర్తి లోకంలో మాత్రం ఆ మూర్తి స్ఫూర్తి ఎప్పటికీ కళకళలాడుతూనే ఉంటుంది. అలాంటి ఒక సందర్భంలో రవణమూర్తి ఓసారి స్నేహితుడి కొడుకుని చూడ్డానికి వచ్చాడు.



"ఇదిగో అలా నువ్వు కంట తడి పెడితే నేను రాకనే పోదును. మామూలు రకం పరామర్శల కయితే రోజులు దాటకుండానే వచ్చి ఉందును. మూడు నెలలు దాటేక రావడమెందుకూ?"

రవణమూర్తి గోపాలం చెయ్యి మొహం నించి బలవంతంగా అడ్డు తీసేశాడు. గోపాలం రెండు కళ్లల్లోంచీ కన్నీళ్లు కాలవలు గట్టేయి. "ఓహో అంటే ఓహో అనుకునే స్నేహితులు వందలకొద్దీ ఉన్నా మనస్సు విప్పి చెప్పుకునేవారు ఏ ఒకరో యిద్దరో ఉంటారు. నెల్లాళ్లకి ఒక మారయినా మా గురించి వింటేనేగాని నాన్న గారికి తోచేది గాదు బాబాయి గారూ! మిమ్మల్ని చూస్తూంటే నాన్నగారు జ్ఞాపకం వచ్చి నా మనసు మరీ కెలికేసినట్లు అవుతోంది"

"అబ్బే, అదేవిఁటి బాబూ బొత్తిగా చిన్న పిల్లాడిలా?"

గోపాలం పుస్తకాన్ని ఆ పేజీ దగ్గర విరచి అలాగే టేబిలు మీద పెట్టేడు. ఆ మధ్య మొహం పెట్టి కళ్ళు మూసుకున్నాడు.

"లేదు నేను చిన్న పిల్లాడిని అనుకునే వారింకెవరూ లేరు. చీరలూ నగలూ యిచ్చే మొగుణ్ణి మా ఆవిడకి నేనున్నాను బిచకత్తులూ, పిప్పరమెంతు బిల్లలూ తెచ్చే నాన్నని మా పిల్లలికి నేనున్నాను. నాకెవరున్నారు? మనమల్ని ఎత్తగల వయస్సున్న కొడుకయినా సరిగ్గా తింటాడో లేదో అని భోజనం దగ్గర విసనకర్రతో ప్రత్యక్షమయే తల్లి నాకు ఏనాడో కరువయింది. కొండంత నీడ, ఆకాశమంత అండ మా నాన్న కూడా నాకు లేకుండా పోయాడు... ఇంక నాకెవరున్నారు?" గోపాలం వెక్కి వెక్కి ఏడ్వ నారంభించాడు. విడదీసిన కొద్దీ దెబ్బలాట ఎక్కువైనట్టు, తవ్విన కొద్దీ గొయ్యి పెద్దదైనట్టు, అనునయించిన కొద్దీ విచారం ఎక్కువౌతుంది. అందుకనే అనుభవం గల రవణమూర్తి గదిలోకి వెళ్లి పుస్తకాలన్నీ వెతికి 'హేమ్లెట్' పట్టుకొచ్చాడు. పుస్తకం అటూయిటూ తిప్పి ఒక పేజీ దగ్గర ఆగేడు. "ఇది నువ్వు చదివావుగా బాబూ ! తండ్రిని కోల్పోయి సర్వస్వాన్నే కోల్పోయినట్టు బాధపడే 'హేమ్లెట్'కి చెప్పినట్టు చెబుతూ షేక్స్పియరు మానవాళికి అందించిన మహత్తర వాక్యాలు చూడు."

గోపాలం ఆశ్చర్యంగా ఆ వాక్యాలు చదివేడు. సద్గ్రంథాలకీ జీవితాలకీ అంత సామీప్యం ఉంటుందని అతనెప్పుడూ అనుకోలేదు.

ఆ వాక్యాల సారాంశం యిది : 'ఇందులో కొత్తదనం గాని విచారించ వలసింది గాని ఏముందీ? నీ తండ్రి తన తండ్రినీ, ఆయన వాళ్ల తండ్రినీ... అలా.... ఎందరో వాళ్ల తండ్రుల్ని కోల్పోయారు...నువ్వీనాడు నీ తండ్రిని కోల్పోవడం అతి సహజం. ఇందులో వింతేమున్నది? చింతేమున్నది? ప్రకృతి సూత్రం అంతే నన్నది!'

గోపాలం పుస్తకాన్ని ఆ పేజీ దగ్గర విరచి అలాగే టేబిలు మీద పెట్టేడు. ఆ మధ్య మొహం పెట్టి కళ్ళు మూసుకున్నాడు.

గోపాలం యింకా యింటికి రాలేదు. రవణమూర్తి ఒక్కడూ గదిలో అటూ

యిటూ పచారు చేస్తున్నాడు. అతను యింట్లో చూసిన రామ్మూర్తి తాలూకు వస్తువులు – పొడుంకాయ, టైరుజోడు, రోల్డ్ గోల్డ్ ఫ్రేం కళ్లజోడూ, చిన్న వివేకానందుడి ఫొటో – యిలాంటివాటికన్న .... అతని జ్ఞాపకాలూ.ముఖ్యంగా నిర్లిప్తతా, సంతృప్తి, హాస్యం, మేళవించిన అతని చమత్కార సంభాషణలూ రవణమూర్తిని కదిలించాయి.

**బాగుంది.... కోడలు యింటికి వచ్చేక సుఖంగా బతికిన అత్తగారు ఎవరు గనక?**

“వెధవ పిల్లి, పాలన్నీ ఎలా పారబోసిందో”

“బాగుంది, గిన్నెలోనే ఉండి వేడిగా ఉంటే అలా తాగగలదు మరీ ? అన్ని పాలూ మనమే ఊనబడితే దాని కడుపు నిండేది ఎలా? అయినా నేడో రేపో యీనేట్టుంది కూడాను.”

“అదేవిఁటీ, దేవుడికి లేకుండా ఆ పువ్వులన్నీ ఊరూ వాడా పంచి పెట్టేస్తున్నారా. ఏం మనుషులమ్మా?”

“బాగుంది, మూడొంతుల మంది దేవుళ్లు పువ్వుల్లో పుట్టినవాళ్లే..... వాళ్లకి మళ్లీ అవే యిస్తే బాగుంటుందా మరీ?”

“రామం, మొన్న బస్సులో వస్తూంటే నీ పర్సు పోయిందట పాపం?”

“బాగుంది, అందులో ఉన్నదెంత గనక ? పాపం ఓ పూట ఓ కుటుంబాని

కయినా కడుపు నిండేనో లేదో... అయినా నాలాంటి అజాగర్త పరుల్నందర్నీ ముందు జైల్లో పెడితే దేశంలో దొంగతనాలు తగ్గునేమో!”

“ఏవండీ చూశారా, నల్లెలా అంట బొడిచేసిందో... ఎంత దద్దు రెక్కిపోయిందో!”

“బాగుంది జడ్జీగారి కూతుర్ని నల్లి పిల్ల కుట్టడమే ? అంత బొత్తిగా భయం భక్తీ లేకుండా పోయిందా? దొంగ రాస్కెల్, ఈమారు కనబడనీ కనుక్కుందాం!”

"పాపం, కోడలు యింటికి వచ్చేవరకైనా మీ ఆవిడ బతకలేకపోయింది...."

"బాగుంది.... కోడలు యింటికి వచ్చేక సుఖంగా బతికిన అత్తగారు ఎవరు గనక ? ఒకవేళ యీావిడ సుఖంగా బతికితే ఆ కోడలు జీవించేది ఎన్నాళ్లు గనక ?"

"ఇంటింటా తిరుగుతూ యిలా కబుర్లు చెబుతూ ఎన్నాళ్లని తిరగ్గలవు తాతయ్యా ?"

**'ఈ గుంటని తీసుకెడితే యింక నువ్వు పళ్ళు అమ్ముకున్నట్టే..... నీ కేకకన్న దాని ఏడుపే బాగా వినిపిస్తోందేఁవేఁ?'**

"బాగుంది.... పిలుపు వచ్చే వరకూ ఆగ కేం చేస్తాం? ఇంకా మా అమ్మకి దయ కలిగినట్టు లేదు మరి !"

బాగుంది... జీవితం యింత బాగున్నవాళ్ళకి మరణం కూడా మరింత బాగుండ కేం చేస్తుంది ? కలిగి ఉన్నా కళ్లు కలగని మనిషికి – మంచం మీద ఉన్నా మంచి ముత్యంలా గడిపిన మనిషికి – పంకంలో ఉన్నా పద్మంలా వికసించిన మనిషికి – ఆఖరి కూడా అందంగా ఉండ కేం జేస్తుంది? సూర్యాస్తమయం కూడా సుందరంగా ఉండడంలో వింత ఏముంది? అన్నీ సద్దుకుని సరిదిద్దుకుని రైలు ప్రయాణానికి వెళ్ళినంత ఉత్సాహంగా వెళ్ళిపోయాడు రామ్మూర్తి.

రమణమూర్తి పై గొంతుతో కళ్ల నీళ్లు తుడుచుకున్నాడు. క్రిందటేడు తను రామ్మూర్తిని చూడ్డానికి యీ ప్రాంతాలకి వచ్చినపుడు ఒక మారు ఏం జరిగిందనీ....

తియ్యని మాటలే కాక తియ్యని మాత్రలు కూడా యివ్వడం వాడికి అలవాటు. ఇంట్లో వాళ్ళకీ, తెలిసిన వీధిలో వాళ్ళకీ, ఎరిగిన ఊళ్ళో వాళ్లకీ సాయం చెయ్యడంలో పెద్ద ఆశ్చర్య మేమీఁ లేదు. ఆరోజు తనూ రామూర్తీ ఇలా గుమ్మం దిగి వీధిలో అడుగు పెట్టేరో లేదో ...."ఏం బాబు బత్తాయి పళ్లు మంచి వున్నాయి – ఏవైఁనా పడతాయా యేటి" అంటూ పళ్ళమ్మి ఎదురొచ్చింది. దాని నెత్తిన ఉన్న పళ్ల గంపకన్నా అది చంకనెత్తిన గయ్యాళి గంపే రామ్మూర్తిని

ఎక్కువగా ఆకర్షించింది.

"ఈ గుంటని తీసుకెడితే యింక నువ్వు పళ్ళు అమ్ముకున్న ట్టే..... నీ కేకకన్న దాని ఏడుపే బాగా వినిపిస్తోందేఁవేఁ?"

ఎందుకేటి బాబూ, నాల్రోలమట్టి బొట్టి మూసిన కన్నెరగదు. ముండ నన్నొగ్గదు, నోరు కట్టదూ.... నా నేటి సెయ్యను సొప్పండి?"

ఈ పావలా డబ్బులూ పటిగెల్లి రేపూ ఎల్లుండీ కాలక్షేపం చెయ్యి... రెండ్రోజులపాటు ఇంటి పట్టున ఉంటేనే గాని మళ్ళీ నీ బుల్లి నీది కాదు. తెలిసిందా?

"చెబుతా.... ముందా గేటు తలుపు వేసి లోపలికిరా ...."

రవణమూర్తి అడ్డు బడ్డాడు.

"ఒరే మనం రైలుకి వెళ్లామను కున్నాంగా.... మధ్యని ఈ పేటా పన ఏవిఁటీ?"

రామ్మూర్తి మాట వినిపించు కుంటేగా.... లోపలికి వెళ్ళి పొట్లాలు కట్టి తీసుకొచ్చాడు.

"చూడూ ఈ మాత్రలు దీన్నేత మింగించు. ఈ ఎఱ్ఱ పొట్లం చీకటి పడ్డాకా, ఓ రాత్రి వేళ ఈ తెల్ల పొట్లమూ.... ఈ విధంగా మింగించు"

"గొప్పోళ్ళు ...గొప్పమనసు గలోళ్లు, కొత్త కొత్త కోడళ్ళు కలిగి, గొప్ప గొప్ప లోగిళ్లు కలిగి..."

"ఆఁ అలా గలాగేలే. ఈ రెండ్రోజులూ తిరుగుళ్లు ఆపు... ఏణ్ణర్ధం దాటని వెర్రిముండని ఎండలో తెగతిప్పి బరికిందని బజాయించుకు. ఈ బియ్యమూ, ఈ పావలా డబ్బులూ పటిగెల్లి రేపూ ఎల్లుండీ కాలక్షేపం చెయ్యి... రెండ్రోజులపాటు ఇంటి పట్టున ఉంటేనే గాని మళ్ళీ నీ బుల్లి నీది కాదు. తెలిసిందా?"

"మా అమ్మే, నా బాబే... ఎంత సల్లని యేల ఎంత సల్లని తల్లి నిన్నీ బూ మాలచ్చి కిచ్చిందో.... బాబ్బాబు సెమించాల...ఎంచుబడి కాయలన్నీ

అమ్మేసుకున్నాను .... దిక్కుమాలిన ముండని నా కాడేం లేదు. ఈ కాయలుంచు బాబో ....''

''అలాగే పిల్లదానికి తొనలు తీసి తినిపించు... నేనే తీసుకుందును గాని యింట్లో చెట్టే ఉందిలే... అడ్డులే... అవతల నాకు పనుంది.... పదరా రవణీ....దీ నొక్కర్తితో కూచుంటే అయిపోతుందా యేవిఁటి ?''

పువ్వులతో మేలుకొని పిల్లలతో ఆడుకుని పక్షులతో పడుకునే ఆయనకి జీవితంలో అందనిదంటూ ఏముంటుంది?

అవును... విశ్వమానవ సౌహార్ద్రమూ, విశాల దృక్పథమూ ఉన్న వాళ్ళకి ఒక్కరితో కూచుంటే అయిపోతుందా? ఒక్క 'పని' తో సరిపోతుందా? అందుకే ఆ వయస్సు అయీ అవగానే పదవీ విరమణ చేస్తే అందరికీ ఆశ్చర్యం కలిగించింది.

''అదేవిఁటీ, మీరు విశ్రమిస్తామంటే మేం ఒప్పుకుంటామా ఏవిఁటి? మీలాంటి 'సిన్సియర్ వర్కరూ', 'కేపబుల్ హేండూ' మళ్ళీ మాకు దొరకద్దూ? ఏదో రూలు కోసం రిటైరు అవడాని కింత వయసని ఏర్పరిచారు గాని రెండుసార్లు రిటైరు అవడానికి సరిపోయిన వయసుతో ఎంతమంది ఉద్యోగాలు చెయ్యడం లేదు? అసలు ఓ చెంప నెరవడమే ఈ దేశంలో నాయకత్వానికి కావలసిన క్వాలిఫికేషను గదా'' అని చెప్పి చూశాడు పై యజమాని.

''అందుకని అందుకని చచ్చేదాకా డబ్బు సంపాదించడమే పరమావధిగా పెట్టుకోమంటారా? భవిష్యత్తు మీద గంపెడాశతో ఉద్యోగం కోసం భర్తని పంపించి వీధిలో అతని కోసం ఎదురుచూసే పచ్చని పడుచు కడుపులో చిచ్చు పెట్టమంటారా?

వద్దు బాబూ వద్దు. డబ్బు యిచ్చే సుఖం కన్న అది అరాయించుకోడంలో కలిగే అజీర్తే ఎక్కువ''

ఆఫీసర్లనీ, ఆడిటర్లనీ మేపడాలు, పన్నుల ఎగవేతలూ, ఎకౌంటు సర్దుబాట్లూ వీటితో కొట్టుకుపోతూ కంటి మీద కునుకు ఎరగని పాపిష్టి

పనులతో రామ్మూర్తి లాంటి వారికెలా ఉంటుంది యింకా యింకా ముడి? పువ్వులతో మేలుకొని పిల్లలతో ఆడుకుని పక్షులతో పడుకునే ఆయనకి జీవితంలో అందనిదంటూ ఏముంటుంది? పొద్దుటే ఆయన లేవడం చూసుకుని సూర్యుడు ఉదయించే వాడేమో. ఆయన పనిమనిషికీ, పాలవాడికీ జీతాలు యిచ్చే రోజున అది ఒకటో తారీకని అందరూ గుర్తు పెట్టుకొనేవారేమో... ఆయన ఏదైనా జవాబు రాస్తూంటే అంతకు ముందు అరగంటై ఆయనకి ఆ ఎడ్రసు నుంచి ఉత్తరం వచ్చి ఉండాలని తెలుసుకునే వారేమో ...

'ఏదో పనున్నట్టు మా గోడెక్కి ఊఁ అరవకపోతే, ఒసే కాకీ, నీ పాండిత్యం ఎదురింటి రవణమ్మగారి దగ్గిర వెలగ బెట్టకూడదు టే'

మొగాళ్ళయితే జబ్బలనూ ఆడాళ్ళయితే చీరలనూ ప్రతిక్షణం చూసుకుని మురిసిపోతూ ఉంటారు. అసలు అద్దాల ముందు అతుక్కుపోడానికే ఎక్కడలేని టైమూ చాలదు... ఇంకా ఏమైనా టైం మిగులితే తనకున్న అన్ని విధాల తక్కువ వాళ్ళని చూసి తమ గొప్పలను చెప్పుకుంటూ ఉంటారు, 'ఏ వంటావు, నేను చెప్పింది సరైన దవునా కాదా ?' అని అడుగుతూ ఉంటారు. 'మీరు సెల వియ్యడం మరోలా జరగడమూనా ?' అనిపించుకుంటూ ఉంటారు. వారానికి మూడుసార్లు తలంటుకొనే అత్తగారి కయినా, 'అయ్యో అంత శ్రద్ధ లేకపోతే ఎలాగమ్మా మీకూ? నెలయిందిగదా తలంటుకుని... పదండి యీపాటికి యింత నూని చుక్క పెడతాను' అనే కోడలు కావాలి. రెండు వారాలకుగాని ఒక జత బట్ట మార్చని ఆఫీసరుకయినా 'అదేవిఁటో, మీ దగ్గరకి వస్తే యిదీ అని వర్ణించడానికి వీల్లేని పరిమళమూ, నిర్మలత్వమూ వెల్లివిరుస్తాయి సుమండీ చెప్పకేం' అనే అసిస్టెంటు కావాలి. ఊళ్ళో అమ్మిన గైడ్సు, ఎవరో చెప్పిన నోట్సూ దగ్గిర పెట్టుకోందే పాఠం చెప్పలేని టీచరు కయినా 'అరటిపండు ఒలిచి చేతులో పెట్టడం అనడం వినడమేగాని అనుభవించలేదు. ఇదే కాబోలు' అనే శిష్యుడు కావాలి.

ఎంత సేపు తన వర్ణనా, తన ఓర్పూ, ఇంతకు మించి ఆలోచించడానికి టై మేది ? ఇంకా ఏమైనా మిగిల్తే సంసార తాపత్రయంలో మునిగి తేలడానికి

> ఇంత డబ్బు నిలవ చేద్దామన్న ఆలోచన మీద ఆయనకి ధ్యాస ఉన్నట్టు నా కెప్పుడూ తోచలేదు.

ఒక్కొక్కరికి రెండేసి జన్మలు చాలవు. అవతల వాళ్ళ గురించి తన ఆలోచన ఎప్పుడూ ఉండదు. ఒకవేళ ఉంటే ఆ పద్ధతే వేరు.

'ఏదో పనున్నట్టు మా గోడెక్కి ఊఁ అరవకపోతే, ఒసే కాకీ, నీ పాండిత్యం ఎదురింటి రవణమ్మగారి దగ్గిర వెలగ బెట్టకూడదు టే' అనుకోని వాళ్లూ, పక్కింటి మోహన రావుగారి యింట్లోనే ఒక కట్టకి కట్ట ఉత్తరాలు దిగెయ్యకపోతే – నీ కొచ్చిన యేళ్లకి, పక్షపాతపు బుద్ధి కాకపోతే, మా యింట్లో కూడా ఓ శుభ రేఖ విసిరితే – నీ నిక్షేపం తరిగి పోతుందా ఏమిటయ్యా పోస్టుమేరూ ? ' అనుకోనివాళ్లూ అరుదు. అందుకే ఆశ్రయింపులకే జీవితం అంకితం చేసి దేశంలో చరిత్రలో పెద్ద పెద్ద స్థానాలు కల్పించుకునే వాళ్ల రొదలో – సరళ జీవనులైన సామాన్యుల కథ వినిపించడమూ వికసించడమూ కూడా అరుదే.

'ఏవిఁటి యీ ఆలోచనలు తాడూ బొంగరం లేకుండా ?' అనుకున్నాడు రవణమూర్తి. వెనక్కి తిరిగిచూశాడు. ఎంత సేపయిందో గాని గోపాలం వచ్చి కూచున్నాడు.

"ఏవయినా అదృష్టవంతుడవయ్యా గోపాలం నువ్వు.... మీ నాన్న దేవుడు గాని మనిషి కాదు బాబూ... మీ నాన్న చివరికాల మంతా.... అందరి కంటే ఎక్కువగా నీ దగ్గిరే గడిపేడు.... ఇంతటి సత్సాంప్రదాయం ఊరికే పోదు బాబూ"

"నేనూ అలాగే అనుకున్నాను.... కాని ఆలశ్యంగా పోల్చుకున్నాను.... నేను అన్ని విధాలా అన్యాయమైపోయాను"

రవణమూర్తి ఆశ్చర్యంగా గోపాలం వైపు చూశాడు.

"అవును.... మీ ముందు నాకు దాపరికం లేదు. మనసు విప్పి చెప్పుకోడానికి కూడా మీకంటే నా కింకెవరూ లేరు. ఉన్న ఊరినీ, కన్నవారినీ ఒదిలిపెట్టలేక స్కూలు ఫైనలు ప్యాసవగానే ట్రెయినింగు అయిపోయి ఈ

ఊళ్లోనే హైస్కూల్లో టీచరుగా స్థిరపడిపోయానని మీకు తెలుసు. నా సర్వీసంత వయస్సులేని మా పెద్ద కుర్రాడు ఎల్.సి.యీ. ప్యాసై నూటయాభై తెస్తున్నాడు గాని నా జీతం నూరు దాటలేదు. అడిగిన వాడికి లేదనని మా నాన్న వచ్చే జీతంలో పెద్ద ఆస్తి మిగులుస్తాడని నా కెప్పుడూ ఆశ లేదు. ఇంత డబ్బు నిలవ చేద్దామన్న ఆలోచన మీద ఆయనకి ధ్యాస ఉన్నట్టు నా కెప్పుడూ తోచలేదు. ఆయన స్నేహితుడొకడు చేయించిన యిరవై వేల లైఫ్ పోలసీ మీద మాత్రం అందరితో పాటు నా కళ్లూ ఉండేవి. అది ఆయన మొదట్లో ఎవరికీ 'ఎసైన్' చెయ్యలేదు. ఇంటిపట్టున ఉన్నవాణ్ణి గనక... ఉన్నవాళ్లలో పిల్లలు ఎక్కువా, సంపాదన తక్కువా అన్న దాంట్లో ఫస్టు మార్కు నాది గనక... కనీసం అందులో ఓ పదివేలయినా నాకు ముట్టచెబుతారని ఆశించాను... కాని... జరిగిం దేమిటో మీకు తెలుసుగా బాబాయ్ గారూ ?''

> నెలకి మూడొందలు పెన్షను తెచ్చి యిల్లు నింపే మామగారు ఎవర్తికి చేదే? అని జవాబు చెప్పింది మా పెద్దొదిన గారు.

''తెలుసు.... వాడు దాన్ని సంస్కృత పాఠశాలకు రాసిచ్చాడటగా''

''మీ కిది సబ్బుబుగానే తోచిందా?..''

''.... సరేలే... చెప్పు చెప్పు''

''ఇంకేం చెప్పేది? చెట్టంత నాన్నతోపాటు కొండంత ఆశ కూడా నేల కూలి పోయింది. మా నాన్న నాకేమిచ్చారో మీకు తెలుసునా? చెప్పు దెబ్బలు!''

''చెప్పు దెబ్బలా ?''

''అవును, నాలాంటి నిర్భాగ్యుడికి అంతకన్న లభించేవి ఏమున్నాయి ? అప్పు డందరూ యింటికి వచ్చినప్పుడు ఎంతో దగ్గరవాళ్లు కూడా ఎంతలేసి మాటలాడేరో మీరు ఊహించలేరు. ఆ రోజున ఎంచేతో నాకు జ్ఞాపకం లేదు, అదే పిల్లలూ యింట్లో లేరు.... అవాళ కొంచెం తల నొప్పిగా ఉంది. మామూలు టైం కన్న ముందుగానే నేను యింటి కొచ్చేశాను. నేను రావడం వాళ్లు చూసినట్టు లేదు. ఎవరో అంటున్నారు.

‘అలాంటి మహాత్ముడికి అన్నం పెట్టే అదృష్టం యింత మంది బలగంలో ఈ కోడలికే దక్కింది. ఇంతకీ ప్రాప్తం!’

‘ఆఁ, ముప్పై రూపాయలు పారేస్తే వంట మనిషి దొరక్కపోయిందా ఏవిఁటి గానీ.... అయినా నాకు తెలీక అడుగుతానూ, నెలకి మూడొందలు పెన్షను తెచ్చి యిల్లు నింపే మావఁగారు ఎవర్తికి చేదే?’ అని జవాబు చెప్పింది మా పెద్దొదిన గారు. ‘అయినా వెంటనే కాచుకుని పెద్ద డాక్టరు చేత వైద్యం చేయిస్తే నాన్న దక్కునమ్మా! ఆయన దగ్గర తినడమంటే అందరూ సిద్ధంగాని, పెట్టడమంటే అందరికీ కష్టమే కదుటమ్మా’ అని రాగాలు పెట్టింది మా చెల్లెలు. ‘ఎంత దానం చేసే మనిషయినా ఇంట గెలవక రచ్చ గెలిచేంత అవివేకి కాదు మా నాన్న.... దగ్గిరుండి ఏళ్ల తరబడి తిన్నది చాలక ఈ గోపాలం ఏం ప్రాణం విసిగించాడో, ఆయనకి ఒళ్లు మండి అలా రాసిపారేశారు. మొత్తమ్మీద ఎవరికీ ఏం లేకుండా చేసేగాని వాడి కళ్లు చల్లబడ్డాయి కాదు’ అన్నాడు మా చిన్న తమ్ముడు. మా దొడ్డమ్మ అందుకుంది, ‘అది కాదు గాని నామాట కాస్త వినండి. మీరందరూ ఆ మహాపట్నాల్లో వందలకి వందలు తెచ్చుకుని మహా సుఖపడుతున్నారనే అక్కసు కొద్దీ అదే యింత పని చేయించి ఉంటుంది. ఉన్నన్నాళ్లూ ఆ మహానుభావుడికి ఓ పూట పెట్టీ పెట్టకా ఆ జాణ పుట్టింటి కీ పాటికి ఎంత జేరేసుంటుందో! దానికి లెక్కా పద్దూ అంటూ ఉన్నాయా యేమిటి?’

“విన్నారా బాబాయి గారూ నాకు మిగిలిందేవిఁటో.... ఇందులో ఇంకోరు అసూయ పడ్డానికి కూడా ఉందా ? మానాన్న నా కేమిచ్చాడు?”

రమణమూర్తి చిరునవ్వుతో గోపాలం వైపు చూశాడు, ఆ కళ్లల్లో కాంతులు చూసి అతడు ఆశ్చర్యపోయాడు,

“ఇంతకన్న నీకు మీ నాన్న యింకే మివ్వాలి గోపాలం? ఎంతో పూర్వ పుణ్యం చేనుకున్న వాళ్ళకి గాని యిలాంటి ఆస్తి లభించదు. ఎవరో ఎందుకు, నీ సంపద చూసి నేనే అసూయ పడుతున్నాను!”

ఇంతకన్న నీకు మీ నాన్న యింకే మివ్వాలి గోపాలం? ఎంతో పూర్వ పుణ్యం చేనుకున్న వాళ్ళకి గాని యిలాంటి ఆస్తి లభించదు.

"అదేవిఁటి? నాతో మీరు హాస్యమాడుతున్నారా ?"

"లేదు ... నీముందున్న చీకటిని తొలగించడానికే ప్రయత్నం చేస్తున్నాను. గట్టునే చూస్తే గంగలో నీళ్ళైనా కలక బారినట్టే కనిపిస్తాయి. పై పైన కొలిచే నిర్ధారణ చెయ్యడం న్యాయమా గోపాలం? మావాళ్ళంతా డబ్బుతోటే మనుషుల మంచి చెడ్డలు కొలిచే మర మనుషులయిపోయారు. అదే జీవనం అనుకున్నవాళ్లు అదే లేకపోతే అసలు స్వరూపం బయటపడి – బయటపడ్డ చేపల్లా బాధ పడిపోతారు... అందుకనే వాళ్ళు అలా విమర్శించడం చాలా సహజంగా ఉంది. కాని డబ్బు సంపాదించినా దాని వల్ల చెడిపోయినవాడు కుటుంబం మొత్తంమ్మీద మీ నాన్న ఒక్కడే.... ఆయన నీడలో మీ అన్నదమ్ములందరి కన్న ఎక్కువకాలం నువ్వు గడిపేవు.. నీ నుంచి మాత్రం యిలాంటి మాటలు నేను 'ఎక్స్పెక్టు' చెయ్యలేదు."

**ఏ కాలేజీ కయినా అతి దగ్గరలో ఒక కాఫీ హోటలూ, మంగలిషాపూ తప్పవు. కావలిస్తే చూడు.**

"అదేవిఁటి...."

"అడ్డురాకు.... నన్నులా చెప్పుకుపోనీ.... నిన్నపొద్దుటకదూ నేను మీ యింటికి వచ్చాను ... వస్తూనే నేను చూసిందేమిటో తెలుసా ? నీ పిల్లలు అప్పటికే స్నానాలు కూడా చేసి చక్కగా తలలు దువ్వుకుని గడగడ చదువుకుంటున్నారు. మీ ఆవిడ కుంపటి దగ్గిర కూచుని ఎడం చేత్తో ముక్కలు వేయిస్తూ కుడి చేత్తో ఒళ్లో పెట్టుకున్న మడిచిన పేపర్ని అటూ యిటూ త్రిప్పుతూ చదువుకుంటోంది. నువ్వు గదిలో కూచుని కాంపోజిషను పుస్తకాలో ఏవో దిద్దుకుంటున్నావు. నేను వాచీ చూశాను. ఆరయింది! అవును.... ఇందులో ఆశ్చర్యపోడానికేముంది ఇది మన రామ్మూర్తి యిల్లు మరీ, ఇంకోలా ఎలా ఉంటుంది? అనుకున్నాను....

గోపాలం, సాధారణంగా కాలేజీలు పదింటికి తెరుస్తారని నీకు తెలుసుగా.... అందరూ కాదుగాని చాలామంది విద్యార్థుల దినచర్య చెబుతా విను... ఏ తొమ్మిదిన్నరకో లేస్తారు...వెంటనే శుభ్రమైన యిస్త్రీ జత ఒకటి తొడిగేస్తారు..ఎడం చేత్తో పుస్తకాలూ, కుడిచేత్తో పళ్లుదోము పుల్లా పట్టుకుని

కాలేజీకి వచ్చేస్తారు... ఏ కాలేజీ కయినా అతి దగ్గరలో ఒక కాఫీ హోటలూ, మంగలిషాపూ తప్పవు. కావలిస్తే చూడు. ఏ కొళాయిదగ్గిరో దంతదావనం అయిందనిపించి మంగలి షాపులో మేకప్ అవుతారు... హోటల్లో 'లోడ్' వేసుకుని యివతల పడేసరికి ఫస్టు బెల్ ఎలాగా అవుతుంది.

ఇదెందుకు చెబుతున్నానంటే దినదిన పతనమై కృత్రిమమైపోతున్న సాంఘిక వ్యవస్థను గమనించిన నా కళ్ళకి మీ యిల్లు చల్లని పందిరిలా కనిపించింది బాబూ''

> మీ నాన్న క్రమశిక్షణలో సంతృప్తితో, స్వయం సహాయంతో సంతోషంగా బతకడం నేర్చుకున్న మీ కుటుంబానికి ఏం తక్కువయ్యా?

రవణమూర్తి ఒక్క నిమషం ఆగి మళ్ళీ మొదలెట్టాడు.

''మధ్యాహ్నం ఓమారు పడుకుని లేచే సరికల్లా మరో మనోహర దృశ్యం నా కంట పడింది. మీ అమ్మాయి పెద్దది కాబోలు, బిందెతో నీళ్ళు తీసుకోస్తోంది. వెనకాల అబ్బాయి రాగి చెంబుతో నీళ్ళు తెస్తున్నాడు. నన్ను పులకింప చేసింది ఇవేవీ కావు. వీళ్ళ వెనుక మీ చంటిది ఎఱ్ఱటి లక్క పిడత నిండా నీళ్ళుపోసి తలమీద పెట్టుకుని రెండు చేతులూ పైకెత్తి అతి పొందికగా, ఒక్కచుక్క నీళ్లు పడిపోకుండా తీసుకొస్తోంది.

'ఇదెక్కడ్నించేవ్ గొల్ల భామా' అని నేను పలకరిస్తే ఆ ఆరిందా అంటుందీ...

'బాంది...ఎవరింట్లో నీల్లు వాల్లు తెచ్చుకోలూ ?'

మీ పెద్దమ్మాయి చెప్పింది, అవాళ మీయింట్లో దాసీది రాలేదుట. దాసీదంటే జ్ఞాపక మొచ్చింది... పరాధీనతలో పతాక నందుకున్న మా కుటుంబం మాటే చెప్పాలి. మా యింట్లో దాసీదీ, మొక్కలకు నీళ్లు పోసేదీ, మంచినీళ్ళు పోసేదీ, పక్కలు ఎత్తేదీ, బజారు కెళ్లేదీ – ఇన్నిటికీ యింతమంది నౌకర్లూ ఉన్నారు. నీతో చెప్పకేం మా యింట్లో ప్రతి ఒక్కరికీ; కనుక్కోడానికి ఒకరూ, పొగడ్డానికి ఒకరూ కనీసం యిద్దరేసి మనుషులు కావాలి... ఏ ఒక్క మనిషి లేకపోయినా అయిదు నిమషాలు జరగదు. ఇంతమంది నౌకర్లలో ప్రతిరోజూ ఎవరో

ఒకరు మానెయ్యకా మానరు. ఇక వేగుతున్న పేలాల్లా మా యింట్లో ప్రతి ఒకరూ ఎగిరెగిరి పడతారు... చూసి తీరవలసిందే.... బాబూ, డబ్బు వల్ల మేం పొందుతున్న సుఖం యిదీ.... నెలకి నూటయాభై సంపాదించిన నాడూ మేం అందులో ఇమడలేక పోయాం ఇప్పుడు పదిహేను వందలు తెస్తున్నా యిమడలేక చెప్పలేని బాధ పడిపోతున్నాం....

మీ నాన్న క్రమశిక్షణలో సంతృప్తితో, స్వయం సహాయంతో సంతోషంగా బతకడం నేర్చుకున్న మీ కుటుంబానికి ఏం తక్కువయ్యా? ఇప్పుడు చెప్పు గోపాలం మీ నాన్న నీకేం యివ్వలేదుటయ్యా... ?

చూడు గోపాలం... మీరందరూ పుట్టక పూర్వం...సుమారు ఏభై ఏళ్ళ క్రిందట... వెన్నెల రాత్రిలో ఏటి ఒడ్డున యిసకలో నేనూ రామ్మూర్తి ఒకరి నొకరు అలసి పోయేదాకా తరుముకొనే మధుర స్మృతులు నాకు మరొక చోట జ్ఞాపకం రావు సుమీ... ఇంతటి చల్లని వాతావరణం యిది... క్రమబద్ధమైన మీ జీవితంలో నీ భార్య కూడా భాగస్వామి కాగలిగిందంటే ఆదృష్టాన్ని అభినందించకుండా ఉండలేక పోతున్నాను... నా మనసు కెప్పుడైనా కష్టం కలిగితే విశ్రాంతి కోసం మీ యింటికే వచ్చి తలుపు తడతాను. అవును మరి, రామ్మూర్తి యిల్లు యిది! నిష్కామమైన వాడి జీవితంలో శతాంశం యిక్కడ ప్రతిఫలించినా యింతకన్న విలువైన ఆస్తి ఉంటుందా? గోపాలం, తలెత్తి నా కళ్లల్లోకి చూస్తూ చెప్పు మీ నాన్న నీకేం యివ్వలేదా?''

గోపాలం భక్తి, కృతజ్ఞతలతో, కన్నీళ్లతో నిండిన కళ్లతో ఆయన వైపు చూశాడు. అంతకంటె బాగా ఎత్తున ఉన్న తండ్రి ఫోటో వైపు చూశాడు. హైస్కూలు మేష్టరీ చేసినా అందరూ మనుషులే.... అది గుర్తించడం కన్న ఆనందాన్ని అందించేది ఏమున్నది?

# గెలుపు - నాన్న మిరాశి హక్కు



చందు శివన్న
99637 09032

పసిదాన్ని ఏనుగు అంబారి ఎక్కించుకున్నప్పుడే
నాన్నగా ఓటమి మొదలైంది
ఒక్కసారిగా నాన్న గుర్తొచ్చాడు

నాన్నగా నాన్న ఓడిపోవడం ఎప్పుడు మొదలైంది
నాన్న వలస పాదాలను కుట్టించుకున్నప్పుడు
మొదటిసారి ఓడిపోయిన జ్ఞాపకం

పెద్దకాపుల పెద్దరికాన్ని నిలబెట్టడానికి
స్వేదసంద్రమైన నాన్న పగిలిపోవడం గుర్తు
ఎన్ని ఓటములకు పురావస్తు ఆధారం నాన్న
ఎన్ని కన్నీటి సంఘటనల రూపాంతరం నాన్న
జీవిత రంగస్థలంమీద నాన్నదెప్పుడూ పరాజితుని పాత్రే

స్కూల్ పరీక్ష ఫీజు కట్టక
మాస్టారు బయట నిలబెట్టినప్పటి అవమానాన్ని
ఇంటికొచ్చి నాన్న మీద దులిపినప్పుడు
నాన్నగా నాన్న ఓడిపోయాననుకున్నాడేమో
ఆ రాత్రంతా
నాన్న దుఃఖపు వాసనేసాడు

మంచి మార్కులొచ్చాయి పెద్ద చదువులు చదివించమని
అయ్యవార్లు మందలించినప్పుడు
నాన్నగా నాన్న ఓడిపోయాననుకున్నాడేమో
ఆ వారమంతా
నాన్న చెట్టు ఆకులన్ని రాల్చి మోడైపోయింది

అప్పులోళ్లు
ఉన్న రెండెడ్లను తోలుకుపోయినపుడు
అలవాటైన నిస్సహాయ యోగముద్రలో బంధీయై
నాన్నగా నాన్న ఓడిపోయాననుకున్నాడేమో
ఎద్దుల గిట్టలకెల్లి కన్నీరై పారాడాడు

నాన్నకు ఓటమి అనే ఒక్క ఆసనం ఏమిటి
ఆకలైనప్పుడు తువ్వాలను
కడుపుకు బిగించుకొని బోర్లా పడుకునే ఆసనం
గొడ్డుకారంతో పెట్టిన విద్య

రెడ్డిముందు చెవుల్లో మోకాళ్ళను
ఇరికించుకొని దిగాలుపడి కూర్చునే
బోధిసత్త్వుని ఆసనం
సముద్రాన్ని కళ్ళల్లోనే కాదు
సకల రోమరంధ్రాల్లోంచి నిరంతరంగా పారించే
ఆసనం

చివరకు
ఆకాశపు చిలక్కొయ్యకు గొంతును వేలాడదీసి
గంటల తరబడి శ్వాస మీద ధ్యాసను నిలిపే ఆసనం

నిజంగా
మనం గెలవడం కోసం
కన్నీటి కడవలను సముద్రానికి అప్పిచ్చినవాడు నాన్న
సత్యంగా చెప్పండి
గెలిచినవారందరూ నాన్నముందు ఓడిపోలేదూ?

* మిరాశి= వృత్తిగాయకులకు వారసత్వంగా వస్తున్న హక్కు పత్రం


# భారతదేశం పతనానికి "గిరీశం" చెప్పిన పదకొండు కారణాలు ..!!?



శ్రీ ఎ.రజాహుస్సేన్
✆ 98484 43610

కళాప్రపూర్ణ బళ్ళారి టి.రాఘవ గారి సుదీర్ఘ ఉపన్యాసం_ _ _.!! గురజాడ వారు ఏ ముహూర్తాన కన్యాశుల్కం నాటకం రాశారో గానీ...నాటికీ నేటికీ అదో దృశ్యకావ్యంగా మిగిలిపోయింది. ఆ నాటకంలోని మొదటి రంగంలో 'గిరీశం' ఇలా అంటాడు.

"డామిట్...ఇలాంటి మాటలంటే నాకు కోపం వస్తుంది... పూనా డెక్కన్ కాలేజీలో నేను చదువుకుంటున్నప్పుడు .. 'ది ఇలెవన్ కాజెస్ ఫర్ ది డిజనరేషన్ ఆఫ్ ఇండియా' (The eleven causes for the degeneration of India ) ను గూర్చి మూడు గంటలు ఒక్క బిగిని లెక్చర్ ఇచ్చేసరికి ప్రొఫెసర్లు దంగయిపోయినారు! మొన్న బెంగాలీవాడు ఈ వూర్లో లెక్చర్ ఇచ్చినపుడు ఒక్కడికైనా నోరు పెగిలిందీ ? మనవాళ్ళు వుట్టి వెధవాయ్ లోయ్".



ఇలా గిరీశం భారతదేశం పతనానికి పదకొండు కారణాలున్నాయని ఓ స్టేట్ మెంట్ అయితే ఇచ్చాడు కానీ..!నాటకంలో ఎక్కడా అవేమిటో చెప్పలేదు. వాటిని మీరే ఆలోచించుకోండని పాఠకుల మీదే వదిలేశాడు. ఆ

రోజుల్లో గిరీశం స్టేట్ మెంట్ లోని పదకొండు కారణాల్ని గురించి ఎవరూ అంతగా పట్టించుకోలేదు కానీ...సర్ కట్టమంచి రామలింగారెడ్డి గారు మాత్రం తీవ్రంగా ఆలోచించడం మొదలెట్టారు. మామూలుగా అయితే గిరీశం లాంటి భ్రష్టుడి నోట వచ్చిన ఈ మాటలకు అంతగా ప్రాధాన్యమీయాల్సిన పనిలేదు. కానీ ఇది గురజాడ వారి నాటకం కాబట్టి బుర్రకు పనిపెట్టక తప్పింది కాదు.

సర్ కట్టమంచి రామలింగారెడ్డి గారు ఆరోజుల్లో(1933) ఆంధ్ర విశ్వకళాపరిషత్ విసి గా వున్నారు! ఆంధ్రావిశ్వ కళాపరిషత్ దేశంలోని అన్ని యూనివర్సిటీల కంటే వున్నతంగా తీర్చిదిద్దాలని ఆయన వివిధ విజ్ఞాన శాఖలకు సంబంధించిన అంశాలపై నిష్ణాతులచే ఎక్స్ టెనన్షన్ లెక్చరర్స్. ఇప్పించే వారు. ఇందులో భాగంగానే "భారతదేశం పతనానికి పదకొండు కారణాలు" అనే అంశంపై రాజమహేంద్రి ట్రెయినింగ్ కాలేజీలో ఉపన్యాసం ఏర్పాటు చేయించారు. అయితే ఎవరిచేత ఈ ఉపన్యాసం ఇప్పించాలన్న విషయమై తర్జనభర్జన జరిగాక,చివరకు బళ్ళారి రాఘవ గారి పేరును ప్రతిపాదించారు. రాఘవ గారు షేక్స్పియర్, బెర్నార్డ్ షా తదితర నాటకాల్ని అధ్యయనం చేశారు. ఆంగ్ల సాహిత్యంపై రాఘవ గారికి గట్టి పట్టుంది. అదీగాక ఆయన జాతీయ న్యాయ శాస్త్రాల్లో నిష్ణాతులు. గొప్ప వక్త.


ఇంకేముంది ప్రసంగించాల్సిన రోజు రానే వచ్చింది. గిరీశం సూత్రీకరణపై విరామం లేకుండా ఆరు గంటలపాటు సుదీర్ఘంగా ఆంగ్లంలో ఉపన్యసించారు. దురదృష్టమేమంటే అసమర్థ పాలకుల వల్ల రాఘవగారి ప్రసంగం వెలుగులోకి రాకుండా చీకట్లోకి నెట్టివేయబడింది. కాలం దొర్లిపోయింది. జనమంచి కామేశ్వరరావు గారి దృష్టి ఈ ప్రసంగపాఠంపై పడింది. యూనివర్సిటీ ముద్రణలన్నీ తిరగేశారు. ఎక్కడా దాఖలాలు దొరకలేదు. చివరకు పాతకాగితాల కట్టల్లో 1935,ఆగస్టు 19వ తేదీ నాటి హిందూ పత్రికలో నాటి రాఘవగారి ప్రసంగం కనబడింది. తీగ దొరికింది. ఇక డొంకను కదిల్చారు.

ట్రెయినింగ్ కాలేజ్లో అదే సంవత్సరం ప్రచురించిన గెజిట్ దొరికింది.. నెం..1779. ఎడ్యుకేషన్31ఆగస్టు వారి మానస పుత్రుడిగా అభివర్ణించారు. రాఘవ గారి దృష్టిలోగిరీశం చుట్టకాలుస్తూ తిరిగే పోరంబోకు కాదు. చేతి బెత్తం తిప్పుకుంటూ క్షణానికో రంగూ, స్వభావంతోతుంటరి సాహసాలు ప్రదర్శించే దుష్ట చింతన గల వాడు అంతకంటే కాదు. బాధ్యతారహిత ఆంధ్ర యువజన హృదయానికి గిరీశం ప్రతినిధి.

భారతదేశ పతనానికి అతను పేర్కొన్నానని చెప్పిన కారణాలు కాల్పనికం ఎంత మాత్రం కాదంటారు బళ్ళారి రాఘవ. గిరీశం చెప్పిన పదకొండు కారణాలూ భారతదేశ పతనానికి మౌలిక కారణాలు, బాధాకర వాస్తవాలేనన్నది రాఘవగారి నిశ్చితాభిప్రాయం.

"మనమంతా గిరీశాన్ని ప్రేమిస్తాం.బహుశా అతని బలహీనతలే మనకు ఆకర్షణలేమో ?" అంటారు రాఘవ.

"పూనా కాలేజీలో తాను లెక్చరిచ్చినట్లు గిరీశం చెప్పుకున్నాడు. వెంటనే మన మనస్సున ఒక సంచలనాత్మక తరంగం తీవ్రంగా తాకుతుంది. మహనీయుడు లోకమాన్య బాలగంగాధర తిలక్ ఉద్యమించిన పవిత్ర స్మృతులు మన హృదయాలలో చెలరేగుతాయి. ఆ మానసిక స్థితిలో గిరీశం బహుశా భారతదేశ పతనానికి పదకొండు కారణాలు నిరూపిస్తూ ఉపన్యాసం చేశాడేమో అన్న విశ్వాసం మనకు కలుగుతుంది. గిరీశం వివరించిన పదకొండు కారణాలూ దైనందిన జీవితంలో సామాన్యులందరికీ ద్యోతకమయ్యే కల్పనా సత్యాలే. వాటి వల్లనే సమాజం పతనం కావడం సత్యమేనని వారంతా భావించి వుంటారు. సామాజిక జీవితంలో ఆ వినాశం స్పష్టమయ్యే రీతిలో గిరీశం విశ్వసనీయంగా చెప్పివుంటాడనే మనం భావిద్దాం" అంటారు రాఘవ.




గిరీశం చెప్పి వుంటాడని రాఘవ గారు ఊహించిన 11 కారణాలు...!!

★1. సమాజ శ్రేయస్సుకు ఉత్తమ విద్యావిధానం...!

కన్యాశుల్కం నాటకం మొదటి దృశ్యంలోనే భారతదేశ పతనానికి గల 11 కారణాల్ని గిరీశం తన శిష్యుడికి బోధిస్తాడు. అందులో ఒకటి విద్యావిధానం పతనం గురించి చెబుతూ... సమాజశ్రేయస్సుకు ఉత్తమ విద్యా విధానం ఎలా వుండాలో చెబుతాడు. "నిజమైన విద్యావిధానానికి కొన్ని ప్రాథమిక సూత్రాలుండాలి; పుస్తకాలపై ఆధారపడే చదువే కొనసాగకూడదు. నిజమైన



చదువు గురువుతో శిష్యుడికి ఏర్పడే ప్రగాఢ అనుబంధం ద్వారానే లభిస్తుంది. మన ప్రాచీనుల ఆర్య విద్యావిధానం అదే. గిరీశం మాస్టర్ల అవకతవకలు పేర్కొంటాడు. వాటి వల్లనే విద్యార్థి పాసవడానికో, లేక ఫెయిల్ అవడానికో కృతక విలువలు కల్పించబడతాయి. బ్రతుకులో ఓటమి వైపుకు తరుముతాయి. గిరీశం వెంకటేశాన్ని "మీ మాష్టర్లకి నీకున్న లాంగ్వేజీ వుందా? అనడుగుతాడు.వ్యక్తీకరణే సముచిత రీతిలో సాగించలేని ఉపాధ్యాయుడు విద్యార్థికి వినూత్న శక్తినందించలేడు.

### ★2. ఋణదాతల నుంచి పలాయనం...!!

మొదటి రంగం, మొదటి స్థలంలోనే గిరీశం తన తెలివితేటలకు మురిసిపోతాడు. తన సౌఖ్యాల కోసం, ఆనందం కోసం ఇతరులడబ్బును ఎంత చాకచక్యంగా వాడుకుంటాడో వివరిస్తాడు! గిరీశం ఇతరుల డబ్బును సంగ్రహించి భద్రంగా జేబులో దాచుకుంటాడు. గిరీశం కూడా ఇక్కడ ఓ మాటంటాడు– "ఎటు చూసినా బాకీలే" అని. డబ్బు దుబారా చేయడమే అతని ఋణగ్రస్త జీవితానికి ప్రధాన కారణం. ఇది ఇప్పటి పరిస్థితులకు కూడా సరిపోతుంది. బ్యాంకులనుంచి వేలకోట్ల రూపాయలు ఋణం తీసుకుని ఎగ్గొట్టిన సంఘటనలు కోకొల్లలు. అంటే మన గిరీశం ఈ పరిస్థితిని ముందే ఊహించాడన్న మాట.

### ★3. ఆకాశ సౌధాలను తాకట్టు పెట్టగల చాకచక్యం

(పెళ్ళిళ్ళ పేర దుబారా..దివాలా ,) పెళ్ళిళ్ళ పేర డబ్బును వృధాచేస్తాం. ఆడంబరాలకు, ఫాల్స్ ప్రిస్టేజ్లకుపోయి దుబారా చేస్తాం. ఈ పెళ్ళిళ్ళ పేరు మీద ధారపోసే నెయ్యి ఖర్చు కోసం ఇళ్ళూ వాకిళ్ళూ అమ్మనైనా అమ్మాలి, తనఖాకైనా కుదువ పెట్టాలి. అలాగే ఆడపిల్లలకి, మగపిల్లలకి స్కూలు, కాలేజీవచదువుల మీద పెట్టే దుబారాకైతే అంతే వుండదు. మన జీవన దృక్పథంలో ఏర్పడిన కుహనా వైభవాల వల్ల మన వ్యయాలు మితిమీరుతున్నాయి. సాంప్రదాయ భీరువులమై ఆచారాలకు దాసులమై మనం వివాహాది శుభకార్యాల

ఖర్చులు తగ్గించుకోలేక పోతున్నాం. అప్పు పుచ్చుకోవడం అనేప్రక్రియలోనే స్వనాశనానికి బీజాలు పడతాయి. ఆత్మ గౌరవమూ కుదువపెట్టబడుతుంది. ఈళసత్యాన్ని మన జాతి గుర్తించడం లేదు.

### ★4. ఇతరుల సొమ్ము వ్యర్థం చేయడం..!!

ఒకడు తన డబ్బును తాను వ్యర్థం చేసుకోవడం ప్రారంభిస్తే ఇతరుల ధనాన్ని వ్యర్థం చేయడానికి వెనుకాడడు.అప్పుడు వాడు సమాజానికి శత్రువుగా పరిణమిస్తాడు.మూఢ విశ్వాసాలు ,అర్థం లేని సాంప్రదాయాలు ..ఇవే మన దురదృష్టకర జీవన స్థితికి కారణాలు.

### ★5. ముప్ఫై మూడు కోట్ల దేవతలు...!!



భారతీయులను సంరక్షించడానికి 33 కోట్ల దేవతలు సిద్ధంగా వున్నారు. సగటు మధ్యతరగతి వ్యక్తిని దోషిగా మారుస్తున్నారుకాలాన్ని వ్యర్థం చేయడానికి ఎన్నో మార్గాలు.మానవ జీవితంలోని మధురమైన కాలమంతా స్కూళ్ళకీ,కాలేజీలకీ బలైపోతోంది. ధనాన్ని వ్యర్థం చేయడం, కాలాన్ని వ్యర్థం చేయడం,శారీరక శక్తుల్ని హీనపరుచుకోవడం ..ఇవే మనం సాధిస్తున్న విజయాలు.బాధలకు లోనయ్యే అమాయకులని దేవుడు ప్రేమిస్తాడన్నది మన పూర్వీకుల నమ్మకం.మనిషికి ప్రజ్ఞ వుంది. శక్తులున్నాయి.కానీ ఏం లాభం? ఉదాత్త శక్తులన్నీ నిరుపయోగమవుతున్నాయి.

### ★6. మేధాదర్శనంపై పొర కమ్ముతోంది..!!

మన మేధాశక్తిపై పొర కమ్ముతోంది.ఆదినుంచి మనం స్వయంగా ఆలోచించకుండా మనం కట్టడి చేయబడ్డాం.పసితనంలోనేమన సహజాతాలు ప్రతిభలూ నలిపివేయబడ్డాయి.మన పరిశీలనా శక్తి చిదిమివేయ బడింది. అందువల్లనే తొందర తొందరగా నిర్ణయాలు తీసుకుంటాం. సత్యా సత్యాలను

ధృవపరుచుకోకుండానే అభిప్రాయాలు వెల్లడి చేస్తాం. వీటి దుష్ఫలితాలు జీవితం మీద స్పష్టంగా కనిపిస్తూనే వున్నాయి.

### ★7. కళ సృజనను సౌందర్యవంతం చేస్తుంది..!!

సహజాత కళల్ని మనిషిళ సాధనాభ్యాసాల వల్లనే అభివృద్ధి చేసుకోగలడు. కానీ చాలామందికి తమలో శక్తులున్నాయని తెలీదు. తెలుసుకోకుండానే వాళ్ళ బతుకులు వ్యర్థమై పోతాయి. క్షేత్ర మంటే ఏమిటి? బహూశా గిరీశం ఏమాలోచించి వుంటాడు. అభివృద్ధిని ఉపేక్షించడమే అంతరిక క్లేశమనుకొని వుంటాడు. మనం నేర్చుకుంటున్న విద్యల సారాంశం మనలో నిద్రాణంగా వున్న కళాభినివేశాన్ని ఆవిష్కరించేందుకు దోహదం చేయడం లేదు.

### ★8. ఉన్నత లోకాలకోసం..!!

సాధారణంగా భారతీయులు ఆత్మస్తుతి కి అలవాటుపడ్డవాళ్ళు. తాము గొప్ప దానగుణం కలవారమని చెప్పుకుంటారు! వీధిలో తిరిగే భిక్షకులందరికీ తమ గృహ ముఖద్వారాలు ఎల్లప్పుడూ తెరిచే వుంటాయని గొప్పలు చెప్పుకుంటూ వుంటారు! బాధితులను, దరిద్రులను కాపాడేందుకు తామెల్లప్పుడూ సంసిద్ధంగా వుంటామని చెప్పుకుంటారు. కానీ మన దేశమంతా వెదికి చూసినా దీనుల్ని ఆదుకునే సంస్థ ఒక్కటీ కనిపించదు. నిజానికి నిరాటంకంగా జరుగుతున్న వ్యర్థత భారతదేశం సంస్కృతి పతనం కావడానికి ఒక ప్రధాన కారణం. ఆలోచనా శక్తిని వ్యర్థం చేసుకోవడం, వివేచనా శక్తిని కోల్పోవడం మన నిత్య జీవితంలో ఆవేశాన్ని వ్యర్థం చేసుకోవడం గురించి కూడా గిరీశం ఆలోచించి వుంటాడు. భారతదేశ పతనానికి ఇది కూడా ఓ కారణమే.

### ★9. గుణకారాలు తప్ప మరేమీ లేదు..!!

మన సమష్టి కుటుంబాలలో కుటుంబ పెద్ద సంపాదించి పెట్టడం మిగతా సభ్యులంతా తినడంగా తయారైంది. పెళ్ళిళ్ళు చేసుకొని పిల్లల్ని కనడం.. తద్వారా కుటుంబ సంఖ్య గుణకారమవుతుంది. సమష్టి కుటుంబాలలో ప్రధాన వ్యక్తి వెళ్ళిపోవడం తటస్థిస్తే, ఆయన భార్య వితంతువై, మిగతా వాళ్ళ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోంది.! మన వ్యవస్థలో మార్పు రాగానే సమష్టి వ్యవస్థకు కాలదోషం పట్టింది. ఈ విషయాన్ని మనం అంగీకరించలేక పోతున్నాం. సోదర మానవాళిపై మనకెన్నడూ దయాదాక్షిణ్యాలు లేవని,

జాతీయాభిమానం అన్నది శూన్యం. ఒంటిపిల్లి రాకాసితనం ఎలా ప్రవేసించిందో మరి ! నిజంగా ఇది జీవన వ్యర్థతకు దారితీస్తోంది.

ఇలాంటి సంకుచిత విధానాలను పరిశీలించే గిరీశం మనదేశ పతనానికి పదకొండు కారణాల్ని ఊహించి వుంటాడు. పూటకూళ్ళమ్మ వృత్తి డబ్బులు పుచ్చుకొని అన్నం పెట్టడమే. గిరీశం ఆమెను ఆశ్రయించి తిండి తింటున్నాడు. కానీ డబ్బులివ్వడం లేదు మధురవాణి జీవితం స్పష్టంగా వెల్లడి అవుతున్నదే. ఒక్క బుచ్చమ్మ విషయంలోనే గిరీశం ఆవేశాలు కొంత గుప్తమయ్యాయి! హృదయాన్ని రక్షించి, తద్వారా సంఘసంస్కరణోద్యమాన్ని పటిష్టం చేయడం గిరీశం ఆదర్శాలలో ఒకటి. మానవులు శక్తిని వ్యర్థం చేయడం ద్వారా ఆవేశాలకు ఫలితార్థం సాధించడం గిరీశానికి ఇష్టం లేదు.

★10. పాటకంటే శృతి పెద్దది..!!

గిరీశం దేశంలో యవ్వన శక్తి వ్యర్థమైపోతోందని సుదీర్ఘ ఉపన్యాసమిచ్చాడు. రక్త మాంసాలు వృథా వృథా అవుతున్నాయి. కానీ అభివృద్ధి మాత్రం పిసరంత కూడా కనిపించదు. ఇవన్నీ భారతదేశ వినాశనోన్ముఖతకు దారితీస్తున్నాయి."వ్యర్థతను అరికట్టు, ఉన్నదాన్ని లాభదాయకంగా వుపయోగించు," అన్న సూత్రాన్ని అందరూ మరచి పోతున్నారు. సగటుభారతీయుని వివాహం14..16 సంవత్సరాల మధ్యే జరిగిపోతోంది. 20యేళ్ళలోపు పిల్లలు పుడుతున్నారు. 32..34 యేండ్లు వచ్చేసరికి ముసలోళ్ళై పోతున్నారు. 4 లేక 5 ఏళ్ళ వ్యవధి మాత్రమే మన జాతికి యవ్వన స్థితిగా పరిగణించబడుతోంది.

★11. ఇహలోకానికి, పరలోకానికీ మధ్య గోడ లేదు..!!


పూనా ఉపన్యాసంలో గిరీశం చెప్పుకున్న అంశాల్లో..

1. ధనవ్యయం
2. కాలం వ్యర్థం చేయడం
3. కళాప్రజ్ఞలను వ్యర్థం చేయడం
4. మేధాశక్తి సంపదను వ్యర్థం చేయడం
5. ఆవేశాలను దుబారా చేయడం

6. అపాత్రదానం ద్వారా వితరణ గుణం నిరుపయోగం కావడం
7. యువశక్తుల అస్తిత్వాన్ని వ్యర్థం చేయడం
8. ఉచ్ఛ్వాస నిశ్వాసాలని వ్యర్థపరచడం
9. సార్వత్రికంగా భౌతిక శక్తులను నిరుప యోగ పరచడం

గిరీశం నమ్మిన ప్రధానకారణాల్ని సంశయించాల్సిన పనిలేదు. మన విశాల జీవన వ్యవస్థలోనే ఘోరమైన వ్యర్థత అసహజంగా దురాక్రమించి వుంది. గిరీశం మాటల్లోచెప్పాలంటే ఈప్రపంచం ఏర్పడ్డది మనిషికి సుఖాలను అందించడం కోసమే. దానిని అనుభవించిన వాడికే హక్కు ఏర్పడుతుంది. పరలోకంలో కూడా అంతే. ఈ జీవిత దృక్పథం సంసారానికి స్వాగతం పలుకుతుంది. అంతే తప్ప దుఃఖసాగరమనుకొని నిరసించదు!

పై కారణాల వల్ల భారతదేశం పతనమవుతోందని గిరీశం చెప్పివుండొచ్చన్నది బళ్ళారి రాఘవ గారి అభిప్రాయం. ఆయన దృష్టిలో గిరీశం నాటక పరిసమాప్తిలో గొప్ప ఆత్మత్యాగాన్ని ప్రదర్శించాడు. మహోన్నతమైన సౌజన్యారావు పంతులు గారి మానసిక బలహీనత ఏదో కనిపెట్టి దానిపైనే విజయం సాధించాడు. కన్యాశుల్కాన్ని ఇంతగా మధించిన వారిలో రాఘవ ముందుంటారు. గిరీశం ఇచ్చిన ఉపన్యాస సారాంశాన్ని రాఘవ ఇలా తనదైన శైలిలో ఆరుగంటలపాటు అనర్గళంగా ఉపన్యసించి ప్రశంసలు పొందారు. విచిత్రమేమంటే... "కన్యాశుల్కం నూరేళ్ళ సమాలోచనం" పేరుతో వేసిన 923 పేజీల బృహత్పుస్తకంలో రాఘవ గారి ప్రసంగ పాఠం లేదు. ఇది గిరీశానికి తీరని లోటే.!!




**"వొట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయి"**

**- గురజాడ**

# రసాయన పితామహా నీకు జేజేలు!



డాక్టర్ చాగంటి కృష్ణ కుమారి
98851 63304




మథన పడ్డాడానాడు
వాటి మధ్య ఏదో క్రమత వుందని, అదేదో తెలియకున్నదని!
ఆనాటికి తెలుసున్నవవి అరవై మూడే!
ఒకానొక ఆవర్తన క్రమానికవి వొదిగి తీరుతాయనే
నమ్మకం మది!





ఎన్నో సంవత్సరాల పరిశోధన, పరిశీలన,
ప్రయోగాలతో
తలమునకలవగా కలిగిన అంతర్దృష్టి.
పేర్చాడు పేర్చాడు మూలకాల వివరాల కార్డు
ముక్కలను
పేరుస్తునే వున్నాడు, పేషన్స్ పేక ముక్కల ఆటగాడిలా
నిలువు అడ్డు వరుసలలో, వాటి ద్రవ్యరాశుల, రసాయన
ప్రవర్తనాతీరుల ప్రాతిపదికగా
ఓపికతో, ఓర్మితో!




క్రమం తెలిసిరావటంలేదు,
ఆ ఆలోచనతోనే మూతపడ్డాయి కనులలసటతో
ముక్కలన్నీ క్రమ పద్ధతిని ఒక పట్టికలో చేరుతూ
సుషుప్తిలో సాక్షాత్కరించాయని,
చెపుతుంది ఓ కథ










మనకు తెలుసు-అంతర్దృష్టి తో కనుగొనబడని
వాటికై ఖాళీలను వదిలిపెట్టిన అతని ఆవర్తన
పట్టిక!


లోతైన శాస్త్రీయ అవగాహనా ఫలితమని!
ఆ పట్టిక ఆధునికమై, నిండుగా విస్తృతావర్తన
పట్టికై
విస్తృతి చెందుతున్నదింకనూ, శతాధిక
మూలకాలతో
రసాయన పితామహా నీకు జేజేలు!
మెండలీవూ నీకు జేజేలు --

ప్రకృతి సంభాషిస్తుంది, తపనతో శ్రమిస్తున్న
పరిశోధకునితో
నిఘూడ నిక్కమ్ములను విశదీకరిస్తుంది
అత్యవసరంగా కొన్ని పదాలను సృజిస్తూ తన నూతన
అవగాహనను శాస్త్రవేత్త తెలియజెప్పే తరుణంలో
విజ్ఞానశాస్త్ర భాషలు వికశిస్తాయి, విస్తరిస్తాయి.





ఆ భాషే వైజ్ఞానిక భాష,
అవును మెండలీవు తరువాత
ఈనాడెన్నెన్ని కొత్త పదాలు
బౌతిక, రసాయన శాస్త్రాలలో, మరిన్ని
శాఖోపశాఖలలో చేరాయో కదా!



పరిశోధక వ్యాసం

# ఎస్. ఎమ్. ప్రాణ్‌రావు కథలు - సామాజిక అంశాలు



శ్రీ గద్దల అనిల్
✆ 99086 55086

ప్రవేశిక:

"పిల్లల్లారా పాపల్లారా రేపటి భారతపౌరుల్లారా
పెద్దలకే ఒక దారిని చూపే పిన్నల్లారా పిల్లల్లారా
మీ కన్నుల్లో పున్నమి జాబిలి
ఉన్నాడు, ఉన్నాడు పొంచున్నాడు
మీ మనసుల్లో దేవుడు కొలువై ఉన్నాడు"

దాశరథి కృష్ణమాచార్యులు 'పిల్లల్లారా పాపల్లారా' అనే గేయ ఖండికలో పిల్లల గొప్పతనం, వారి కన్నుల్లో దాగి ఉండే పున్నమి జాబిలి, వారి మనస్సుల్లో కొలువై ఉండే దేవుడిని వర్ణిస్తూ, నేటి పిల్లలే రేపటి భారతపౌరులు అనే విషయాన్ని ఆయన నొక్కి వక్కాణించారు. అయితే, తెలుగు సాహిత్యంలో బాల సాహిత్యం ఎప్పటి నుంచి ప్రారంభమైంది?, ప్రాచీన కవులు ఏయే సందర్భాలలో బాలల



గురించి ప్రస్తావించారు?, ఆధునిక కవులు బాల సాహిత్యానికి చేసిన కృషి ఏమిటి?, కవి, కథకులు ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు రాసిన చెలిమి కథల్లో బాలలకు సంబంధించి ఏయే  సామాజిక అంశాలు పేర్కొనబడ్డాయి అనే అంశాలను విశ్లేషించడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

## ప్రాచీన తెలుగు సాహిత్యంలో బాలల ప్రస్తావన:

క్రీ.శ. 12వ శతాబ్దానికి చెందిన ప్రసిద్ధ కవి పాల్కురికి సోమన కాలం నుంచి తెలుగు సాహిత్యంలో బాల సాహిత్యం ప్రారంభమైందని చెప్పవచ్చు. పాల్కురికి సోమన రాసిన బసవపురాణంలో మొట్టమొదటిసారిగా బాలలకు సంబంధించిన జోల పాటలు, ఆటలు ప్రస్తావించబడ్డాయి. 'జోసరచుచు సన్నుతిబాడు' అంటూ పిల్లలను నిద్ర పుచ్చటానికి పాడే జోల పాటను రాశారు. వీటితో పాటు రాగుంజు పోగుంజు లాట, కుందెన గుడి, చప్పట్లు, గుడిగుడి గుంజం గుంజారాగం, సిట్లపొట్లాట, దాగుడుమూతలు వంటి బాలల ఆటలను సోమన తొలిసారిగా సాహితీలోకానికి అందించారు.

ప్రాచీన బాల సాహిత్యం అంత అధికంగా గేయ రూపంలో ఉండేదని చెప్పవచ్చు. పాల్కురికి సోమన తర్వాత అనంతామాత్యుడు (భోజరాజీయం), కొరవి గోపరాజు (సింహాసన ద్వాత్రింశిక) మొదలైన కవులు సందర్భానుసారంగా వారి వారి గ్రంథాల్లో బాల సాహిత్యాన్ని ప్రస్తావించారు. ఆ తర్వాత క్రీ.శ. 15వ శబ్దానికి చెందిన పోతన తన భాగవతంలో బాల కృష్ణుని ఆటలను వర్ణిస్తూ, బాలలకు సంబంధించి రాసిన గేయాలు నేటికి ప్రచురంలో ఉన్నాయి. అన్నమయ్య రచించిన "చందమామ రావే జాబిల్లి రావే; జో అచ్యుతానంద జోజో ముకుందా" అనే పాటలు ఇప్పటికీ గ్రామాల్లో, పట్టణాల్లో వినిపిస్తూనే ఉన్నాయి. మొదట్లో బాలల సాహిత్యం ప్రత్యేకంగా లేదు. రాను రాను పెద్దలు రామాయణ, భారత, భాగవతాల్లోని చిన్న చిన్న నీతి కథలను పిల్లలకు అవసరమైన రీతిలో వినిపించేవారు.

## బాలల సాహిత్యం – ఆధునిక కవుల కృషి:

ఆధునిక తెలుగు సాహిత్యంలో బాలల సాహిత్యానికి కృషి చేసిన కవుల్లో ముందువరసలో ఉండే కవి గురజాడ అప్పారావు. బాలల కోసం ఆయన కొన్ని ప్రత్యేక గేయాలు రాశారు. ఆ తర్వాత చలం సమకాలినుడైన చింతా దీక్షితులు 'లక్క పిడతలు' అనే పేరుతో బాలల కోసం ఓ సంపుటి వెలురించారు.

తెలంగాణలో ప్రసిద్ధులైన కవి పండితులు డా. సి.నారాయణ రెడ్డి, దాశరథి కృష్ణమాచార్యులు, పి. యశోదారెడ్డి, డా. కపిలవాయి లింగమూర్తి, గడియారం రామకృష్ణ శర్మ మొదలైనవారు బాలల కోసం అనేక పద్యాలు, గేయాలు, నీతి కథలు, నాటికలను, నవలలు, జీవిత చరిత్రలు రచించి, బాల సాహిత్యానికి ఎనలేని సేవ చేశారు.

ఆచార్య బిరుదురాజు రామరాజు 'తెలంగాణ' పిల్లల పాటలు, త్రివేణి పిల్లల పాటల పేర్లతో పుస్తకాలను వెలువరించారు. గడియారం రామకృష్ణశర్మ 'వీరగాథలు' అనే బాలవీరుల కథలను, మనింకోడు రామయ్య 'తాతయ్య కథలు', 'ఆశాలువ' నవల, దీక్ష, ఆహుతి, పాకాల యశోదారెడ్డి నక్కబావ, బడిపెద్ద, బుచ్చిగాడు వంటి చాలా కథలను రచించి, బాల సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

## ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు పరిచయం:

ఆధునిక తెలుగు సాహిత్యంలో రచయితగా, నవలాకారుడుగా, కథకుడుగా ప్రసిద్ధిగాంచిన కవి ఎస్.ఎమ్.ప్రాణ్‌రావు (సరబాద ముఖ్య ప్రాణ్‌రావు). వీరు తెలంగాణలోని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1943లో జన్మించారు. తండ్రి రమణారావు, తల్లి పద్మావతి. ఉపాధ్యాయునిగా పని చేస్తూనే ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఆంగ్లసాహిత్యంలో బి.ఏ, ఎం.ఏ. పూర్తి చేశారు. సమాజంలోంచి వైవిధ్యమైన, విశేషమైన ఇతివృత్తాలను ఎన్నుకొని చారిత్రక, సామాజిక అంశాలతో రచనలు కావిస్తున్నారు. వీరు రచనా వ్యాసంగానికి ముందు సినిమా రచయితగా ప్రసిద్ధులు. ఆంగ్లసాహిత్యంలో విద్యనభ్యసించిన ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు ఇప్పటివరకు మొత్తం 24 రచనలు చేశారు. అందులో ఒక కథా సంపుటి, రెండు కవితా సంపుటాలు, రెండు నాటకాలు, పందొమ్మిది నవలలను వెలువరించారు.

## ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు చెలిమి కథలు – సామాజిక అంశాలు:

చెలిమి కథలు అనే పుస్తకాన్ని రచయిత ఎస్. ఎమ్. ప్రాణ్‌రావు 1993లో వెలురించారు. ఇందులో పిల్లలు, సమాజంలో జరుగుతున్న సంఘటనలకు సంబంధించి మొత్తం కథలు రాయబడ్డాయి. ప్రాణ్‌రావు వివిధ పత్రికల్లో పని చేసిన సమయంలో రాసిన కథలను చెలిమి కథల పేరుతో సంపుటిగా

తీసుకొచ్చారు. ఇక ఇందులోని కథలను పరిశీలిస్తే, 1. బేరం 2. దుష్టగ్రహం 3. కుంటికులాసం 4. చదువు 5. ఎలక్షన్ ఆట 6. అమ్మ 7. పుట్టిన రోజు కానుక 8. డిగ్నిటీ 9. నెత్తుటి సూరీడు 10. ముసుగు ఉంగరం వంటి శీర్షికల పేరుతో కథలు రాయబడ్డాయి. ఈ కథల్లో కుంటికులాసం, చదువు, పుట్టిన రోజు కానుక బాలల గురించి ప్రస్తావించబడింది.

### 1. కుంటి కులాసం:

ఈ కథలో చిన్న పిల్లలలో ఉండే అల్లరి స్వభావం, చిలిపి చేష్టలను కథకుడు చాలా సహజంగా చిత్రించకరించారు. ''వేణు, గిరి, శ్యాంబాబు, శేఖర్ అనే నలుగురు మిత్రులు కలిసి ఏడవ తరగతి చదువుతుంటారు. నలుగురూ రోజంతా కలిసి తిరుగుతూనే ఉంటారు. వాళ్ళను తరగతి గదిలో దుష్ట చతుష్టయం పేరుతో విద్యార్థులు పిలిచేవాళ్లు.. నలుగురికీ నాయకుడు శేఖర్. అదే తరగతిలో సాయి రాజ్ అనే అబ్బాయికి పోలియో వల్ల ఒక కాలు చచ్చుపడిపోతుంది. అతనికి శేఖర్ 'కుంటి కులాసం' అని పేరు పెడతాడు. ఎక్కడ కనిపించినా అలాగే పిలిచేవాడు. 'కుంటి కులాసం – ఇంటికి మోసం' అంటూ పాటలు కూడా పాడేవాడు. ఒక రోజు అనుకోకుండా గోతిలో పడిపోతాడు సాయిరాజ్. అది బాగా లోతుగా ఉన్న గొయ్యి. నీళ్ళు, రాళ్ళు ఉండవు.

కానీ, లోతుగా ఉండడంతో సాయిరాజ్ కాలు బెణుకుతుంది. నిలబడడానికి ప్రయత్నిస్తాడు కానీ సాధ్యం కాదు. పైన నిలబడి చూస్తున్న శేఖరును సాయం చేయమని బతిమాలుతాడు. శేఖర్ మాత్రం గోతిలో ఉన్నది ఎవరు అని అడుగుతాడు. "నేను" అంటాడు సాయిరాజ్."నేనంటే పేరు లేదా?" అంటాడు. "సాయిరాజ్" అంటాడు. ఆ పేరు నేను వినలేదు అంటాడు శేఖర్. తన తండ్రితోనైనా చెప్పమని సాయిరాజ్ బతిమాలతాడు. ఏమని చెప్పాలి అని అడుగుతాడు. నేను గోతిలో పడ్డానని అంటాడు సాయిరాజ్. మళ్ళీ నేను అంటే ఎవరు అని అడుగుతాడు శేఖర్. అలా చాల సేపు ఇద్దరికీ మధ్య కీచులాట జరుగుతుంది. చివరికి శేఖర్ వేధింపును తట్టుకోలేక సాయిరాజ్ 'నా పేరు కుంటి కులాసం' అని గట్టిగా ఏడుస్తాడు. దాంతో శేఖర్ మనసు కరిగిపోయి, వెంటనే గోతిలోకి దూకి, తన చొక్కాతో సాయిరాజ్ కన్నీళ్ళు తుడుస్తాడు.'' ఈ కథ ద్వారా ప్రతి బడిలో దివ్యాంగులను మానసికంగా వేధించే విధానాలను కళ్ళకు కట్టినట్లు చూయించారు రచయిత ప్రాణ్‌రావు.

## 2. పుట్టినరోజు కానుక

ఈ పుట్టినరోజు కానుక అనే కథలో పిల్లలలో ఉండే అల్లరి, చిన్న చిన్న దొంగతనాలు చెడు అలవాట్లు దారితీసి, ఎంత పెద్ద నష్టాన్ని కలిగిస్తాయో తెలియజేస్తుంది. ''రుక్కయ్య ముసలాయన. ఆయన బడి బయట జామకాయలు అమ్ముకొనే వ్యక్తి. బడి గేటు దగ్గరే ఉంటాడు. తన వ్యాపారం సరిగ్గా జరిగినా, జరగకపోయినా రుక్కయ్య సుందర్ సింగ్‌కి ఒక రూపాయి ముట్ట చెప్పాలి. లేదంటే ఇంటర్వెల్ సమయంలో, లంచ్ సమయంలో పిల్లల్ని బయటికి వెళ్ళనివ్వడు. లేదంటే గేటు ఆలస్యంగా తెరిచి, తొందరగా మూసేస్తాడు. దానితో పిల్లలు బయటకు రాలేరు. ఒకరోజు అమర్చిన జామ కాయల బండి దగ్గర పిల్లలు గుమిగూడి ఉంటారు. వారిలో గోపి అనే 12 ఏళ్ల బాలుడు ఉంటాడు. గోపి, సజ్జు మిత్రులు. తోడు దొంగలు కూడా. రుక్కయ్యకు కళ్ళు సరిగా కనిపించవు. అది ఆసరాగా చేసుకొని అతని దగ్గర ఎప్పుడూ జామకాయలు కొనరు. చేతికి అందినవి దొంగిలించి తింటూ ఉంటారు. 'ఈ మధ్య రుక్కయ్య అదోలా ఉంటున్నాడు జామకాయలు కూడా ఎక్కువ తేవడం లేదు' అని అనుకుంటారు. తరువాత రోజు లంచ్ సమయంలో గేటు బయట ఉండడు. అతని కోసం వెతుక్కున్న గోపి రుక్కయ్య ఎక్కడ అని జానీమియాని అడుగుతాడు.

"ఇంకేం వస్తాడు. దివాలా తీశాడు. కిరాయి కట్టనందుకు బండి సొంతదారు బండి లాక్కుపోయాడు. అప్పుల వాళ్లు ఇంటి మీద పడి చెంబు, తప్పేలా తీసుకుపోయారు, దాంతో పాపం, రుక్కయ్య వీధిని పడ్డాడు" అంటాడు జానీమియా. నెత్తి మీద ఎవరో సుత్తితో కొట్టినట్లనిస్తుంది గోపికి, 'అదేమిటి, రుక్కయ్య దివాలా తీయడమేమిటి! అంతా అతని దగ్గరే కొనేవారుగా' అంటాడు ఎలాగో గొంతు పెగుల్చుకొని. అంతా కొనేవారు కాదు. కొందరు దొంగతనం కూడా చేసేవారు. రుక్కయ్యకు చూపు సరిగ్గా ఆనేది కాదు. అది అదునుగా తీసుకొని దొంగ వెధవలు రోజూ కాయలు కాజేసేవాళ్లు. దాంతో పాపం రుక్కయ్యకు వ్యాపారంలో పైసా మిగలక పోగా అప్పులు పెరిగిపోయాయి. వడ్డీలు పేరుకుపోయాయి. అందుకే ఏ దిక్కూ లేని రుక్కయ్య నెత్తిన గుడ్డ వేసుకొని పట్నం పోయ్యాడు. సంక్రాంతి సెలవులు ఇస్తారు. గోపి వాళ్ళ మామయ్య ఇంటికి వెళ్తాడు. తన పుట్టిన రోజు కావడంతో గోపి తండ్రి బట్టలు కొనుక్కోవడానికి 250 రూపాయలు పంపుతాడు. వాటికి 50 రూపాయలు

జోడించి బట్టలు కొనుక్కోమని ఇస్తాడు. మామయ్య, గోపి ఇద్దరూ కలిసి బట్టలు కొనుక్కోవడానికి వెళ్తారు. బస్ స్టాప్‌లో బస్సు కోసం నిలబడి ఉంటారు.

ఇంతలో గోపి పక్క నుండి ధర్మ చేయండి బాబూ అంటూ ఒక గొంతు వినిపిస్తుంది. ఆ గొంతు ఎక్కడో విన్నట్టు అనిపిస్తుంది గోపికి తిరిగి చూస్తే అడుక్కుంటూ కనిపిస్తాడు రుక్కయ్య. గోపికి కడుపులో తిప్పినట్టు అవుతుంది. చెమటలు పడతాయి. బాధ పడతాడు. తేరుకొని ఒక నిర్ణయానికి వస్తాడు. తన జేబులో నుండి డబ్బులు తీసి, రుక్కయ్య గిన్నెలో వేసేసి వస్తాడు. ఏమైంది అని అడుగుతాడు లాలనగా. కళ్ళ నుండి ధారగా పడుతున్న కన్నీళ్లను తుడుచుకుంటూ పొల్లు పోకుండా అంతా చెబుతాడు. అంతా విన్న సారథికి ఆనందం కలుగుతుంది. గోపి చేసిన పనికి మెచ్చుకుంటాడు.'' ఈ కథలో రావుగారి చక్కని సహజత్వం, రచయితగా ఆయనకున్న అనుభవం, చిన్న పిల్లల మనస్తత్వం అర్థం చేసుకునే నేర్పరితనం కనిపిస్తాయి. కథలో చిన్న చిన్న వ్యాపారుల దైన్యమైన జీవితాన్ని వర్ణించిన విధానం తీరు కరుణ రసాత్మకంగా పాఠకుల హృదయాలను కట్టి పడేస్తుంది.

### 3. నెత్తుటి సూరీడు

ఈ కథ విషాదాంత కథ. తాగుబోతు తండ్రికి తెలియకుండా రిక్షా తొక్కుతూ సంపాదించుకొనే అబ్బాయి ప్రమాదానికి గురై, ప్రాణాలు కోల్పోయిన ఒక పిల్లవాడి కథ. ''యాదయ్యకు 12ఏళ్ళు ఉంటాయి. తండ్రి రిక్షా తొక్కుతూ వచ్చిన డబ్బులను తాగేస్తూ కుటుంబం పట్ల బాధ్యత లేకుండా ప్రవర్తిస్తాడు. పొట్ట చేత పట్టుకొని పట్నం వచ్చిన వారి కుటుంబం ఒక మురికివాడలోని గుడిసెలో కాపురముంటారు. యాదయ్య రిక్షా తొక్కి సంపాదించిన డబ్బులతో తనకు కావలసినవి కొనుక్కొని మిగిలినవి తల్లికి ఇస్తుండేవాడు. ఒకరోజు ఎప్పటిలాగే తండ్రి పడుకున్నాక రిక్షా తీస్తాడు యాదయ్య. పది రూపాయలైె సంపాదించాలి.

అయిదు రూపాయిలు వాళ్ళ అమ్మకు ఇచ్చి, మిగలిన 5 రూపాయలతో బొబ్బిలి రాజా సినిమాకి వెళ్ళాలని అతని టార్గెట్. కానీ, ముగ్గురిని ఎక్కించుకొని 6 రూపాయలు సంపాదిస్తాడు. ఇంకా నాలుగు రూపాయలు కావాల్సి ఉండడంతో చివరిగా ఒకరిని ఎక్కించుకుంటాడు. ఓవైపు వాళ్ళ నాన్న లేచే సమయం అవుతంది. ఆ హడావుడిలో వెళ్తూ ప్రమాదానికి గురై చనిపోతాడు.'' పేదరికం ఒకవైపు, వ్యసన పరుడైన తండ్రి ఒక వైపు కుటుంబాన్ని ఆర్థికంగా క్రుంగదీయడం మన

సమాజంలో ప్రతిచోట కనిపించే విషయమే. దానిని కథగా మలిచి, మనసుకు హత్తుకునేలా రాశారు రచయిత ప్రాణ్ రావు. ఇలా సమాజంలో జరుగుతున్న కొన్ని ముఖ్యమైన సంఘటలను తీసుకుని, కథలుగా మలచడంలో ప్రాణ్‌రావు మంచి నేర్పరి.

## ముగింపు:

'చెలిమి కథలు' అనే సంపుటిలో ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు పిల్లలకు సులభంగా అర్థయయ్యే భాషలో వారి మనస్తత్వం, స్నేహం, ఉన్నత విలువలతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తూ, చక్కని కథలు రాశారు. ఇలాంటి కథలు, రచనలు నేటి పిల్లలకు సాంఘికంగా, నైతికంగా ఎంతగానో ఉపయోగపడతాయని అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. నేడు బాలల వ్యక్తిత్వ వికాసానికి అవసరమయ్యే మరింత సాహిత్యం రావాల్సిన అవసరమైన ఎంతైనా ఉంది. కథలు, గేయాలు, కవితలు, వ్యాసాలు, కార్టూన్లు ఇలా ఏ రూపంలో వచ్చినా సరే, బాల సాహిత్యాన్ని సుసంపన్నం చేయాల్సిన బాధ్యత కవులు, రచయితలపై ఉంది. పిల్లల శ్రేయస్సు కోరి ఎన్ని మంచి పుస్తకాలు వచ్చినా – మానవత్వం, పరోపకారం, పెద్దలను గౌరవించడం వంటి విషయాలు చెబుతూనే మిగతావాటిపైనా వారి అవగాహనకు తగిన రీతిలో చెప్పాలి. అప్పుడే సమాజానికి మంచి బాల సాహిత్యం ఇచ్చినట్లవుతుంది.

## ఆధార గ్రంథాలు:


1. తెలుగు బాల గేయ సాహిత్యం – డా.యం.కె.దేవకి
2. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) – డాక్టర్. జి. నాగయ్య
3. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా. శాస్త్రి
4. చెలిమి కథలు – ఎస్.ఎమ్.ప్రాణ్ రావు

# తెలుగు పద్యసౌరభం



డా. NCh.చక్రవర్తి
✆ 91822 76862

తరతరాల తెలుగు పద్యం సుగంధాలను మనం ఆస్వాదిస్తున్నాం. తెలుగు పద్యం భాషకి మకుటాయమానమై వెలుగుతూ మాట ఉన్నంత వరకూ మనుతుంది అనడంలో సందేహం లేదు. మనుచరిత్రలో ఒక పద్యం:

ఉత్పల.

యౌవనమందు యజ్వయు ధనాఢ్యుడునై కమనీయ కౌతుక
శ్రీ విధి గూకటుల్ గొలిచి చేసిన కూరిమి సోమిదమ్మ సౌ
ఖ్యావహయై భజింప, సుఖులై తలిదండ్రులు గూడి దేవియున్
దేవరవోలె నుండి యిలు దీర్పగ గాపురమొప్పు వానికిన్(1)

కుటుంబం ఎలా ఉండాలో ఎలా ఉండేదో పెద్దన తన మనుచరిత్ర లో వర్ణించాడు. ప్రవరుని కుటుంబం. అతడు యజ్ఞంచేసినవాడు. ధనాఢ్యుడు. కమనీయమైన ఈడూ జోడు యవ్వన సంపదను చూసి ప్రేమతో కూడిన సోమిదమ్మ (భార్య). ఆమె సౌఖ్యాన్ని కలిగిస్తూ సేవిస్తూ ఉండగా అతడి తల్లిదండ్రులు సుఖంగా దేవియున్ దేవర వోలె అంటే పార్వతీ పరమేశ్వరులలాగా ఇంటిని చక్కదిద్దుతూ ఉండగా కాపురం చక్కగా సాగుతున్నది అని.

ఇక్కడ కూకటుల్ కొలిచి చేసిన కూరిమి సోమిదమ్మ అంటే అర్థం మొదళ్ళు మూలాలూ చూసి చేసినది అని. ఏమిటి ఈ మూలాలు అంటే అది భారతీయ వైవాహిక వ్యవస్థలోని ఒక మర్మం. ఏడు తరాలు అటూ ఇటూ చూడాలి అంటారు పెద్దలు. అలాగ ఆమె వంశ మూలాలు చూసి చేసారు అని. ఇది ఇతర సంస్కృతులలో లేనిది. మన సంస్కృతీ వైభవాన్ని చాటేది. అందుకే ఆ కాలంలో వివాహాలు

సమాజప్రతిష్టతకు మూలకంబాలుగా ఉండేవి. కుటుంబాన్ని ఉద్ధరిస్తూ ఆదర్శ సమాజ నిర్మాణాన్ని చేసేవి. ఈ కాలంతోజ్ పోలిక లేదు.ఈ ఒక్క పద్యంలో చెప్పుకోదగిన విశేషాలను ఎన్నో ధ్వనింపచేసాడు పెద్దన. అది ఒక కవితానిర్మాణ చాతుర్యం.

***

"కవిసమ్రాట్" విశ్వనాథ సత్యనారాయణ గారి రామాయణకల్పవృక్షం లో ఒక ఆణిముత్యాన్ని చూద్దాం.

సీ.

ప్రభుమేనిపై గాలి పై వచ్చినంతనే
పాషాణ మొకటికి స్పర్శవచ్చె,
ప్రభు కాలిసవ్వడి ప్రాంతమైనంతనే
శిలకొక్కదానికి చెవులు కలిగె,
ప్రభు మేని నెత్తావి పరిమళించిన తోన
యశ్మంబు ఘ్రాణేంద్రియంబు జెందె,
ప్రభు నీలరత్న తోరణ మంజులాంగంబు
కనవచ్చి రాతికి కనులు కలిగె,

గీ.

ఆ ప్రభుండు వచ్చి యాతిథ్యమును స్వీక
రించునంత నుపలహృదయవీథి
నుపనిషద్వితానమొలికి శ్రీరామభ
ద్రాభిరామమూర్తి యగుట దోచె.(2)

శ్రీరాముడు గౌతముని ఆశ్రమాన్ని చేరుకుంటున్నాడు. అహల్యకు రూపం వచ్చే సందర్భం. రాముని ఒంటిపైనుండి వచ్చే గాలి సోకగానే రాయికి స్పర్శ వచ్చింది. (పాషాణము అంటే శిల) రాముని పాదాల అలికిడి ఆ ప్రాంతం రాగానే శిలకు చెవులు వచ్చాయి..రాముని ఒంటి పరిమళం తాకగానే అశ్మానికి అంటే శిలకు వాసన వచ్చింది. రాముని నీలరత్నపు రంగుకు చూడడానికా అన్నట్టు ఆ రాతికి కనులు వచ్చాయి.రాముడు వచ్చి ఆతిథ్యాన్ని స్వీకరించాడు. ఆతడు సర్వ ఉపనిషత్తుల సమూహ సారం. ఇందులో అద్భుత భావన. సాక్షాత్తూ నారాయణ స్వరూపుడు కనుక సమస్త ఉపనిషత్తుల సారం అతడు అని ధ్వని. శిలగా పడిఉన్న అహల్యకు ఒక్కొక్కటిగా పంచేంద్రియాలు పనిచేసాయి.పంచ

భూతాత్మకం ఈ తనువు. శబ్ద స్పర్శ రూప రస గంధాదులు పంచేంద్రియాలకు సంబంధించినవి. అంటే పంచభూతాలకు అధిపతి దైవస్వరూపుడు అయిన శ్రీరామచంద్రుడు అని చెప్పడం. ఆ క్రమంలో మొత్తంగా అహల్య తన రూపాన్ని తిరిగి ధరించింది.అహల్యా శాప విమోచనం అనే సామాన్య విషయంతో పాటు శ్రీరాముని దైవత్వం విశేషంగా చెప్పడం ఇందులో ప్రధానం. ఈ క్రమంలో ఆ ఘట్టాన్ని వర్ణన చెయ్యడం అద్భుత కల్పన.

****

శతకపద్యాలలోకి వస్తే మారదవెంకయ్య రచించిన భాస్కర శతకంలోని ఒకపద్యాన్ని అవలోకిద్దాం.

ఉత్పల.

దక్షుడులేని యింటికి పదార్థము వేరొకచోటనుండి వే
లక్షలు వచ్చుచుండిన బలాయనమైచను గల్లగాదు ప్ర
త్యక్షము వాగులున్ వరదలన్నియు వచ్చిన నీరు నిల్చునే
యక్షయమైన గండి తెగినట్టి తటాకములోన భాస్కరా! (3)

కుటుంబానికి సమర్థుడైన యజమాని లేకపోతే ఎక్కడెక్కడి నుండి లక్షలు లక్షలు వచ్చినా అదీ వ్యర్థం అయిపోతుంది. ఆ సొత్తు ఇంట్లో నిలువదు. చెల్లాచెదురైపోతుంది. ఇది మనం ప్రత్యక్షంగా చూస్తున్నదే. గట్టుతెగిన చెరువులోకి వరదలై వెల్లువై నీరు వచ్చినా ఆ నీరు నిలువదు కదా! పైపెచ్చు వ్యర్థంగా పోతుంది కదా!

ప్రకృతి సిద్ధంగా జరిగే విషయాన్ని మన జీవితానికి అన్వయించి చెప్పడం మన శతకకవుల నైపుణ్యం. అద్భుత పరిశీలన. కవిత్వ దక్షత.ఇలాంటివి వేలుగా మన సాహిత్యంలో ఉన్నాయి.

***

ఈ మారు మనం ఎంచుకునే తేలిక పద్యాలలో ఆధునిక శతకం అయిన శతకవనం నుండి ఒక పద్యాన్ని చూద్దాం.

తేగీ.

ఎంచి కులమును విద్య బోధించుటెల్ల
బ్రకృతి తత్త్వములకు నతిక్రమణ మగును
నదికి, చెట్టుకు లేదిట్టి నాసిబుద్ది
యెదను గదలించు మాటజెప్పెదను వినుము.(4)

రంగు, రుచి, వాసన చూసి ప్రకృతి సేవ చెయ్యదు. నరుడు కులాన్ని చూసి విద్యను బోధించడం అన్నది ప్రకృతికి విరుద్ధమైన స్వభావం. అది ప్రకృతిని అతిక్రమించడం. రాజుకు, బంటుకు చెట్టు గాలిని అందిస్తుంది. ధనికి, పేదకు నది ఒకేలాగా నీరు అందిస్తుంది. వీటిని చూసి మనం నేర్చుకోవాలి. మానవీయగుణం వికసించాలి. అని కవి ప్రబోధం.

మరిన్ని విషయాలను మరల తెలుసుకుందాం.

సూచికలు:

1. పెద్దన మనుచరిత్రలో ప్రథమాశ్వాసము - పద్యం 53.
2. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి శ్రీమద్రామాయణ కల్పవృక్షం లో అహల్యా శాపవిమోచన ఘట్టం.
3. మారదవెంకయ్య రచన భాస్కరశతకం లో పద్యం 53. హిందూధర్మ ప్రచారసమితి తిరుమల వారి ప్రచురణ 2015.
4. ఎస్. సి హెచ్. చక్రవర్తి రచన శతకవనంలో విరి 63. స్వీయ ప్రచురణ.

**ఉపమింప మొదలు తియ్యన**
**కపటం బెడనెడను జెఱకు కై వడినే పో**
**నెపములు వెదకును గడపట**
**గపటపు దుర్జాతి పొందు గదరా సుమతీ.**

కథ

# నిమిత్తమాత్రులు



శ్రీ ప్రతాప్ రాజులపల్లి
976 98 55645

ప్రొద్దున దిన పత్రిక లన్నింటిలోనూ పెద్ద, పెద్ద అక్షరాల్లో హెడ్ లైన్స్. “హేతు వాది, దళిత సాహితి సత్యాన్వేషి దారుణ హత్య”. “నాస్తిక నాయకుడిక నాస్తి”, “తీవ్ర మతవాద కుడి పక్షాల పై అనుమానం” వగైరా, వగైరా. కానీ నన్ను ఆకర్షించిన వార్తే వేరు.” హతుడి నాస్తిక స్నేహితుడు ప్రత్యక్ష సాక్షి ; పారిపోతున్న దుండగులను అతడు గుర్తు పట్టగలడు; బైక్ నెంబర్ కూడా చూశాడు; అతడు వర్ణించిన ఆనవాళ్ళతో పోలీసులు దుండగుల స్కెచ్ లను కూడా వేయించారు. ఆ న్యూస్ బాస్ కు చూపెట్టాను. చదువుతూ బిగ్గరగా నవ్వసాగాడు బాస్. అది చూసి దిగ్భ్రాంతి, అసహనం నాకు; అదేం నవ్వాల్సిన విషయమా? బాస్ తన కిష్టమైన ‘రం’ బాటిల్ ఓపెన్ జేసి రెండు గ్లాసుల్లో పోసి, సోడా కలిపాడు. ఒక్క గుక్కలో గ్లాసు ఖాళీ జేసి, సిగరెట్ వెలిగించి, టి.వి ఆన్ చేశాడు.

దాదాపు అన్ని ఛానెళ్ళు అదే హత్యకు సంబంధించిన వివరాలను ప్రముఖంగా చూపిస్తున్నాయి. రాష్ట్ర గృహ మంత్రి హతుడు సత్యాన్వేషి ని విపరీతంగా పొగుడుతున్నాడు. మూఢ నమ్మకాలు, అస్పృశ్యత, కుల వ్యవస్థ, దేవుడి పేరుతొ సంఘం లో జరిగే ఎన్నో అన్యాయాలను ఎదిరించి, పోరాడిన ధీరుడు ఇత్యాది, ఇత్యాది..” హతుడి



సెక్యురిటీని ఎందుకు తీసేశారన్న" ఓ విలేఖరి సూటి ప్రశ్నకు "ప్రభుత్వం ఎంత హెచ్చరించినా, ఆయనే పట్టుబట్టి తీసేయమన్నారని" చట్టని బదులిచ్చారు మంత్రి వర్యులు.

"బ్రేకింగ్ న్యూస్అం" టూ టి.వి. ఛానెల్స్ బైక్ నెంబర్ ను, దుండగుల స్కెచ్ లని మరీ, మరీ చూపిస్తున్నాయ్. ఆశ్చర్యమేసింది నాకు.

అసమ్మతి ని కేవలం హత్యతో నే నిర్మూలించగలమని నమ్మే సాంఘిక విద్రోహ శక్తుల పిరికి తనాన్ని తీవ్రంగా దుయ్య బట్టారు స్థానిక మఠాధిపతి స్వామీజీ. నాస్తికుడూ, హేతు వాద సాహితీ అయిన హతుడితో తమకు అభిప్రాయ భేదాలు, కేవలం ఇద్దరు మంచి స్నేహితుల మధ్య సైద్ధాంతిక ఆలోచనా భిన్నతే అని, తాము పరస్పరం గౌరవ భావం కలవారమని స్వామీజీ స్పష్టం జేశారు. నేరస్థులు ఎంతటి వారైనా సరే పట్టుకొని తగిన శిక్ష విధించాలని రాష్ట్ర ప్రభుత్వానికి మనవి చేశారు. సంతాపం వెలిబుచ్చే సమయం లో స్వామీజీ కళ్ళు చెమ్మగిల్లాయ్.

"బ్రేకింగ్ న్యూస్" అంటూ టి.వి. ఛానెల్స్ బైక్ నెంబర్ ను, దుండగుల స్కెచ్ లని మరీ, మరీ చూపిస్తున్నాయ్. ఆశ్చర్యమేసింది నాకు.

ఓ భక్తుడు "ఇదంతా 'వాడి' మహిమే, దేవుణ్ణుంచి ఎవరూ తప్పించుకోలేరు" అని చెబుతున్నాడు. నాస్తికుడు చంపబడింది, దుష్ట శిక్షణార్థం స్వామిజీ చేయిస్తున్న శాంతి హోమపు కడ పటి రోజైన 9 వ రోజునే అని గుర్తు చేశాడతడు."ఇది కాకతాళీయం కాదు. ప్రారబ్ధాన్ని ఎవ్వరూ మార్చలేరు" అని కూడా అన్నాడతడు. సత్యాన్వేషి రచనలను, సిద్ధాంతాలను, ఉపన్యాసాలను ధిక్కరిస్తూ ప్రదర్శనలు చేసిన కొంత మందిని పోలీసులు అరెస్ట్ చేశారని, స్కెచ్ ల లో వున్న వ్యక్తులు వారేనని టి.వి ఛానెల్స్ ప్రసారం చేశాయ్. హతుడి అంతిమ సంస్కారం కంటే ముందుగా, అత్యంత వేగంగా, చురుగ్గా దర్యాప్తు చేసి హంతకులను అరెస్ట్ చేసినందుకు హోం మంత్రి, ఇతరులూ పోలీసులను అభినందించారు. అది ఎలా సాధ్యమయిందా అని నాకు ఆశ్చర్యం. చూస్తూ, చూస్తూ నాకు ముందు రోజుల సంఘటనలు జ్ఞప్తి కొచ్చాయ్.

సుసంపన్నమైన ధార్మిక పరంపరను కాపాడే ఆస్తికుల ఊరేగింపుకు నాయకత్వం వహించి ముందుకు నడిపిన స్వామీజీ పైనే అన్ని టి.వి ఛానెల్స్

దృష్టి పెట్టాయ్. క్రొద్ది రోజుల క్రితం బాస్ తో పాటి ఎదురుగా కలిసినప్పటికంటే, టి.వి లోనే స్వామీజీ నాకు స్పష్టంగా కనిపించారు.

> స్వామీజీ వ్యాఖ్యానానికి జనం ఉత్సాహంగా చప్పట్లు గొట్టారు. వేదికపైనున్న మతాధిపతులు సైతం సమ్మతిగా తలలు వూపారు.

ఊరేగింపు తరువాయ్ బహిరంగ సభలో, కొందరు అరాజక వాదులు ఆధార రహితమైన సిద్ధాంతాలతో మన దేశపు ఏకశిలా సదృశమైన, మొక్క వోని మతాన్ని, ఎలా ఛిన్నా భిన్నం చేయాలని కుట్రలు పన్నుతున్నారో స్వామీజీ ఎండ గట్టారు. దేవుడి ఉనికినే ప్రశ్నించే నాస్తికుల్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. వేదిక పై రాష్ట్రపు ప్రభుత్వపు హోం మంత్రి గారు, స్వామీజీ మతానికి చెందిన ఇతర గురువులు ఒక వైపు, అన్య మతాధికారులు, మత గురువులు మరో వైపు కూర్చొని వున్నారు. సభ భక్తులతో, అనుయాయుల తో క్రిక్కిరిసి పోయింది.

అందులో కొందరు "సత్యాన్వేషి నశించాలి," "సంఘానికి చీడ పురుగు సత్యాన్వేషి" "ధిక్కారం, ధిక్కారం... నాస్తికులకు ధిక్కారం", " లాంగ్ లీవ్ ది రిలిజియన్" అని వ్రాసి వున్న ఫ్లెక్సి బ్యానర్ లను పట్టుకొని వున్నారు.

మన అమూల్యమైన సాంప్రదాయ వారసత్వాన్ని, వర్ణాశ్రమ ధర్మాన్ని, పవిత్ర పూజా పునస్కారాది సంస్కారాల్ని మరింత శ్రద్ధతో ఆచరించాలని ప్రజలకు స్వామీజీ వినమ్రంగా విజ్ఞప్తి చేశారు. "యధా కన్దుకపాతే నో త్పత త్యార్యః పతన్నపి, తధా త్వనార్యః వతతి మృత్పిణ్డపతనం యధా" – స్వామీజీ ఆశువుగా భర్తృహరి సుభాషితాన్ని ఉల్లేఖించి, వెంటనే అర్థం వివరించారు (ఆస్తికుడు మాత్రమే ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా బంతి లాగా లేవగలడు; నాస్తికుడు మట్టి కరుస్తాడు). స్వామీజీ వ్యాఖ్యానానికి జనం ఉత్సాహంగా చప్పట్లు గొట్టారు. వేదిక పైనున్న మతాధిపతులు సైతం సమ్మతిగా తలలు వూపారు. స్వామీజీ రెచ్చిపోయారు.

"అలాంటి దుశ్శక్తుల నుండి సంఘాన్ని రక్షించేందుకు, గత ఎనిమిది రోజులుగా మేము శాంతి హోమాన్ని ప్రారంభించాం.. 9 వ రోజున ఆ ద్రోహ శక్తులను పవిత్ర హోమాగ్ని లో సాంకేతికంగా దహనం చేస్తాం. 'వినాశయచ దుష్కృతాం' దేవుడు ఎలాగైనా వారిని శిక్షించక మానడు. ఆ రోజు ఎంతో

దూరం లో లేదు. అలా అని మనం దేవుణ్ణి వేడుకుందాం".

స్వామీజీ దేవుణ్ణి వేడుకుందాం అన్నారో, వాడుకుందాం అన్నారో నేను తికమక బడ్డాను. హర్షధ్వానాల మధ్య స్వామీజీ ఉపన్యాసం ముగిసింది.

ఆ రోజు రాత్రి టౌన్ చాలా ఉద్రిక్తంగా వుండింది. పోలీస్ పెట్రోలింగ్ కూడా చురుగ్గానే వున్నింది.

"నో, యు ఆర్ రాంగ్"- అరిచినంత పని చేశాడు. తాగి నప్పుడు ఇంగ్లీష్ కాస్త ఎక్కువే మాట్లాడతాడు మా వాడు.

బిగ్గరగా అరుస్తున్న బాస్ అరుపుల తో వర్తమానం లోకి వచ్చేశాను నేను.

"హే! గాడ్ ఈజ్ గ్రేట్. మతం మహోన్నత మైంది. అధికార దాహం, అవకాశవాదం మాంఛి ఉత్ప్రేరకాలు.... వ్యాపారం మూడు పువ్వులూ ఆరు కాయలూ. మరింత మంది సత్యాన్వేషులు కావాలి సంఘానికి "– బిగ్గరగా కేకలేశాడు బాస్, మరో గ్లాస్ 'రం' ఖాళీ జేసి.

"మహా భారతం లో కర్ణుణ్ణి ఎవరు చంపారు? హుం??"– బాస్ ప్రశ్న. మాటలు కాస్త ముద్ద, ముద్ద గా వస్తున్నాయ్.

నాకు కాస్త విసుగేసింది; నేనేం మూర్ఖున్నా? విసుగును అణచుకుంటూ "అర్జునుడు" అంటూ బదులు చెప్పాను.

"నో, యు ఆర్ రాంగ్"–అరిచినంత పని చేశాడు. తాగి నప్పుడు ఇంగ్లీష్ కాస్త ఎక్కువే మాట్లాడతాడు మా వాడు. "ఐదుగురో, ఆరుగురో– వేరే, వేరే భారతాల్లో వేరే, వేరే నెంబర్.. పరశురాముడు, ఇంద్రుడు, కుంతి, శల్యుడు, కృష్ణుడు, మరి చివ్ వ్ వ్వార్న అర్జునుడు"– దీర్ఘం తీసాడు బాస్. మరి ఈ కేసు లో ముగ్గురే "– భావ గర్భితంగా నవ్వాడు అంతా తనకే తెలుసు అన్నట్లు. కైపు ఎక్కిన తర్వాత అందరూ మహా జ్ఞానులే మరి !!

"ముగ్గురా?" – ఈ సారి నేను అవాక్కయాను

"తన తెర వెనుక భాగోతాలను బహిరంగంగా దుయ్యబడుతున్న నాస్తికుని తొలగించడానికి తన ఆస్తిక ధర్మాన్ని, మతాన్ని ఆయుధంగా వాడుకొని, మఠంలో తన ప్రత్యర్థుల పై రాజకీయ ఆధికృత, మఠం ఫండ్స్, అధికారాలపై

ఆజమాయిషీ బలవత్తరం చేసికోవడానికి స్వామీ జీ; .... హేతువాద సంఘపు అధ్యక్ష పదవికై రాబందులా కాచుకు కూర్చున్న అసూయాపరుడు తోటి మిత్రుడు – అఫ్ కోర్సు, టార్గెట్ మిస్ కాకుండా మార్నింగ్ వాక్ పేరుతో సత్యాన్వేషే తలుపు తెరిచేలా, సోషల్ మీడియా నుండి ఐడెంటిఫై చేసికొన్నకొంత మంది 'రియాక్షనరీ' వ్యక్తులను కేసు లో ఇరికించి, అసలు దోషులను తప్పించేలా – ఆ మిత్రుడు హోం వర్క్ బాగా చేశాడు. సత్యాన్వేషి తలుపు తెరువక పోతే, మొత్తం ప్లాన్ 'హుష్ కాకి.' యధా ప్రకారంగా మార్నింగ్ వాక్ కి తన మిత్రుడే వచ్చాడని పాపం.... "– అదో రకంగా చేయి పైకి ఊపాడు బాస్.

> **బాస్ ను బైక్ లో వెనుక కూర్చోబెట్టుకుని, తెల్లవారు జామున 5.30 కల్లా చేరాల్సిన అడ్రస్ కి చేరి పోయాను. బాస్ జేబులో రివాల్వర్ వుంది.**

వేలును కాల్చిన సిగరెట్ నేల రాచి, ఇంకాస్త 'రం' దట్టించి కొన సాగించాడు. నాలుక మందమైంది; మాటలు తడ, బడుతున్నాయ్. ళ, ల లు స, శ, ష లు అన్నీ ఒకే లాగ పలుకుతున్నాడు. మహా ప్రాణాలను మింగేస్తున్నాడు.

" ఓమ్ మంత్రి, సత్యాన్వేషి ఒకే కులం వాల్లు. ఆ కులం యువకుల్లో తన రాడికల్ సిద్ధాంతాలతో పరపతిని, ప్రాముక్యాన్ని పెంచుకోసాగాడు సత్యా. పెరిగే వీడి ప్రాచుర్యంతో తన కులపు వోట్ బ్యాంకు చీలితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెల వడమే కష్టమవుతుంది, మంత్రి పదవీ పోతుంది. పోయిన సారే అంతంత మెజారిటీ. అందుకే సెక్యూరిటీ తీసి వేయించి, పని సుగమం చేశాడు ఓమ్ మంత్రి."

"వాల్లందరూ, వాల్ల, వాల్ల కోశమే ఈ పని చేషారు. దేవుడు, మతం, కులం అన్నీ కుంటి శాకులు. ఏమైతేనేం, ఒక్క కూనీ, ముగ్గురి ముడుపులు.... జాక్ పాట్. చిన్న టౌన్ లో గురి తప్పకుండా కాల్చేరౌడీ కి పెద్ద అడ్వాంటేజ్..హ, హ, హా " బిగ్గరగా నవ్వడం మొదలెట్టాడు – తనను తాను అదుపు లో పెట్టుకోలేక పోతున్నాడు. క్రితం రోజు జరిగిందంతా నా కళ్ళ ముందు కదిలింది.

బాస్ ను బైక్ లో వెనుక కూర్చోబెట్టుకుని, తెల్లవారు జామున 5.30 కల్లా చేరాల్సిన అడ్రస్ కి చేరి పోయాను. బాస్ జేబులో రివాల్వర్ వుంది. టౌన్ ఇంకా నిద్ర మత్తు లో వుంది. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. ఎడమ వైపు వున్న– వెళ్ళాల్సిన

> "నో, యు ఆర్ రాంగ్"- అరిచినంత పని చేశాడు. తాగినప్పుడు ఇంగ్లీష్ కాస్త ఎక్కువే మాట్లాడతాడు మా వాడు.

ఇంటికి కాస్త ముందుగా రోడ్డుకు మరీ ఎడమ గా బైక్ ఆపాను. ఇంజిన్ ఆన్ లోనే వున్నా, శబ్దం మంద్ర స్థాయి లో ఉంది. చుట్టు ప్రక్కల పోలీసులెవరూ లేక పోవడం కాసింత ఆశ్చర్యం కలిగించింది. రోడ్డుకు కాస్త దూరంగా ఇల్లు చాలా మామూలుగా వుంది. ఇంటి కి ముందు వైపు కాస్త స్థలం, దాని చుట్టూ ప్రహరీ గోడ. గోడ గేటు కొద్దిగా తెరిచే వుంది. బాస్ బైక్ దిగాడు. రోడ్డుకు అటూ, ఇటూ చూశాడు. నడుచుకు వెళ్లి, గేటు దాటి, తలుపు వైపు వెళుతున్నాడు. నేను కళ్ళప్పగించి చూస్తున్నాను. టైం అవుతోందని తెలుసు. ఏదో తెలియని అసహనం. ఊపిరి బిగపట్టి నాలో నేనే ఎంచడం మొదలెట్టాను.

"టెన్, నైన్ , ఎయిట్, సెవెన్ ..." కుడి చేత్తో రివాల్వర్ పట్టుకొని , డోర్ బెల్ రింగ్ చేశాడు బాస్.

.."సిక్స్, ఫైవ్, ఫోర్, త్రీ ...." నా కనుల కొనలలో ఎవరో అపరిచితుడు గేటు వైపు వెళుతూ కన్పించాడు.

"ఓహ్, గాష్ !

....టూ, వన్". ఓ మధ్య వయస్కుడు ఇంటి తలుపు తెరిచాడు.

"ఢడ్, ఢడ్, ఢడ్"– పాయింట్ బ్లాంక్ రేంజ్ లో మూడు బులెట్లు అతడి గుండెల్లోకి దించేసి, నా వైపు పరిగెత్తుకొస్తూ బాస్ గేటు వైపు వస్తున్న అపరిచితున్ని ఢీ కొట్టడంతో అతడు క్రింద పడి అరవడం మొదలెట్టాడు– "పట్టుకోండి, పట్టుకోండి"–అని. అయితే, చుట్టూ ప్రక్కల ఎవరూ లేరు.

"పద, పద", నా వెనుక లంఘించి కూచుంటూ అరిచాడు, బాస్. వున్న ఫళంగా ఆక్సిలిరేటర్ ఇస్తూ, బైక్ ముందుకి దూకించి, వేగంగా స్టేట్ హైవే వైపు దూసుకు వెళ్లి, కొద్ది దూరం తరువాత ప్రక్కనే వున్నఅడవిలోకి తిప్పి, మమ్మల్నెవరూ వెంటాడడం లేదని ఖచిత పరచుకొని పొద్దెక్కే లోగా మా స్థావరాని కి మేము చేరుకున్నాం. రాత్రంతా బాస్ అప్పటికే ముట్టిన నోట్ల కట్టలను లెక్కెడుతూ త్రాగుతూనే వున్నాడు;

మధ్య, మధ్య లో "అచ్చొచ్చిన నెల", " మతం, అధికారం – వీటిని మించిన పెద్ద వ్యాపారం ఏదీ లేదు" అంటూ బిగ్గరగా నవ్వడం మొదలెట్టాడు. గది నిండా సిగరెట్ పొగ. అప్పటికే నేను కూడా రెండు క్వార్టర్ లు మందు, ఓ పెద్ద బిరియాని పొట్లం కాజేశాను–నోట్ల వైపు ఆశ గా చూస్తూ, తెలియకుండా అలాగే నిద్రలోకి జారి పోయాను.

మరీ ఈ రోజుల్లో రాజకీయ నాయకులను, స్వామిజీలను అనవసరంగా విమర్శించడం పాసన్ అయిపోయింది.

ఇంతలో బాస్ సెల్ మ్రోగడం తో మళ్ళీ వర్తమానం లోకి వచ్చేశాను నేను.

బాస్ నాకందించాడు ఫోన్. సెల్ లో కాలర్ పేరు "స్వామీజీ" అని డిస్ ప్లే అవుతోంది.

నేను రిసీవ్ చేసికున్నాను. ఫోన్ లో స్వామీజీ శిష్యుడు; "బాస్ నిద్రబోతున్నాడ" ని అబద్ధం చెప్పాను.

మరుసటి రోజు వచ్చి స్వామీజీని చూడమని, తదుపరి పని, తగిన పారితోషికం అప్పగిస్తారని ఆయన మాటల సారాంశం.

టి.వి ఛానెల్ అంతిమ సంస్కారానికి వెళుతున్న శవయాత్ర పై కేంద్రీకరించింది. నేపథ్యంలో భగవద్గీత, తెలుగు వ్యాఖ్యానం వినిపిస్తున్నాయ్.

"య ఏనం వేత్తి హన్తారం యశ్చైనం మన్యతే హతం । ఉభౌ తౌ న విజానీతో నాయం హన్తి న హన్యతే"

("జీవుడు చంపాడని లేదా చంపబడినాడని తలచు వారు జ్ఞాన రహితులు. ఆత్మ చావదు; చంపబడదు)

"హే, హ, హ.... బగవంతునికి మటుకు వాక్ శ్వాతంత్ర్యం వుంది. ... ఆయన ఏం కావాలంటే, అది సెప్పొచ్చు. నిజమే! మరీ ఈ రోజుల్లో రాజకీయనాయకులను, స్వామిజీలను అనవసరంగా విమర్శించడం పాసన్ అయిపోయింది. ఎవరు ఎవర్ని సంపగలరు? పోలీసోల్లు, కూనీ చేయించినోల్లు, మనం .......అందరం .....అందరం ------ మన మందరం నిమిత్త మాత్తర్లం" తప్ప తాగిన మత్తు లోనవ్వుకుంటూ, గొణుగుతూ చప్పట్లు కొట్టబోయి, వాలి పోయాడు బాస్.

## శాస్త్ర ప్రకాశిక

# 2023 సంవత్సరం వైద్యవిభాగపు నోబెల్ పొందిన పరిశోధనాంశం: mRNA వాక్సినేషన్ సాంకేతికతను అభివృద్ధి పరచిన పరిశోధన.



డాక్టర్ చాగంటి కృష్ణ కుమారి
✆ 98851 63304

వైద్యవిభాగానికి చెందిన 2023 సంవత్సరపు నోబెల్ పురస్కారం హంగేరికి చెందిన జీవరసాయన శాస్త్రవేత్త కటలిన్ కారికో, యుస్ వైద్య పరిశోధకుడు, రోగనిరోధక శాస్త్రవేత్త (Immunologist) డ్రూ వైస్మన్ లకు లభించింది. కోవిడ్–19 మహమ్మారి ని ఎదుర్కొన గలిగే mRNA వాక్సినేషన్ సాంకేతిక పద్దతిని అభివృద్ధి చేసినందుకు వారికి ఈ బహుమతి దక్కింది.




Photo Credit: Peggy Peterson Photography for Penn Medicine

## mRNA వాక్సినేషన్ సాంకేతికత, దాని ప్రాముఖ్యత

వేక్సినేషన్ ఒకానొక రోగకారకానికి ప్రతిస్పందించి శరీరపు రోగనిరోధక శక్తిని ఉద్దీపనం చెందించడం వల్ల, ఆతరువాతి కాలంలో ఆ రోగ కారకం శరీరంలో ప్రవేశించినప్పుడు దాని దాడిని ఎదుర్కొని తనను కాపాడు

కొంటుంది. పోలియో, మీసిల్స్, యెల్లో ఫీవరు మొదలైన వాటి వాక్సినేషన్ పద్ధతిలో అయా వైరస్ ల క్రియాశీలతను నశింప చేసిన, లేదా బలహీనపరచిన వైరస్ కణాలను వాడారు.




## Methods for vaccine production before the COVID-19 pandemic

*© The Nobel Committee for Physiology or Medicine. Ill. Mattias Karlén*


అణుజీవశాస్త్రం(మాలిక్యులార్ బయోలజీ) లో జరిగిన అభివృద్ధి వల్ల పూర్తి వేరస్ ని కాకుండా, వైరస్ యొక్క జెనిటిక్ కోడ్ లో ఒక భాగాన్ని వాడుతూ తయారు చేసే వాక్సీన్ లు రూపొందాయి. ఉదాహరణకి హెపటైటిస్ బి, మానవ పాపిలోమా వైరస్ లకు ఈ పద్ధతిలో వాక్సీన్ లను రూపొందించారు. మరొక రకంగా వైరస్ జెనిటిక్ కోడ్ లో భాగాన్ని తీసి దానిని ప్రమాదకారి కాని 'క్యారియర్ వైరస్' లో చొప్పించి వాక్సినేషన్ లో వాడుతారు. క్యారియర్ వైరస్ ని 'వైరల్ వెక్టార్' అని అంటారు. శరీరంలో ఈ వెక్టార్ చేరినప్పుడు వైరస్ కి చెందిన ఆ ప్రత్యేక ప్రోటీన్ శరీరంలో ఉత్పత్తి చెందగా రోగ నిరోధక శక్తి ఉత్తరోత్తరా ఆ వైరస్ ని ఎదుర్కొనగలుగుతుంది. ఇబోలా వైరస్ వేక్సినేషన్ కి ఈ పద్ధతిని వాడారు.


ఈ పద్ధతులన్నిటిలో కణ వర్ధనం(cell culture) చేయాల్సి వుటుంది. అందుకు ఎక్కువ కాలం పడుతుంది. కోవిడ్-19 వంటి మహమ్మారులు ప్రపంచంలో వేగంగా వ్యాపిస్తున్న తరుణంలో అత్యవసరంగా యుద్ధప్రాతిపదికన

తగిన వాక్సీన్ ను రూపొందించి అందుబాటులో వుంచాల్సి వస్తుంది. అందువల్ల కణ వర్ధనంతో పనిలేకుండా వేక్సీన్ సాంకేతికతను అభివృద్ధి చేయాలన్నతలపుతో పరిశోధకులు చాలా కాలంనుండి ప్రయత్నాలు మొదలు పెట్టారు. వారికది ఒక సవాలు. కటలిన్ కారికో, డ్రూ వైస్మన్ ల mRNA వాక్సినేషన్ సాంకేతికతాభివృద్ధి తో అది సాధ్యమైంది.

## mRNA అంటే ఏమిటి?

జీవరాశుల మనుగడకు ప్రోటీన్ లు అవసరమైన అణువులు. ఇవి జీవకణాలలో ప్రత్యేకమైన విధులను నిర్వర్తిస్తాయి. జీవరాశుల ఈ అవసరాన్ని తీర్చడానికి ఆయా కణాలలోనే ప్రోటీన్ లు తయారవుతాయి. ఈ తయారీకి కణాలలోనే ఒక యంత్రాంగం పని చేస్తూ వుంటుంది. ఈ పని నిర్వహించదంలో రైబోసోమ్ ల పాత్ర ప్రముఖమైనది. అందుకే జీవశాస్త్రవేత్తలు రైబోసోమ్ ను 'జీవకణాల స్వీయ ప్రోటీన్ యంత్రాగారం' అని చెపుతారు. సూక్ష్మ జీవులనుండి మనుషులదాకా అన్ని రకాల జీవజాతుల జీవకణాలలో రైబోసోమ్ లు వుంటాయి. రైబోసోమ్ నశించిన నాడు జీవి బతకదు.




ప్రోటీన్ సంశ్లేషణలో రైబోసోమ్ కణాంగాలైన DNA( డీ ఆక్సీ రైబో న్యూక్లియేక్ యాసిడ్ Deoxyribonucleic acid), RNA (రైబో న్యూక్లియేక్ యాసిడ్ –Ribonucleic acid) ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి.

RNA రకాలైన దూత RNA (messenger ribonucleic acid, denoted as mRNA), బదిలీ RNA (tRNA), రైబోసోమ్ లలో వుండే రైబోసోమ్ ల RNA (rRNA) లు సంశ్లేషణ చేయాల్సిన ప్రోటీన్ లలో

వుండాల్సిన ఆమ్ల వరుస క్రమాన్ని నిర్దేశిస్తూ పని చేస్తాయి. వీటి మూలంగా విశిష్ట లక్షణంగల ప్రోటీన్ తయారవుతుంది. DNA జీవులలో వంశపారంపర్య లక్షణాలను కలుగచేసే అణువు. దీనికి రెండు పోగులు జంటగా పెనవేసుకొన్న నిర్మాణం వుటుంది.దీనిలొ నలుగు నత్రజని కారకాలు (Nitrogen bases) వరుసక్రమంలో అమరి వుంటాయి. వీటిని శాస్త్రవేత్తలు A,C,G,T అక్షరాలతో సూచిస్తారు. RNA అణువులో A,C.G,U లు అమరి వుంటాయి.

ప్రోటీన్ సంశ్లేషణ లో DNA అణువులోనిరెండు పోగులు విడి పోతాయి. విడిపోయిన రెండు పోగులలో ఒక పోగుకు సంపూరకంగా RNA దూత పోగు– మెసెంజర్ RNA (mRNA) ఏర్పడుతుంది. అనగా ఈ విధానంలో DNAఅణువు mRNA ప్రతిరూపాన్ని ఏర్పరుస్తుంద న్నమాట. దీనిని శాస్త్రవేత్తలు అనులేఖనం (transcription) అంటారు. mRNA ఏర్పడ్డాక అది కణం నుండి కణద్రవ్యంలోకి (cytoplasm of the cell) ప్రవేశిస్తుంది. అక్కడ mRNA తెచ్చిన సమాచారం ప్రోటీన్ అణువుగా అనువదించడం జరుగుతుంది. ఆవిధంగా ప్రోటీన్ గొలుసు తయారీ కొనసాగుతుంది.

ఎప్పుడైతే కణవర్ధనాన్ని (cell culture) నిర్వహించ వలసిన అవసరంతీరి, బయట పరీక్ష నాళికలోనే mRNA అనులేఖనాన్ని (in vitro transcription) నిర్వర్తించ గలిగారో అప్పడె– 1980 చివరలలోనే సమర్ధవంతమైన mRNA వాక్సీన్ లను రూపొందించ వచ్చునని శాస్త్రవేత్తలు ఊహించారు.

## mRNA వేక్సినేషన్ పని చేసే తీరు

వైరస్ యొక్క mRNA ముక్కని ( ఇది విరస్ కి సంబంధించిన ప్రోటీన్) మానవ శరీరంలోకి చొప్పించడంతో mRNA వాక్సీన్ పనిచేస్తుంది. ఈ mRNA వాడుతూ కణాలు వైరల్ ప్రోటీనును తయారుచేస్తాయి. శరీరపు రోగ నిరోధక వ్యవస్థ ఆ ప్రోటీన్ ని విదేశీయ మైనదిగా గుర్తించి ప్రతి నిరోధకాలైన (antibodies) ప్రత్యేక రకపు ప్రోటీన్ లను ఉత్పత్తి చేస్తుంది.ఇవి వ్యాధికారకాలను నశింప చేస్తాయి.mRNA వాక్సీన్ తీసికొనిన వ్యక్తి శరీరంలో వ్యాధి ప్రతి నిరోధకాలు ఏర్పడి వుంటాయి కాబట్టి, అతను ఆ అంటు వ్యాధి బారిన పడడు.

జీవరసాయన శాస్త్రవేత్త కెటలిన్ కరికో 1990 లో తన పరిశోధనను mRNA ని వైద్య చికిత్సకై అభివృద్ధి చేయాలన్న లక్ష్య ము పై నే కేంద్రీకరించింది.

ఈమె హంగేరి నుండి యు. ఎస్ కి వచ్చింది. పెన్సెల్వేనియా యూనివర్సిటి కి చెందిన రోగనిరోధక శాస్త్రవేత్త డ్రూ వైస్మన్ ని 1997 లో ఒక పరిశోధనాపత్రపు ఫొటో కాపీ తీసికొనదానికి వెళ్ళినప్పుడు ఆ షాపులో కలిసింది. డ్రూ వైస్మన్ కొత్తగా పెన్సెలేవేనియా యూనివర్సిటీలో కొత్తగా నియమితుడు. కెటలిన్ కరికో 1989 నుండీ అక్కడే పనిచేస్తూన్నది అతను డెన్డ్రిటిక్ కణాల పరిశోధన పై ఆసక్తి కలవాడు.వీరిద్దరూ కలసి mRNA లపై పరిశోధనను చేపట్టారు.


డెన్డ్రిటిక్ కణాలు(dendritic cells) ప్రత్యేక రకానికి చెందిన రోగ నిరోధక కణాలు. ఇవి కణ జాలములలో( tissues) వుంటాయి. ఉదాహరణకి చర్మము పై వున్న ఇవి రోగనిరోధక ప్రతిస్పందనలను పెంచుతూ రోగ కారకాలను రోగనిరోధక వ్యవస్థలొని ఇతర కణాలకు చూపెడతాయి.ఈ విధంగా డెన్డ్రిటిక్ కణాలు అనుకూల రోగనిరోధక ప్రతిస్పందనలను అదుపులోపెడతాయి. మనకి జ్వరము వచ్చినప్పుడు పొడచూపే తాపజనక ప్రతిస్పందన (inflammation) మనకి మేలు చెసేది. అనగా శరీరము యొక్క తాపజనక వ్యవస్థ (inflammatory system) సరిగ్గాపని చేస్తున్నదనడానికి నిదర్శనము. టీకా తీసికొన్నాక వచ్చే వాపు అటువంటిదే!. కానీ వాపు అరోగ్యవంతమైన కణజాలాల దగ్గర వచ్చి చాలాకాలం పాటు తగ్గకుండా వుంటే అది శరీరానికి హాని చేస్తుంది. వాంఛనీయంకాదు.

పరీక్షనాళికీయ అనులేఖన mRNA(in vitro transcribed mRNA) ని శరీరంలో ప్రవేశ పెట్టినప్పుడు హానికరమైన తాపజనక ప్రతిస్పందన (inflammation) గమనించారు. డెన్డ్రిటిక్ కణాలు mRNA ని విదేశీయపదార్థంగా గుర్తించి, క్రియశీలమై వాపు సంకేతాలనిచ్చే అణువుల విడుదలకు దారితీసాయి. కానీ క్షీరదాల కణాల నుండీ వచ్చే mRNA ఇటు వంటి క్రియాశీలతను ప్రదర్శించలేదు. ఈ తేడాను గననించి కారికో, డ్రూ వైస్మన్ శాస్త్ర వేత్తలు ఆశ్చర్య చకితులయ్యారు. ఈరెండు రకాల mRNAల రసాయన ధర్మాలలో చాలా కీలక మైన తేడా వుండవచ్చని వారు భావించారు.

RNAలో A, U, G, & C, నాలుగు నత్రజని క్షారాలు (Nitrogen bases) వుంటే వాటికి అనురూపంగా DNA లో A, T, G, & C గా సూచించే జెనిటిక్ కోడ్ అక్షరాలు వుంటాయి. క్షీరద కణాల RNAలో ఇవి తరచు సవరణలకు లోనవుతూ వుంటాయి. పరీక్ష నాళికీయ అనులేఖన mRNA లో సవరణలుండవు. సవరణ లేనందునే అవాంఛనీయ వాపు ప్రతి స్పందనలకి

కారణమేమో అనుకొన్నారు. తెలుసు కోవడానికి వారు నలుగు నత్రజని కారకాలను చాలా విధాలుగా మారుస్తూ డెన్డ్రిటిక్ కణాలలో ప్రవేశపెడుతూ ఫలితాలను గమనిస్తూ వున్నారు. ఫలితాలు అత్యద్భుతంగా వచ్చాయి. వాపు ప్రతిస్పందనలు దాదాపుగా మృగ్యమైపోయాయి. ఈ పరిశోధనా పలితాలవల్ల కణాలు వివిధ mRNAలను ఎలాగుర్తించి, స్పందిస్తాయన్న అవగాహనకు వచ్చారు. కటలిన్ కారికో, డ్రూ వైస్మన్ శాస్త్రవేత్తలు తమ పరిశోధన mRNA చికిత్సా రంగంలో చాలా బలమైన ప్రభావాన్ని ఛుపగలదని నమ్మారు. వినూత్నమైన ఈ ఫలితాలను 2005 సంవత్సరంలో, కోవిడ్ రావడానికి 15 సంవత్సరాలకి ముందే కటలిన్ కారికో, డ్రూ వైస్మన్ శాస్త్రవేత్తలు ప్రచురించారు.

కటలిన్ కారికో, డ్రూ వైస్మన్ శాస్త్రవేత్తలు mRNA నాలుగు క్షారాలలో ఒకదానిని మార్చి పోగుని సవరించారు. పోగులోని uridine (U) స్థానంలో pseudo uridine ని ప్రవేశపెట్టారు ( ఛూడు పటము) ఈ సవరణ తో డెన్డ్రిటిక్ కణాలను ఉత్తేజ పరిచే mRNA సామర్థ్యాన్ని అణచగలిగారు. ఆవిధంగా అవాంఛనీయ వాపు ప్రతిస్పందనను నివారించగలిగారు.




mRNA contains four different bases, abbreviated A, U, G, and C. The Nobel Laureates discovered that base-modified mRNA can be used to block activation of inflammatory reactions (secretion of signalling molecules) and increase protein production when mRNA is delivered to cells.

*© The Nobel Committee for Physiology or Medicine. Ill. Mattias Karlén*




mRNA chains contained in a modern coronavirus vaccine.

*Photo/Credit: MikeMareen/iStockphoto*




C9H12N2O6 uridine




Pseudo uridine

Pseudo uridine is an isomer of the nucleoside uridine in *which the uracil is attached via a carbon-carbon instead of a nitrogen-carbon glycosidic bond.*

2005 లో వైజ్ఞానిక లోకం వీరి పరిశోధన ప్రాముఖ్యతను గుర్తించి అభినందించలేదు. కోవిడ్–19 మహమ్మారి విజృంబణతో వీరి ప్రయోగాత్మక కృషి ఫలితాల గొప్పదనం ఏస్థాయిదో, తెలిసిరాగా, ఈ జంట శాస్త్రవేత్తలు అభివృద్ధి పరచిన సాంకేతికత సమయానికి అక్కరకు వచ్చింది. కంపెనీలు ఈ వాక్సీన్లను తొందరగా తాయరు చేసి అందుబాటు లోకి తేవాలని పని మొదలుపెట్టాయి. Pfizer/BioNTech, Moderna లు కారికో, విస్మన్ ల సాంకేతికతను వాడుకొని కరోనావైరస్ కి వాక్సీన్ లను అందించి జనాలను కాపాడాయి.

వైద్యరంగంలో వచ్చిన ఈ నోబెల్ పురస్కారం కేవలం వారి వైజ్ఞానిక పరిశోధనా పటిమ మాత్రమేకాదు, దీని వెనక పురస్కార గ్రహీతల మొక్కవోని దీక్ష, వైజ్ఞానిక పరిశోధన పట్ల అనురక్తి వున్నాయి. "ఏదీ నా దృష్టిని పరిశోధననుండి మరల్చ లేదు" అని నొబెల్ మీడియా కి చెందిన ఆడమ్ స్మిత్ తో విస్మన్ చెప్పాడు. కారికోకి తన కుటుంబంనుండి తప్పించి ఇంకెక్కడనుడీ ప్రోత్సాహం లభించలేదు. అనేక వొడిదుడుకలకు నిలబడి పరిశోధనపై ఏకాగ్రత తో పట్టువదలక కృషి చేసింది. కారికో గురించిన పూర్తి వివరాలు నేటి సైన్స్ విద్యార్థులు తెలిసోవలసిన అవసరం వుంది.

**References:**

1. https://webbook.nist.gov/cgi/cbook.cg
2. Nobel Prize in Physiology or Medicine 2023 https://www.nature.com/collections/bieheeeddf
3. Interview with the 2023 Nobel Prize laureate in physiology or medicine Katalin Karikó on 6 December 2023 during the Nobel Week in Stockholm, Sweden
4. https://www.nobelprize.org/all-nobel-prizes-2023/

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక
సంపుటి 4 | సంచిక 2 ఏప్రిల్–జూన్ 2024

మమత-సమత-మానవత
www.gurajada.org



## ధన్యోస్మి

ఏప్రిల్ – జూన్ 2024 సంచికలో ప్రచురణ కోసం మంచి వ్యాసాలు రాసి పంపిన వ్యాసకర్తలకి శతకోటి నమస్సులు.

ఈ సంచిక వెలువరించడంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించిన వారందరో, వారందరికీ వందనములు.

ప్రచురణ కోసం కథలు, కవితలు, పరిశోధనా వ్యాసాలు పంపమని రచయితలను కోరుతున్నాము.

ఎప్పటిలాగే పాఠకులు ఈ సంచిక ను కూడా చదివి ఆనందిస్తారని ఆశిస్తాను.

చదవండి, చదివించండి

భవదీయుడు
ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ
ప్రధాన సంపాదకులు

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 4 | సంచిక 2 ఏప్రిల్-జూన్ 2024

మమత-సమత-మానవత
www.gurajada.org



దిట్టమైన శిల్పాల దేవళాలు
కట్టుకథల చిత్రాంగి కనక మేడలు
కొట్టుకొని పోయె కొన్ని కొటిలింగాలు
వీరేశలింగమొకడు మిగిలెను చాలు

వేదంలా ఘోషించే గోదావరి
అమరధామంలా శోభిల్లే రాజమహేంద్రి
శతాబ్దాల చరిత గల సుందర నగరం
గతవైభవ దీప్తులతో కమ్మని కావ్యం

## ఆరుద్ర

1925 ఆగస్టు 31 - 1998 జూన్ 4